fb/prajasakti, www.prajasakti.com

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajamahendravaram, Srikakulam, ongole and Ananthapuramu

సంపుటి : 37 సంచిక : 51 | విజయవాడ, బుధవారం 21 ఫిబ్రవరి 2018 | 12 + 12 పేజీలు వెల : 4.00

మాటల తూటాలు

అవిశ్వాసంతో మోడీ సర్కారుకు ముప్పు : ఉండవల్లి

కేంద్రాన్ని పడగొట్టడం అంత తేలిక కాదు : సోము వీర్రాజు

అసమర్ధ సిఎం చంద్రబాబు : రామకృష్ణ

రాష్ట్రాభివృద్ధిని అడ్డుకోవాలనే యోచన కేంద్రానికి లేదు : ఆకుల

నాడిచ్చిన హామీల అమలులో వైఫల్యం : పల్లంరాజు

2



ఆడిటర్లదే తప్పు!

పిఎన్‌బి మోసంపై మౌనం వీడిన ఆర్థిక మంత్రి జైట్లీ

న్యూఢిల్లీ : దేశంలోనే రెండవ అతి బ్యాంక్ అయిన పంజాబ్ నేషనల్ బ్యాంక్(పిఎన్‌బి)లో రూ.11, 400 కోట్లు మోసం జరగడంపై ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ కుంభకోణం వెలుగులోకి వచ్చిన వారం తరువాత తన మౌనం వీడారు. బ్యాంకింగ్ వ్యవస్థను మోసం చేస్తున్న వారిని ప్రభుత్వం పట్టుకుంటుందని మంగళవారం ఆయన చెప్పారు. పంజాబ్ మిగతా 9లో

బాబు నోట హోదా మాట

అది మన హక్కు

రాష్ట్రానికి ఇవ్వాల్సిందేనంటూ డిమాండ్

ప్రజాగ్రహమే కారణమా?

> ' 14వ ఆర్థిక సంఘం ఇకపై ప్రత్యేక హోదా ఇయ్యవద్దని సిఫార్సు చేసిందని బిజెపి ప్రభుత్వం చెప్పింది. అందుకే ప్రత్యేక ఆర్థిక సహాయానికి ఒప్పుకున్నాం. అది కూడా హోదాతో సమానంగా ఉంటుందని చెప్పారు. ఇప్పుడు మిగిలిన రాష్ట్రాలకు హోదా కొనసాగిస్తున్నారు. ఇతర రాష్ట్రాలకు కొనసాగిస్తున్నప్పుడు మనకు కూడా అదేపేరుతో ఇవ్వాల్సిందే. అది మన హక్కు. దానిని ఎవ్వరూ కాదనలేరు'
>
> – టిడిపి సమన్వయ కమిటీలో చంద్రబాబు

ప్రజాశక్తి – అమరావతి బ్యూరో

'ప్రత్యేకహోదా ప్రతిపత్తిని మిగతా రాష్ట్రాలకు కొనసాగిస్తున్నప్పుడు మాకు ఎందుకు ఇవ్వరు? వేరే రాష్ట్రాలకు ఇస్తున్నప్పుడు మాకూ అదే పేరుతో ఇవ్వాల్సిందే' అని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు డిమాండ్ చేశారు. మంగళవారం జరిగిన తెలుగుదేశం పార్టీ సమావేశంలో ఆయన చేసిన ఈ వ్యాఖ్య ఆ పార్టీ శ్రేణులతో పాటు, రాజకీయ వర్గాల్లోనూ చర్చనీయాంశమైంది. వాస్తవానికి కొద్దిరోజుల కిందటి వరకు చంద్రబాబు దీనికి పూర్తిభిన్నంగా మాట్లాడిన విషయం తెలిసిందే. ఒక దశలో 'హోదా ఏమన్నా సంజీవనా? అన్ని సమస్యలను అది పరిష్కరిస్తుందా?' అని ఆయన ప్రశ్నించారు. టిడిపి కి చెందిన కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ఇతర నాయకులు కూడా అన్ని స్థాయిల్లోనూ ఇదే వాదన వినిపించారు. ఇప్పుడు ఒక్కసారిగా ఆ పార్టీ వైఖరి మారడం ఆసక్తికరంగా మారింది. విశ్వసనీయ సమాచారం ప్రకారం ప్రత్యేకహోదాకు అనుకూలంగా ప్రజానీకంలో పెద్దఎత్తున వ్యక్తమవుతున్న స్పందనే దీనికి కారణం. ఇటీవల వామపక్షాలు నిర్వహించిన బంద్ పిలుపునకు అనూహ్యమైన స్పందన రావడం, భారీ ఎత్తున విజయవంతం కావడం టిడిపి నాయకత్వంలో చర్చనీయాంశంగా మారింది. ఇంటిలిజెన్స్‌తో పాటు ఇతర వర్గాల నివేదికలూ ఇదే అంశాన్ని స్పష్టం చేశాయి. ఒకటి,రెండు రోజుల్లో ప్రజా ఆగ్రహం చల్లబడిపోతుందని తొలుత టిడిపి నాయకులు అంచనా వేసినట్లు తెలిసింది. ఈ కారణంగానే వామపక్షాల బంద్ తరువాత కూడా ముఖ్యమంత్రి, ఇతర టిడిపి నాయకులు ప్రత్యేక ప్యాకేజికి అనుకూలంగా మాట్లాడుతూ వచ్చారు. 'హోదాకు సమానంగా ప్యాకేజి' అన్న అంశాన్ని ప్రచారంలో పెట్టడానికి మిగతా 9లో

బిజెపికి కౌంటర్ ఎలా?

- అధికారులతో ముఖ్యమంత్రి మంతనాలు
- గణాంకాలతో కుస్తీ

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి – అమరావతి

రాష్టానికి అందిన సాయం, చేసిన ఖర్చు విషయంలో కేంద్రానికి, రాష్ట్రానికి మధ్య అంకెల వివాదం క్రమంగా వేడెక్కింది. ఉన్నతాధికారులెవరైనా ఈ గణాంకాల విశ్లేషణతోనే గడిపేస్తున్నారు. ఢిల్లీలో శుక్రవారం తెలుగు రాష్ట్రాల అధికారులతో కేంద్ర హెూం శాఖ కీలక భేటీ నిర్వహిస్తున్న నేపథ్యంలో అధికారుల కసరత్తు వేగవంతమైంది. అటు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్‌కుమార్, ఇటు ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా ఆర్థిక శాఖ అధికారులతో సమీక్షించారు. గణాంకాలపై ఎప్పటికప్పుడు వివరాలు క్రోడీకరిస్తున్న రాష్ట్ర పునర్విభజన విభాగం ఉన్నతాధికారులు కూడా సచివాలయానికి వచ్చి ఈ సమీక్షలో పాల్గొన్నారు. బడ్జెట్‌లో నిధులు ఇవ్వకపోవడం, హెూదాపై స్పందించకపోవడంతో రాష్ట్రంలో అన్ని పార్టీల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఈ వివాదం చివరికి మోడీ సర్కారుపై అవిశ్వాసం పెడతామని జగన్ ప్రకటించడం, దానికి జనసేన నేత పవన్ కూడా వత్తాసు పలకడంతో రాజకీయం వేడెక్కింది. ఈ ప్రకటనలతో చంద్రబాబునాయుడూ కొంతవరకు ఇరుకున పడాల్సి వచ్చింది. బిజెపి నేతలు కూడా పొత్తు నుంచి బయటకు వచ్చేయాలన్న డిమాండ్ తీవ్రతను పెంచడంతో తెలుగుదేశం ఉక్కిరిబిక్కిరవుతోంది. చివరకు తన మిగతా 9లో

అఖిలపక్షం కాదు సంఘాల భేటీ

- పార్టీలూ హాజరుకావచ్చు
- అవిశ్వాసంతో బిజెపిని ఏం చేయలేం
- టిడిపి సమన్వయ కమిటీ సమావేశంలో సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి–అమరావతి బ్యూరో

ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం అమలుపై రాష్ట్ర ప్రభుత్వం అఖిల సంఘాల సమావేశం నిర్వహిస్తుందని తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తెలిపారు. సోమవారం ఆయన స్వగృహంలో జరిగిన మిగతా 9లో



ఉండవల్లిలోని సిఎం నివాసంలో టిడిపి సమన్వయ కమిటీ సమావేశంలో పాల్గొన్న చంద్రబాబు

చర్చలు విఫలం.. సమ్మె యథాతథం

విద్యుత్ జెఎసి నేత బాలకాశీ



అలంకార్ సెంటర్‌లో 2వ రోజు ధర్నా చేస్తున్న విద్యుత్ కార్మికులు

ప్రజాశక్తి–అమరావతి బ్యూరో

విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల సమ్మెను కొనసాగించాలని ఐక్య వేదిక నేతలు నిర్ణయించారు. ఆ శాఖ మంత్రి కళా వెంకట్రావు సమక్షంలో సచివాలయంలో మంగళవారం సాయంత్రం జరిగిన చర్చలు విఫలమయ్యాని జెఎసి కన్వీనర్ బాలకాశీ తెలిపారు. చర్చల్లో మంత్రితోపాటు ట్రాన్స్‌కో సిఎండి విజయానంద్, జెఎండి దినేష్ పరుచూరి ఉన్నారు. కార్మికుల డిమాండ్లపై విద్యుత్ సంస్థలు నియమించిన కమిటీ నివేదికను సంస్థ తనకు అందిందని నివేదికలో ఉన్న అంశాలను అమలు చేయడానికి సిద్ధంగా ఉన్నామని మంత్రి కళా వెంకట్రావు చెప్పారు. ట్రాన్స్‌కో సిఎండి విజయానంద్ మాట్లాడుతూ ఈ నెల 23వ తేదీన కమిటీ నివేదిక అందజేయాల్సి ఉండగా కార్మికుల ఆందోళనల నేపథ్యంలో మంగళవారమే నివేదికను ప్రభుత్వానికి అందజేశామని తెలిపారు. నివేదికలో ఏ అంశాలు ఉన్నాయనే విషయాన్ని తెలియజేయా లని కార్మిక సంఘం తరుపున చర్చల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గఫూర్, జెఎసి కన్వీనర్ బాలకాశీ కోరారు. నివేదికలో అంశాలు జెఎసి నేతలకు చెప్పారు. కార్మికులకు ఇచ్చిన ఏ హామీనైనా ఏప్రిల్ 1వ తేదీ నుంచి అమలు చేస్తామన్నారు. ఈ అంశాలన్నీ ముఖ్యమంత్రి చంద్రబాబుతో చర్చించాల్సి ఉందని, అందుకు కొంత సమయం కావాలని నేతలను కోరారు. గతంలో ఇచ్చిన హామీలు అమలు చేస్తామని అనుకూలంగా ఉన్నాయని మాత్రమే చెప్పారు. మంత్రి హామీల్లో స్పష్టత లేదని గ్రహించిన ఐక్య వేదిక నేతలు ఉద్యమాన్ని ఉధృతం చేయాలని నిర్ణయించారు. అన్ని జిల్లా సంఘాల నేతలు ఆయా జిల్లాలకు చేరుకుని సమ్మె ఉధృతం చేసేందుకు అవసరమైన మిగతా 9లో

నేడు కమల్ పార్టీ ప్రారంభం

- సాయంత్రం మధురైలో ప్రకటన
- హాజరు కానున్న కేజ్రీవాల్ ప్రభృతులు
- పలు ప్రాంతాల్లో బహిరంగ సభలు
- రాష్ట్ర వ్యాప్త పాదయాత్ర కూడా



చెన్నై/న్యూఢిల్లీ : ప్రముఖ సినీ నటుడు కమల్‌హాసన్ బుధవారం మధురైలో తన రాజకీయ పార్టీని ప్రారంభించనున్నారు. ఆ రోజున కమల్‌హాసన్ తలపెట్టిన నాలుగు ప్రధాన కార్యక్రమాల్లో పార్టీ ప్రారంభోత్సవం ఒకటి. ఈ నేపథ్యంలో ఆయన తమిళనాడుకు చెందిన పలువురు నేతలను కలిశారు. తొలుత గత ఆదివారం మరో ప్రముఖ నటుడు రజనీకాంత్‌ను కలుసుకుని పార్టీ ప్రారంభోత్సవానికి రావలసిందిగా ఆహ్వానించారు. తాను ఈ రాజకీయ ప్రయాణాన్ని ప్రారంభించడానికి ముందు తాను ఇష్టపడే వ్యక్తులను కలిసినట్లు చెప్పారు. డిఎంకె అధ్యక్షుడు కరుణానిధి, వర్కింగ్ ప్రెసిడెంట్ మిగతా 9లో

జల వివాదాలపై ఒకే ట్రిబ్యునల్

కేంద్ర సహాయ మంత్రి మేఘవాల్

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రాల మధ్య నదీ జలాల వివాదాల పరిష్కారానికి జాతీయ స్థాయిలో ఒకే ట్రిబ్యునల్ ఏర్పాటుకు ప్రక్రియ ప్రారంభించినట్టు కేంద్ర జల వనరుల శాఖ సహాయ మంత్రి అర్జున్ రాం మేఘవాల్ వెల్లడించారు. మార్చి 5 నుంచి ప్రారంభమయ్యే రెండో విడత బడ్జెట్ సమావేశాల్లో ఈ బిల్లును ప్రవేశపెడుతున్నట్టు ఆయన తెలిపారు. హైదరాబాద్‌లో మంగళవారం జరిగిన దక్షిణాది రాష్ట్రాల జలవనరుల సదస్సుకు కేంద్ర మంత్రి మేఘవాల్ అధ్యక్షత వహించారు. ఇక ముందు జాతీయ స్థాయిలో ఒకే ట్రిబ్యునల్ పని చేస్తుందని, రాష్ట్రాల కోసం ప్రత్యేకంగా ట్రిబ్యునళ్లు ఉండవని ఆయన వివరించారు. సదస్సు అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ దక్షిణాది ఆరు రాష్ట్రాల జల వనరుల తొలి సమావేశం జయప్రదంగా ముగిసిందని చెప్పారు. నదుల వారీగా ట్రిబ్యునళ్లు



ఉంటే డబ్బు వృథాయే కాకుండా కాలయాపన అవుతుందన్నారు. దక్షిణాది రాష్ట్రాల జలవనరుల సమావేశాన్ని హైదరాబాద్ డిక్లరేషన్‌గా పిలవ వచ్చునని, సంక్లిష్టమైన వ్యవహారాలను ఇంకా జటిలం చేయొద్దని మంత్రులు, ఉన్నతాధికారులకు ఆయన విజ్ఞప్తి చేశారు.

యథావిధిగా తెలుగు రాష్ట్రాల వాదనలు

కృష్ణా–గోదావరి జల వివాదాలపై తెలుగు రాష్ట్రాలు రెండూ ఈ దక్షిణాది సదస్సులో మరోసారి తమ తమ వాదనలు వినించాయి. గోదావరి నదిలో నీటి లభ్యతపై సమగ్ర అధ్యయనం చేసిన తర్వాతే నదుల అనుసంధానంపై నిర్ణయం తీసుకోవాలని తెలంగాణ డిమాండ్ మిగతా 9లో

నేటి నుంచి టెట్ పరీక్షలు

- 4,46,833 లక్షల మంది అభ్యర్థులు
- మార్చి 16న ఫలితాలు

ఆ తర్వాత డిఎస్సీ– మంత్రి గంటా

ప్రజాశక్తి–అమరావతి బ్యూరో/ రాజమహేంద్రవరం ప్రతినిధి

ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)లు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. తొలిసారిగా ఈ పరీక్షలను ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్నారు. మూడు పేపర్లకు 4,46,833 మంది అభ్యర్థులు ఈ పరీక్ష రాయనున్నారు. ఎస్జీటి పోస్టుల (పేపర్–1)కు 1,80,249 మంది, స్కూల్ అసిస్టెంట్ (పేపర్–2) పోస్టులకు 2,12,794 మంది, భాషా పండిత (పేపర్–3) పోస్టులకు 53,290 మంది రాయనున్నారు. 183 కేంద్రాలను విద్యాశాఖ ఏర్పాటు చేసింది. వీటిలో 159 రాష్ట్రంలోనూ, 24 ఇతర రాష్ట్రాల్లోనూ ఏర్పాటు చేసింది. మార్చి 3 వరకు ఈ పరీక్షలను రోజుకు 52వేల మంది అభ్యర్థులు రాయనున్నారు. ఫిర్యాదుల కోసం విద్యాశాఖ హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసింది. పరీక్షలు ముగిసిన మరుసటి రోజు మార్చి 4న ప్రాథమిక 'కీ'ని విడుదల చేసి, మార్చి 9 వరకు అభ్యంతరాల స్వీకరిస్తారు. మార్చి 12న తుది కీని, 16న ఫలితాలను మిగతా 9లో


కుల వృత్తులపై చిన్నచూపు

- 10 నెలల్లో ఆర్థిక సాయం 9.31 శాతమే
- లక్ష్యం 5,680 కోట్లు.. ఇచ్చింది 528 కోట్లే
- ముఖం చాటేసిన బ్యాంకులు



ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి – అమరావతి

చిన్న చిన్న కుల వృత్తులు చేసుకునే వారికి అందించే ఆర్థిక సహాయంపై అటు ప్రభుత్వం ఇటు బ్యాంకులు చిన్న చూపు చూస్తున్నాయి. గత రెండు ఆర్థిక సంవత్సరాల్లో భారీగా లక్ష్యాలు నిర్దేశించుకున్నా, వాటి సాధన సాకారం కాలేదు. బ్యాంకులు చేయాల్సిన రుణ సహకారం లక్ష్య సాధన పది శాతానికి మించలేదు. వివిధ కార్పొరేషన్ల ద్వారా నేరుగా ప్రభుత్వం అందించే ప్రాయోజిత పథకాల్లో లక్ష్య సాధన 30 శాతం దాటలేదు. దీంతో లబ్ధిదారులకు నిరాశే ఎదురైందనే విమర్శలున్నాయి. 2016–17 ఆర్థిక సంవత్సరానికి ప్రభుత్వ ప్రాయోజిత పథకాలకు వివిధ కార్పొరేషన్ల ద్వారా 2.18 లక్షల మందికి రూ. 3,457 కోట్ల మేర ఆర్థిక సహాయాన్ని అందించాలనేది లక్ష్యం. ఇందులో 1.66 లక్షల మందిని గుర్తించి రూ. 2,020 కోట్లు మాత్రమే కేటాయించారు. దీంట్లో కూడా మిగతా 9లో











నేడు రాష్ట్ర కేబినెట్ భేటీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర మంత్రి మండలి సమావేశం సచివాలయంలోని మొదటి బ్లాకు సమావేశ మందిరంలో బుధవారం ఏర్పాటు కానుంది. ఈనెల 23న మంత్రి మండలి సమావేశం నిర్వహించాలని ముందుగా నిర్ణయించారు. అయితే అదే రోజు విభజన హామీలపై చర్చిం చేందుకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్ కుమార్ సహా పలువురు ఉన్నతాధికారు లను ఢిల్లీ రావాల్సిందిగా కేంద్ర హోం శాఖ నుంచి పిలుపు వచ్చిందని సమాచారం. అందు వల్ల ఈ సమావేశాన్ని ఇక్కడ రెండు రోజుల ముందుగానే నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిసింది. కేంద్రం ఇచ్చిన నిధులపై సమగ్ర సమాచారంతో రావాలని అధికారులకు ఆదేశాలందాయి.

విధుల బహిష్కరణ

విధులను బహిష్కరించి వెలుపలకు వస్తున్న ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయ ఉద్యోగులు, సిబ్బంది



సమ్మెలో ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ ఉద్యోగులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం నిధులను ఈ వర్సిటీ అభివృద్ధికే వినియోగించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం నుంచి ఉద్యోగులు నిరవధిక సమ్మె బాట పట్టారు. దాదాపు 200 మంది ఉద్యోగులు సమ్మెలో పాల్గొనడంతో వర్సిటీ కార్యకలాపాలు స్తంభించిపోయాయి. పది రోజుల ముందే వైస్ ఛాన్సలర్‌కు సమ్మె నోటీసు ఇచ్చామని, అయినా ప్రభుత్వం ఈ విషయం తెలియనట్లు వ్యవహరిస్తోందని ఉద్యోగులు ధ్వజమెత్తారు. వర్సిటీ నిధులను బోధనాస్పత్రులకు మళ్లించే జీవో 8ను వెంటనే రద్దు చేయాలని, అమరావతిలో ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీకి స్థలం కేటాయించాలని ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఉద్యోగుల ఆందోళనకు ఏపి ఎన్జీఓ మద్దతు తెలిపింది. ఎన్జీఓ జెఎసి కృష్ణా జిల్లా అధ్యక్షుడు ఎ. విద్యాసాగర్ మాట్లాడుతూ సిఆర్‌డిఎ పరిధిలో ప్రయివేటు వర్సిటీలకు వందలాది ఎకరాలు కేటాయించి. సొంత రాష్ట్రంలోని వర్సిటీకి మాత్రం భూమిని కేటాయించకపోవడం విచారకరమన్నారు. వర్సిటీ ఉద్యోగులకు వేతనాలు, మెడికల్ రీయింబర్స్‌మెంట్ చెల్లింపులకు ప్రభుత్వ సహకారం లేనప్పటికీ సొంతగా సమకూర్చుకున్న వనరుల నుంచే ఖర్చు చేసుకుంటున్నారని తెలిపారు. ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వనరుల పరిరక్షణ సమితి కో- చైర్మన్ ఎమ్.వి. అక్కిరాజు మాట్లాడుతూ పదో షెడ్యూల్ సంస్థల్లో ఉన్న హెల్త్ యూనివర్సిటీ నిధులను పునర్విభజన చట్టం ప్రకారం 42 శాతం భవిష్యత్తులోనైనా చెల్లించాలన్నారు. ప్రస్తుతం వర్సిటీ నిధులు దాదాపు రూ 450 కోట్లు ఉంటే తెలంగాణకు వాటాగా సుమారు రూ 123 కోట్లు చెల్లించాల్సి వస్తుందన్నారు. ఇక మిగిలిన రూ 320 కోట్లలో ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు రూ 167 కోట్లు మళ్లిస్తే వర్సిటీకి మిగిలేది రూ 153 కోట్లేనన్నారు. దీంతో వర్సిటీ మనుగడ ప్రశ్నార్థకమయ్యే అవకాశముందన్నారు. ఉద్యోగులు చేపట్టిన ఆందోళనపై విసి సివి. రావుకు వినతిపత్రం అందజేశారు. ఏపిఎన్జీఓ అసోసియేషన్ నాయకులు ఎమ్‌డి. ఇక్బాల్, కోనేరు రవి మద్దతు తెలిపారు.



పొడి వాతావరణమే

ప్రజాశక్తి- విశాఖపట్నం ప్రతినిధి

లక్షద్వీప్ నుంచి తూర్పు మధ్య అరేబియా సముద్రం వరకు కర్నాటక తీరానికి ఆనుకుని అల్పపీడన ద్రోణి కొనసాగుతోందని భారత వాతావరణ శాఖ పేర్కొంది. ఇది తూర్పు దిశగా గోవా తీరం నుంచి ఉత్తర మధ్య మహారాష్ట్ర వైపు కదులుతున్నట్లు తెలిపింది. వీటి ప్రభావం రాష్ట్రంపై ఉండబోదని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. రాగల నాలుగు రోజులు కోస్తా, సీమల్లో పొడి వాతావరణమే కొనసాగుతుందని పేర్కొంది.

ప్రజ్ఞ

సమాధానాలు 7లో

1. పూర్తిగా మహిళలే నడపనున్న రైల్వే స్టేషన్ ఏది?
2. ముంబై-పూణే మధ్య హైపర్‌లూప్ నెట్‌వర్క్ నిర్మించనున్న కంపెనీ ఏది?
3. 2018-19 సీజన్ ఐపిఎల్, బిసిసిఐ దేశవాళీ మ్యాచ్‌ల ప్రసార హక్కులను సొంతం చేసుకున్న సంస్థ ?
4. ప్రముఖ గాయిని ఆశా భోంస్లేకు ఇటీవల లభించిన పురస్కారం?
5. సెంట్రల్ ఎలక్ట్రోకెమికల్ రీసర్చ్ ఇనిస్టిట్యూట్ ఎక్కడ ఉంది?

రైల్వే పోస్టులకు అర్హత మార్చేందుకు కృషి చేయాలి

ముఖ్యమంత్రికి డివైఎఫ్ఐ లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో


రైల్వే బోర్డు విడుదల చేసిన గ్రూపు సి, డి నోటిఫికేషన్‌కు పదో తరగతి అర్హత ఉండే విధంగా కేంద్ర ప్రభుత్వంతో చర్చించాలని కోరుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఎం సూర్యారావు లేఖ రాశారు. గ్రూపు సి, డి పోస్టులకు గతంలో పదో తరగతి అర్హతగా ఉండేదని తెలిపారు. వీటి కోసం రాష్ట్రంలో లక్షలాది మంది అభ్యర్థులు కోచింగ్‌లు తీసుకొని సన్నద్ధం అవుతున్నారని వివరించారు. వారి ఆశలపై నీళ్లుచల్లే విధంగా రైల్వే నోటిఫికేషన్ ఇచ్చిందని పేర్కొన్నారు. 90 శాతం పోస్టులకు కేవలం ఐటిఐ అర్హతగా పేర్కొందని, అప్పులు చేసి కోచింగ్ తీసుకుంటున్న ఎస్సీ,ఎస్టీ, బిసి, మైనార్టీ, పేద, మధ్యతరగతి నిరుద్యోగ యువత తీవ్ర మనోవేదనకు గురయ్యారని తెలిపారు. ఆగ్రవేశా లతో ఉన్న అభ్యర్థులు సోమవారం విజయ నగరం, విశాఖపట్నంలో రోడ్లపైకి వచ్చి నోటిఫికేషన్ పాత పద్ధతిలోనే కొనసాగించాలని ఆందోళనకు దిగారని గుర్తు చేశారు. అభ్యర్థుల మనోవేదనను అర్థం చేసుకొని రైల్వే మంత్రి , శాఖాధిపతులతో చర్చించి న్యాయం జరిగేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.

మాటల తూటాలు

ప్రజాశక్తి యంత్రాంగం

ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు విషయంలో రాష్ట్రానికి చెందిన పలువురు రాజకీయ పార్టీల నేతల మధ్య బుధవారం మాటల తూటాలు పేలాయి. అవిశ్వాసానికి ఇదే సమయమనీ, మోడీ సర్కారుకు ముప్పు ఏర్పడనుందని రాజమండ్రికి చెందిన మాజీ ఎంపి ఉండవల్లి అరుణ్‌కుమార్ చెప్పగా... పొరుగు జిల్లాకు చెందిన బిజెపి ఎమ్మెల్సీ సోము వీర్రాజు ...కేంద్రాన్ని పడగొట్టడం అంత తేలిక కాదని, పార్లమెంటులో ఒక్కసారి కూడా మాట్లాడని ఉండవల్లి కేంద్రంపై అవిశ్వాసం పెట్టాలని కోరడం సరికాదన్నారు. రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకోవాలనే యోచన కేంద్రానికి లేదని బిజెపికే చెందిన రాజమండ్రి ఎమ్మెల్యే ఆకుల సత్యనారాయణ తెలిపారు. సిపిఐ రామకృష్ణ తాడేపల్లి గూడెంలో మాట్లాడుతూ రాష్ట్ర విభజన నేపథ్యంలో కేంద్రం నుంచి నిధులు రాబట్టడంలో, ప్రత్యేకహోదా విషయంలో, బడ్జెట్‌లో రాష్ట్రాభివృద్ధికి నిధుల కేటాయింపు విషయంలో చంద్రబాబు పూర్తిస్థాయిలో విఫలమయ్యారని విమర్శిం చారు. దేశంలోనే అసమర్థ, చేతగాని సిఎంగా నిలిచా రన్నారు మాజీ కేంద్ర మంత్రి పల్లంరాజు విజయవాడలో విలేకరులతో మాట్లాడుతూ పార్లమెంట్ సాక్షిగా నాటి ప్రధాని ఇచ్చిన హామీలను అమలుచేయడంలో ఇప్పటి ప్రభుత్వం విఫలమైందని మండిపడ్డారు.

వైసిపి అవిశ్వాసం పెడితే టిడిపి మద్దతివ్వాలి : ఉండవల్లి



బిజెపిలో అంతర్గత కుమ్ములాటలున్న నేపథ్యంలో పార్లమెంటులో అవిశ్వాసం పెడితే అన్ని పార్టీలూ మద్దతు ఇస్తాయని, వైసిపి అవిశ్వాసం పెడితే టిడిపి మద్దతు ఇవ్వాలని మాజీ ఎంపి ఉండవల్లి అరుణ్‌కుమార్ సూచించారు. రాజమహేంద్రవరం ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాజీనామాలు చేయడం, వెల్‌లోకి వెళ్లడం, నినాదాలు చేయడం పోరాటం కానేకాదన్నారు. అవిశ్వాసం ద్వారానే కేంద్రం వైఖరిపై చర్చ జరుగుతుందన్నారు. బిజెపి, టిడిపి నిధుల విషయంలో ప్రజలకు వాస్తవాలు చెప్పడం లేదన్నారు. పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి పవర్ ప్రాజెక్టు విషయంలో నిజానిజాలు త్వరలో బయటపెడతానన్నారు. ఈ సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు అల్లు బాబి, అత్యుతదేశాయ్ తదితరులు పాల్గొన్నారు.

అసమర్థ సిఎం చంద్రబాబు : రామకృష్ణ



రాష్ట్ర ప్రజల హృదయాల్లో చేతగాని సిఎంగా చంద్రబాబు చిరస్థాయిగా నిలిచిపోయారని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ తాడేపల్లి గూడెంలో విమర్శించారు. రాష్ట్ర విభజన నేపథ్యంలో కేంద్రం నుంచి నిధులు రాబట్టడంలో, ప్రత్యేకహోదా విషయంలో, బడ్జెట్‌లో రాష్ట్రాభివృద్ధికి నిధుల కేటాయింపు విషయంలో చంద్రబాబు పూర్తిస్థాయిలో విఫలమయ్యారని విమర్శించారు. దేశంలోనే అసమర్థ, చేతగాని సిఎంగా నిలిచారన్నారు.

ప్రభుత్వాన్ని పడగొట్టడం అంత తేలిక కాదు : సోము వీర్రాజు



ప్రత్యేక హోదాను సాకుగా చూపించి కేంద్ర ప్రభుత్వాన్ని పడగొట్టడం అంత తేలిక కాదని బిజెపి జాతీయ కార్యవర్గ సభ్యులు సోము వీర్రాజు అన్నారు. రాజమహేంద్రవరం ఆనం రోటరీ హాల్‌లో మంగళవారం జరిగిన బిజెపి మహిళా మోర్చా కార్యక్రమంలో పాల్గొన్న ఆయన విలేకరులతో మాట్లాడారు. పార్లమెంటులో ఒక్కసారి కూడా మాట్లాడని ఉండవల్లి కేంద్రంపై అవిశ్వాసం పెట్టాలని కోరడం సరికాదన్నారు. ప్రభుత్వాన్ని కూల్చా లని కొందరు పగటి కలలు కంటున్నారని అన్నారు. వైసిపి నేత జగన్ కేంద్రంపై అవిశ్వాసం పెడతానని చెబుతు న్నారని, అవన్నీ డ్రామాలని చెప్పారు. 'ప్రత్యేక హోదాతో ఏ మొస్తుంది. ప్రత్యేక ప్యాకేజీ వల్ల అభివృద్ధి జరుగుతుంది?' అని అనేకసార్లు ముఖ్యమంత్రి ప్రకటించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్రాన్ని కొన్ని కోరికలు కోరారని, అవి నెరవేరకపోవడంతో టిడిపి ఎంపిలతో ఆందోళన చేయిస్తున్నారని అన్నారు.

పార్లమెంట్ సాక్షిగా ఇచ్చిన ప్రత్యేక హోదా హామీని అమలు చేయాలి :పల్లంరాజు



పార్లమెంట్ సాక్షిగా రాష్ట్రానికి ఇచ్చిన ప్రత్యేక హోదా హామీని అమలు చేయాలని మాజీ కేంద్ర మంత్రి పల్లం రాజు డిమాండ్ చేశారు. విజయవాడ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ నాలుగేళ్ల గడుస్తున్నా ప్రభుత్వ వాగ్దానాలను నెరవేర్చలేకపోయారని మండిపడ్డారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం ఫిబ్రవరి 19 నుంచి 28 వరకూ ఆంధ్రుల ఆత్మగౌరవ దీక్షలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

రాష్ట్రాభివృద్ధిని అడ్డుకోవాలనే యోచన కేంద్రానికి లేదు : ఆకుల

విభజన చట్టంలో లొసుగులను అడ్డుపెట్టుకుని రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకోవాలనే యోచన కేంద్రానికి లేదని బిజెపి రాజమండ్రి ఎమ్మెల్యే ఆకుల సత్యనారాయణ తెలిపారు. విజయవాడలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విభజన చట్టంలో ఉన్న హామీలను, లేని అంశాలను కేంద్ర ప్రభుత్వం నెరవేరుస్తోందన్నారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పవన్‌పై వైసిపి నేతల ఫైర్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

జనసేన అధినేత పవన్ కళ్యాన్‌పై పలువరు వైసిపి సీనియర్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రజలకు అన్యాయం జరిగిన రోజున కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను చొక్కా పట్టుకుని నిలదీస్తానని చెప్పిన జనసేన పవన్ కళ్యాణ్ ఇప్పుడు నింపాదిగా లెక్కలడుగుతురని వైసిపి సీనియర్ నేత బొత్స సత్యనారాయణ పేర్కొన్నారు. విజయవాడలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. తాము అన్నింటికీ సిద్ధమే అని జగన్ ప్రకటించిన తరువాత అవిశ్వాసం పెట్టమని పవన్ ఉచిత సలహా ఇస్తున్నాడన్నారు. చంద్రబాబుకు ఇబ్బందికర పరిస్థితులు ఎదురవ్వగానే పవన్ రంగంలోకి వస్తున్నాడని దీనితో అసలు సమస్య పక్కదారి పడుతోందన్నారు. వైసిపి అధికార ప్రతినిధి అంబటి రాంబాబు మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ చిన్న పిల్లాడిలా వ్యవహరిస్తు న్నారని పేర్కొన్నారు. అవిశ్వాసానికి 'మీ పార్టనర్ (టిడిపి)'ను ఒప్పించమని పవన్‌ను ప్రతిపక్ష నేత జగన్ కోరారని అంతేకానీ ఎక్కడా సవాల్ చేయలేదన్నారు. ముఖ్యమంత్రిపై పోరాడాల్సిన పవన్ ప్రతిపక్షాలను ప్రశ్నించడంలో ఆంతర్యమేమిటన్నారు. ఇప్పటికైనా ఆయన వైఖరిని స్పష్టం చేయాలన్నారు.

టిడిపిలో దళితులపై పెరిగిన నేరాలు : మేరుగు నాగార్జున

టిడిపి ప్రభుత్వ హయాంలో దళితులపై దాడులు పెరిగాయని వైసిపి ఎస్సీ సెల్ అధ్యక్షులు మేరుగు నాగార్జున విమర్శించారు. పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఎమ్మెల్యే ఆదిమూలపు సురేష్, అధికార ప్రతినిధి టిజెఆర్ సుధాకర్‌బాబులతో కలిసి ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎస్సీ అధ్యయన కమిటీ చేపట్టిన అధ్యయనం ముగిసిందన్నారు. సిఎం చంద్రబాబు దళితులకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని తెలిపారు. దళితులను ఓటు హక్కు అడిగే అర్హత ఆయనకు లేదన్నారు. జగన్ పాదయాత్ర పూర్తవ్వగానే దళిత గర్జన నిర్వహిస్తామని చెప్పారు.



ఫేస్‌బుక్ కనెక్టివిటీ హెడ్‌తో సమావేశమైన నారా లోకేశ్

ఫేస్‌బుక్ ప్రతినిధులతో లోకేశ్ భేటీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఫైబర్‌నెట్ ద్వారా గ్రామాల్లో తయారుచేసే ఉత్పత్తులను ఫేస్‌బుక్ సహకారంతో ప్రపంచ వ్యాప్తంగా తీసుకెళ్లే అవకాశముందని ఐటి శాఖ మంత్రి లోకేశ్ తెలిపారు. సచివాలయంలో మంగళవారం మంత్రితో ఫేస్‌బుక్ (ఇండియా) కనెక్టవిటీ పాలసీ హెడ్ అశ్విని రానా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రతి ఇంటికీ ఇంటర్నెట్ సదుపాయం కల్పిస్తున్నామన్నారు. ఎపిలో ఫేస్‌బుక్ మరింతగా విస్తరించేందుకు ఫైబర్ గ్రిడ్ దోహదపడుతుందన్నారు. నూతన సాంకేతికతను ఎపిలో పైలెట్ ప్రాజెక్టులుగా అమలు చేయాలని మంత్రి వారిని కోరారు. ఫైబర్‌గ్రిడ్ వేదికగా వైఫై సేవలు విస్తరించేందుకు సహకరించాలన్నారు. అధునాతన సాంకేతికతతో రూపొందించిన ఉత్పత్తుల్ని వినియోగించి, ఎపిలో పైలెట్ ప్రాజెక్టుల్ని నిర్వహిస్తామని ఫేస్‌బుక్ ప్రతినిధులు మంత్రికి తెలిపారు. గ్రామాల్లో మహిళలు తయారుచేసే ఉత్పత్తుల్ని ఆన్‌లైన్లో అమ్ముకునే విధంగా డిజిటల్ ట్రైనింగ్ ఇస్తామన్నారు. ప్రతి ఇంటికీ ఇంటర్నెట్ అందించడానికి తమ వంతు సహకారం అందిస్తామన్నారు.

మార్చి 1న ధర్నా

మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమస్యల పరిష్కారం కోసం మార్చి 1న పాఠశాల విద్యాశాఖ కమిషనర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు ఎపి మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ వెల్లడించింది. యూనియన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జి వరలక్ష్మి, కె స్వరూపరాణి మంగళవారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. రాష్ట్ర బడ్జెట్‌లో సరిపడా నిధులు పెంచాలని, ప్రైవేట్ సంస్థలకు పథకాన్ని అప్పగించొద్దని, పెండింగ్ వేతనాలు, బిల్లులు వెంటనే చెల్లించాలనే డిమాండ్లతో ధర్నాకు పిలుపునిచ్చామని వివరించారు.

ప్రజారోగ్య బాధ్యత ప్రభుత్వానిదే

- జన స్వాస్థ్య అభియాన్, ప్రజారోగ్య వేదిక

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



విజయవాడలో జరిగిన సదస్సులో ప్రసంగిస్తున్న బొడ్డు నాగేశ్వరరావు

ప్రజారోగ్య బాధ్యత ప్రభుత్వానిదే అని జన స్వాస్థ్య అభియాన్, ప్రజారోగ్య వేదిక సభ్యులు అభిప్రాయపడ్డారు. మంగళవారం విజయవాడ ఎమ్‌బి విజ్ఞాన కేంద్రంలో ఆ సంస్థల ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం ఆరోగ్య రంగానికి బడ్జెట్ కేటాయింపులపై ఆ సంఘాల నాయకులు చర్చించారు. ఈ ఏడాది బడ్జెట్‌లో వైద్యఆరోగ్య రంగానికి కేటాయింపుల పై సభ్యులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పిడిఎఫ్ ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఆర్భాటంగా వివిధ ఆరోగ్య పథకాలు ప్రవేశపెట్టిందే తప్ప వాటికి సరిపడా నిధులను కేటాయించలేదని పలువురు విశ్లేషకులు తెలిపారన్నారు. వాస్తవంగా ప్రజారోగ్యాన్ని మెరుగుపరిచే సాకుతో కార్పొరేట్ సంస్థలకు ఆదాయాన్ని పెంచేలా కేంద్ర ఆరోగ్య పథకాలున్నాయని విమర్శించారు. కార్పొరేట్ లాభాల కంటే ప్రజల ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రజల భాగస్వామ్యంతో ప్రభుత్వ ఆస్పత్రులను బలోపేతం చేసేలా విధానాలు రూపొందించాలన్నారు. ప్రజారోగ్య వేదిక రాష్ట్ర నాయకులు సుధాకర్ మాట్లాడుతూ ఆరోగ్య రంగానికి బడ్జెట్ కేటాయింపులపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ బుధవారం నుంచి సంతకాల సేకరణ చేపడతామన్నారు. వచ్చే నెల 4న విశాఖలో ఈ అంశంపై జరిగే జాతీయ సదస్సులో కేంద్ర ప్రభుత్వ మాజీ కార్యదర్శి సుజాత రావు, అమితవ గుహ పాల్గొంటారని చెప్పారు. సమావేశంలో ప్రజారోగ్య వేదిక సభ్యులు మాకినేని కిరణ్, సాయి ప్రసాద్, ఎ. వంశీకృష్ణ, ప్రజారోగ్యవేదిక కృష్ణా జిల్లా కమిటీ కన్వీనర్ జెఎమ్. సంతోష్ కుమార్, ఏపి మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యు.వి. కృష్ణయ్య, యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్, గవర్నమెంట్ హాస్పటల్ స్టాఫ్ నర్స్ యూనియన్ తదితర ప్రజాసంఘాల నేతలు పాల్గొన్నారు.

దళితులపై దాడి చేసిన దుండగులను అరెస్టు చేయాలి

కెవిపిఎస్ డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

చిత్తూరు జిల్లా కురాకులపల్లి గ్రామంలోని దళితులపై దాడి చేసిన నిందితులను వెంటనే అరెస్టు చేయాలని కెవిపిఎస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి అంద్ర మాల్యాద్రి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ కారెం శివాజికి మంగళవారం లేఖ రాశారు. దళిత యువతి అపర్ణను అవమాన పరచి, దళిత పేటపై దాడి చేసిన పెత్తందారి దుండగులపై చర్యలు చేపట్టాలని కోరారు. 70 మంది పెత్తందారులు దాడి చేస్తే కేవలం 18 మందిపై కేసు నమోదు చేశారని తెలిపారు. బాధితులపై కౌంటర్ కేసులు పెట్టారని తెలిపారు. అధికార పార్టీకి చెందిన నిందితులకు టిడిపి నేత, మాజీ ముఖ్యమంత్రి సోదరుడు కిషోర్ కుమార్‌రెడ్డి అండ ఉందని విమర్శించారు. కురాకులపల్లి గ్రామాన్ని సందర్శించి దళితులకు న్యాయం చేయాలని చైర్మన్‌ను కోరారు. దళితులకు రక్షణ కల్పించి, నిందితులకు అనుకూలంగా ఉన్న అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. అట్రాసిటీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. దళితులపై కుల వివక్ష నివారణకు ప్రచార కార్యక్రమం చేపట్టాలని కోరారు. ఈ లేఖ కాపీలను డిజిపి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో పాటు దళిత ప్రజా ప్రతినిధులకు పంపారు.

గిరిజన వెతలు

సబ్‌ప్లాన్ నిధులకు తూట్లు

ప్రపంచ బ్యాంకు సహాయనిధి ఊసెత్తని ప్రభుత్వం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



ఏజెన్సీ ప్రాంతాల్లోని గిరిజన గ్రామాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం రూపొందించిన ప్రపంచ బ్యాకు సహాయ నిధి పథకం లక్ష్యానికి రాష్ట్ర ప్రభుత్వం తూట్లు పొడుస్తోంది. ఈ పథకం ద్వారా కేంద్రం నుంచి రావాల్సిన నిధుల ఊసెత్తకుండా గిరిజన సబ్‌ప్లాన్ నిధులతో ఏజెన్సీ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు ఉపక్రమిస్తోంది. కేంద్రం ఈ పథకాన్ని ప్రారంభించి రెండేళ్లవుతున్నా, ఆ పథకం కింద రావాల్సిన నిధులకు సంబంధించి ఇంతవరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనల్ని రూపొందించలేదు.

గిరిజన ఆవాసాలకు రోడ్లు, తాగు నీరు, విద్య, వైద్యం తదితర మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా ప్రపంచ బ్యాంకు సహాయ నిధి పేరుతో కేంద్ర ప్రభుత్వం ఒక పథకాన్ని రెండేళ్ల క్రితం ప్రారంభించింది. దీన్ని రాష్ట్ర ప్రభుత్వం సహ యంతో అమలు చేయాలని నిర్ణయించింది. ఈ పథకం ద్వారా చేపట్టే కార్యక్రమాల వివరాలు, ఏయే కార్యక్రమానికి ఎంత మొత్తంలో నిధులు అవసరమవుతాయో సవివరంగా ప్రతిపాదనలు రూపొందించి పంపాలని కేంద్రం కోరింది. కానీ విద్యకు, మిగిలిన కార్యక్రమాలకు సంబంధించి ఇంత వరకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఒక ప్రతిపాదన కూడా కేంద్రానికి పంపలేదని తెలిసింది.

గిరిజన గురుకుల పాఠశాలల భవన నిర్మాణాలకు సుమారు రూ. 600 కోట్లతో ఇటీవలే ప్రతిపాదనల్ని పంపినట్టు ఆ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకొచ్చాక సంక్షేమ వసతి గృహాల్ని గురుకులాలుగా మార్చాలని ప్రకటించిన విషయం తెలిసిందే. అందులో భాగంగా 179 ప్రభుత్వ గిరిజన సంక్షేమ వసతి గృహాల్ని 80 గురుకులాలుగా, 30 ఆశ్రమ పాఠశాలలుగా మార్చింది. వీటికి సరైన భవనాలు లేవు. గిరిజన గూడేలకు తాగు నీటి సరఫరా, రోడ్ల నిర్మాణాలు మాత్రం కేంద్రం ఇచ్చే నిధులతో చేపట్టాల్సి ఉన్నా, సబ్‌ప్లాన్ నిధులతోనే చేపట్టడం గమనార్హం. సుమారు 9,641 గిరిజన ఆవాసాలకు రూ. 155 కోట్లతో తాగు నీరు, రూ. 808 కోట్లతో 2,623 కిలోమీటర్ల మేర రోడ్లు వేస్తున్నట్టు ఇది వరకే ప్రభుత్వం ప్రకటించింది.

అయితే కేంద్ర ప్రభుత్వ పథకానికి సబ్‌ప్లాన్ నిధుల్ని వినియోగించడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కేంద్రం ఇచ్చే నిధులతో సంబంధం లేకుండా సబ్‌ప్లాన్ నిధుల్ని వెచ్చించాల్సి ఉంటుంది. కానీ ప్రభుత్వం ఇందుకు విరుద్ధంగా తీసుకున్న నిర్ణయంపై అధికారులు సైతం ముక్కున వేలేసుకుంటున్నారు. రాజకీయ స్వప్రయోజనాల కోసమే ఈ నిర్ణయాన్ని తీసుకున్నట్టు విమర్శలు వినిపిస్తున్నాయి.

ఇదిలా ఉండగా, సబ్‌ప్లాన్ నిధులతో పనులు చేపట్టి, అటు తర్వాత ప్రతిపాదనలు పంపే ఆలోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉన్నట్టు సమాచారం. కేంద్రం విడుదల చేసే నిధుల్ని రియంబర్స్ చేసుకోవచ్చనే ఆలోచన చేస్తున్నట్టు తెలిసింది. ఇదే జరిగితే నిధులు భారీగా దుర్వినియోగమయ్యే అవకాశముందన్న చర్చ జరుగుతోంది.

సంక్షిప్తం

ఆలయాల సమస్యలు పరిష్కరించండి : మంత్రి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

దేవాలయాలోని సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని దేవదాయ, ధర్మదాయ శాఖ మంత్రి మాణిక్యాలరావు అధికారులను ఆదేశించారు. సచివాలయంలో మంగళవారం తన ఛాంబర్‌లో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆలయాల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలన్నారు. సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించాలన్నారు. ఈ సమావేశంలో ప్రిన్సిపల్ సెక్రటరీ మన్మోహన్ సింగ్, కమిషనర్ అనురాధ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఫుడ్ ప్రాసెసింగ్‌పై ప్రత్యేక దృష్టి : అమరనాథరెడ్డి

ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించామని పరిశ్రమల శాఖ మంత్రి ఎన్ అమరనాథ రెడ్డి అన్నారు. మంగళగిరిలోని ఎపిఐఐసి పారిశ్రామికవాడలో నెలకొల్పిన లిండే ఫుడ్ ల్యాబ్ అండ్ ట్రైనింగ్ సెంటర్‌ను మంగళవారం ఆయన ప్రారంభించారు. చంద్రబాబునాయుడు కృషి ఫలితంగా మరో అంతర్జాతీయ స్థాయి పరిశ్రమ రాష్ట్రానికి వచ్చిందన్నారు. ప్రాసెసింగ్ పరిశ్రమలు రాష్ట్రంలో ఏర్పాటు చేయడం వల్ల రైతులు తాము పండించిన ఉత్పత్తులకు గిట్టుబాటు ధరను అందుకోవడంతో పాటు స్థానికంగా ఉపాధి అవకాశాలు కూడా దక్కుతాయని తెలిపారు. ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఆర్ ప్రీతమ్‌రెడ్డి, లిండే ల్యాబ్ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

24 నుంచి సిఐఐ భాగస్వామ్య సదస్సు

ఈనెల 24 నుంచి 26 వరకు విశాఖలో సిఐఐ భాగస్వామ్య సదస్సు జరుగుతుందని పరిశ్రమల శాఖ మంత్రి ఎన్. అమరనాథ రెడ్డి అన్నారు. మంగళవారం సచివాలయంలో విలేకర్ల సమావేశంలో ఆయన సదస్సు వివరాలను వెల్లడించారు. ఈ సదస్సుకు 14 దేశాలకు చెందిన వాణిజ్య మంత్రులు, 39 దేశాలకు చెందిన ప్రతినిధులు, ప్రముఖ కంపెనీలకు చెందిన వ్యాపారవేత్తలు మొత్తం 2500 మందిని ఆహ్వానించామన్నారు. అనంతపురంలోని కియా ప్లాంట్‌లో రూఫ్ వర్క్ ఇన్‌స్టలేషన్ పనులను ఈనెల 22న ముఖ్యమంత్రి ప్రారంభిస్తారని తెలిపారు.

సుభాష్‌చంద్ర ఫౌండేషన్‌కు డాక్యుమెంట్లు ఇవ్వండి

అగ్రిగోల్డు, బ్యాంకులను ఆదేశించిన హైకోర్టు

ప్రజాశక్తి - హైదరాబాద్

అగ్రిగోల్డ్ కంపెనీ ఆస్తులు, అప్పులు డాక్యుమెంట్లను సుభాష్ చంద్ర ఫౌండేషన్‌కు ఇవ్వాలని బ్యాంకులను, అగ్రిగోల్డ్ కంపెనీని హైకోర్టు ఆదేశించింది. అగ్రిగోల్డ్ కంపెనీని స్వాధీనం చేసుకునేందుకు సిద్ధంగా ఉన్నామని ఫౌండేషన్ ముందుకు వచ్చింది. అగ్రిగోల్డ్ కంపెనీ డిపాజిటర్లను మోసం చేసిందని, సిబిఐ విచారణ జరిపించాలని కోరుతూ దాఖలైన రిట్లను మంగళవారం హైకోర్టు విచారణ జరిపింది. ఆస్తుల స్వాధీనానికి అవసరమైన డాక్యుమెంట్లు అందజేసేలా ఉత్తర్వులు ఇవ్వాలని ఫౌండేషన్ తరపు లాయర్ కోరారు. పత్రాలు ఇచ్చేందుకు అగ్రిగోల్డ్ కంపెనీ రెడీగానే ఉందని ఆ కంపెనీ లాయర్ బదులిచ్చారు. అగ్రిగోల్డ్ ఆస్తులు, అప్పుల పత్రాలన్నింటినీ ఫౌండేషన్‌కు ఇవ్వాలని న్యాయమూర్తులు రామసుబ్రమణియన్, ఎస్.వి.భట్‌లతో కూడిన డివిజన్ బెంచ్ ఆదేశాలిచ్చింది. విచారణ రెండు వారాలకు వాయిదా వేసింది.

తెలుగు రాష్ట్రాల మధ్య 'టీవీ, ఫిల్మ్' వివాదం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలుగు రాష్ట్రాల మధ్య మరో వివాదం తలెత్తింది. ఫిల్మ్, టీవీ అండ్ థియేటర్ ఆర్ట్స్ అభివృద్ధి సంస్థకు చెందిన ఆస్తులు రెండు రాష్ట్రాల మధ్య వివాదానికి కారణమయ్యాయి. హైదరాబాద్‌లోని ఫిల్మ్, టీవీ అండ్ థియేటర్ ఆర్ట్స్ అభివృద్ధి సంస్థలో తమ వాటా కింద వచ్చిన భవనాలను అమ్ముకోవాలని ఎపి ప్రభుత్వం నిర్ణయించింది. దీనికి సంబంధించి సాధ్యాసాధ్యాలను పరిశీలించేందుకు 8 మంది సభ్యులతో సోమవారం జీవో నెంబర్ 362ను విడుదల చేసింది. దీంతో తెలంగాణ ప్రభుత్వం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. విభజన చట్టంలోని 9వ షెడ్యూల్‌లో ఉన్న సంస్థ అని, పూర్తిగా సంస్థ విభజన జరగకుండా ఎలా భవనాలను అమ్ముతారని ప్రశ్నించింది. దీనిపై మంగళవారం తెలంగాణ సిఎస్ జోషి ఉన్నతాధికారులతో అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి చర్చించారు.

బతికున్నప్పుడే కాదు.. చనిపోయిన తర్వాత కూడా దళితులు వివక్షను ఎదుర్కోక తప్పడం లేదు. రాష్ట్రంలోని దళితులకు.. చివరకు శ్మశానభూమీ కరువవుతోంది. రాష్ట్రం మొత్తంగా శ్మశాన సమస్యలున్న గ్రామాలు ఏడు వేల వరకూ ఉన్నాయి. అసలు శ్మశానాలే లేని గ్రామాలు నాలుగు వేలున్నాయి. ఆక్రమణలకు గురయినవి సుమారు 2,500 గ్రామాలున్నాయి.

చనిపోయాకా సమస్యే !

• దళితులకు శ్మశాన భూమీ కరువు • అటకెక్కిన శ్మశాన భూముల కొనుగోలు పథకం

శ్మశాన స్థల సమస్యలున్న గ్రామాలు : 7 వేలు
శ్మశానాలు లేని గ్రామాలు : 4 వేలు
శ్మశానాలు ఆక్రమణలకు గురైనవి : 2500

ప్రజాశక్తి - యంత్రాంగం

రాష్ట్రంలో దళితులకు శ్మశానాలు లేకుండా పోవడమో.. ఎక్కడైనా ఉన్నా వాటిని పెత్తందార్లు ఆక్రమించుకోవడమో.. అభివృద్ధి పేరిట ప్రభుత్వం ఆ స్థలాల్లో భవనాలు నిర్మించడమో చేస్తోంది. ఉన్నచోట వాటికి దారులు లేకపోవడం, మృతి చెందిన వ్యక్తిని రోడ్ల పక్కన, పొలం గట్ల పక్కన ఖననం చేయాల్సి రావడం దళితుల దుస్థితిని తెలుపుతోంది. వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వ కాలంలో రాష్ట్రంలో శ్మశాన భూముల కొనుగోలు పథకం జిఒ నెం.1235ను విడుదల చేసినా ఈ ప్రభుత్వం దాన్ని అమలు చేయడం లేదు. శ్మశానాలను ఏర్పాటు చేయాలని రాష్ట్రంలో దళితులు అనేకచోట్ల పోరాటాలు చేసినా.. ప్రభుత్వం చెవిటివాని ముందు శంఖం ఊదిన చందంగా వ్యవహరిస్తోంది. కొన్నిచోట్ల సుదీర్ఘకాలం ఉద్యమాలు నిర్వహించి కాసింత శ్మశాన భూములను దక్కించుకున్న ఘటనలున్నా.. మొత్తంగా చూసినప్పుడు దళితుల శ్మశానాల గురించి ప్రభుత్వం మాత్రం పట్టించుకోవడం లేదు.

కృష్ణాజిల్లాలో 970 పంచాయతీ లుండగా 275 దళితవాడలకు అసలు శ్మశానాలే లేవు. 150 గ్రామాల్లో శ్మశానాలకు రహదారి సౌకర్యం లేదు. 175 దళితపేటల్లో శ్మశానాలు పెత్తందార్ల ఆక్రమణకు గురయ్యాయి. ఇందుకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని ప్రభుత్వాల ముందుంచినా కనీస స్పందన లేకుండా పోయింది. దీంతో కెవిపిఎస్ ఉద్యమిస్తోంది.

గుంటూరు జిల్లాలో 600 గ్రామాల్లో శ్మశానాలు ఏర్పాటు చేయాలని అధికారుల వద్ద వినతులు పెండింగ్‌లో ఉన్నాయి. పెరుగుతున్న జనాభా, మరణాలకు అనుగుణంగా శ్మశాన స్థలాలు లేవు. కొత్తవి కేటాయించడం లేదు. ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. కొన్నిచోట్ల మెరక తోలాలని కోరినా పట్టించుకోవడం లేదు. ఆక్రమణలకు గురవటం వంటి అంశాలపై కెవిపిఎస్ ఆధ్వర్యంలో గతేడాది ఆగష్టు 1 నుంచి 14 వరకు సామాజిక చైతన్య యాత్రలు నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లో శ్మశాన భూముల సమస్యపై కూడా సిపిఎం, కెవిపిఎస్ ఆధ్వర్యంలో చైతన్య యాత్రలు చేశారు.

విజయవాడలో 35 డివిజన్లలోని 80 పేటల్లో 80 వేల మంది దళితులు నివసిస్తున్నారు. వీరికి పలు ప్రాంతాల్లో 12 శ్మశానవాటికలున్నాయి. శతాబ్ధం నాటి శ్మశాన వాటికలు చాలా వరకూ ఖననాలతో నిండిపోయినా ప్రభుత్వాలు స్థలాలు కేటాయించడం లేదు. దళితులు, దళిత క్రైస్తవులకు చెందిన శ్మశానవాటికల అభివృద్ధి, స్థలం కేటాయింపుల్లోనూ అధికార పార్టీ వివక్షత చూపుతోందనే విమర్శ ఉంది.

రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు సొంతూరు విశాఖ జిల్లా నర్సీపట్నం మున్సిపాలిటీ పరిధిలోని పెదబొడ్డేపల్లిలో 5 ఎకరాల పైగానే శ్మశానస్థలాన్ని దళితులకు కేటాయించారు. ఇందులో కొంత స్థలం ఆక్రమణకు గురికాగా, మరికొంత స్థలాని బిసి బాలుర వసతి గృహానికి, మున్సిపల్ కార్యాలయానికి కేటాయించారు. ఎకరా స్థలం మాత్రమే మిగిలి ఉంది. స్థలం లేక సమాధి పక్కనే మరొకరిని సమాధి చేయాల్సి వస్తోంది. దీనికి తోడు శ్మశానవాటిక తుప్పలు డొంకలతో నిండి ఉంది. దళితులు తమ శ్మశాన స్థలాన్ని తమకే ఉంచాలని పలు దఫాలు ఆందోళనలు చేశారు. అయినా ఎలాంటి ప్రయోజనం లేదు.

ఫలితాలివ్వని శ్మశాన భూమి కొనుగోళ్లు

కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) సుదీర్ఘ పోరాటాల అనంతరం 2008లో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వం రాష్ట్రంలో శ్మశాన భూముల కొనుగోలు పథకాన్ని ప్రవేశపెడుతూ జిఒ 1235ను విడుదల చేసింది. ఇది ఆచరణలోకి వచ్చి దశాబ్ద ఆశించిన ఫలితాలు దక్కలేదు. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడున్నరేళ్ల కాలంలో శ్మశాన భూముల కోసం కృష్ణాజిల్లాలో కేవలం 1.47 ఎకరాలను సేకరించింది. ఇందులో దొండపాడుకు చెందిన 50 సెంట్లు, గుడివాడ పట్టణంలోని బేతవోలులో 97 సెంట్లు ఉన్నాయి. అవనిగడ్డ మండలంలోని పాతశిరువోల్లంకలో 50సెంట్లు, పమిడిముక్కల మండలంలోని పైడికొండలపాలెంలో 87 సెంట్లు, నూజివీడు మండలం పోతిరెడ్డిపాడు దళితవాడలో 17 సెంట్లు, నందిగామ మండలం గోళ్లమూడి దళితవాడకు ఎ.1.64 సెంట్ల భూమిని కొనుగోలు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. అయితే ఇంతకు మించి ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు.

శ్మశానాన్ని చేపల చెరువుగా తవ్వాలనుకున్నారు..

పశ్చిమ గోదావరి జిల్లా ఉండి మండలం చిలుకూరులో దళితుల శ్మశాన భూమిని అక్రమించుకుని చేపల చెరువుల తవ్వాలని, రోడ్లు వేయాలని పెత్తందార్లు ప్రయత్నించారు. కెవిపిఎస్ ఆధ్వర్యంలో దళితులు నెలరోజులకు పైగా ఉద్యమం చేశారు. ఎట్టకేలకు దళితుల ఉద్యమానికి పెత్తందార్లు దిగొచ్చారు. మండల కేంద్రం ఆకివీడు లోనూ దళితుల శ్మశాన వాటిక భూమిని కొంత మంది అక్రమించుకునేందుకు ప్రయత్నించారు. కెవిపిఎస్ ఆధ్వర్యంలో దళితులు పోరాటం చేయ డంతో వెనక్కి తగ్గారు.

తణుకు సజ్జాపురంలోని శ్మశాన వాటిక భూమిని సబ్‌స్టేషన్‌కు కేటాయించడంపై పెద్దఎత్తున ఆందోళన సాగింది. ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరిస్తామని చెప్పడంతో సద్దుమణిగింది. నిడదవోలులో పది ఎకరాల దళితుల శ్మశాన భూమని కొంతమంది పెత్తందారు తమ పొలాల్లో కలిపేసుకోవాలని ప్రయత్నించారు. దీనిపై దళితులు పెద్దఎత్తున పోరాడారు. చివరికి దిగొచ్చిన నాయకులు, అధికారులు, శ్మశాన వాటిక భూమి చుట్టూ ప్రహరీ నిర్మించేందుకు రూ. రెండుకోట్లు నిధులు మంజూరు చేశారు.



అనంతపురం జిల్లా కలెక్టరేట్ ముట్టడికి ప్రదర్శనగా బయలుదేరిన దళితులు

దళితుల శ్మశానంలో పెత్తందారులు.. వాగుల్లో.. వంకల్లో.. దళితులు

కర్నూలు జిల్లాలో దళితులకు శ్మశాన వాటికల సమస్య తీవ్రంగా ఉంది. దాదాపు 1500 గ్రామాలుంటే సగం ఊళ్లలో శ్మశానాల సమస్య ఉంది. 117 గ్రామాల్లో రోడ్లు, వంకల్లోనే మృతదేహాలను పూడ్చి పెడుతున్నారు. కర్నూలు జిల్లా కౌతాళం మండలం బదినేహాళ్ వంకలో శవాలను పూడుస్తుండడంతో రెండడుగుల లోతులోనే నీళ్లుఊరి శ్మశానమంతా దుర్గంధం వెదజల్లుతోంది. ఇదే గ్రామంలో దళితులు వంకలో పూడుస్తుంటే గ్రామంలో మిగిలిన సామాజిక తరగతులవారు గ్రామంలోని దళితులకు చెందిన ఐదున్నర ఎకరాల శ్మశానాన్ని దౌర్జన్యంగా స్వాధీనం చేసుకొని శవాలను పూడ్చిపెడుతున్నారు. దళితులు మాత్రం కర్నూలు నగర శివార్లలోని పసుపులలో రోడ్డుపైనే పూడ్చిపెడుతున్నారు. నగరంలోని వీకర్‌సెక్షన్ కాలనీ ప్రజలు ఎవరైనా చనిపోతే 5 కిలోమీటర్ల దూరంలో ఉండే కల్లూరు శ్మశాన వాటికకు శవాలను తీసుకుపోవాల్సిన దుస్థితి ఉంది.

జిఒ 1235ను పట్టించుకోవడం లేదు



నాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో కెవిపిఎస్., దళిత సంఘాల ఐక్య కృషితో జిఒ (నెంబరు 1235) ఇచ్చారు. అందులో.. దళితులకు శ్మశాన స్థలం లేకపోతే ప్రభుత్వ స్థలంలో ఏర్పాటు చేయాలి. ప్రభుత్వ స్థలం లేకపోతే ప్రయివేట్ భూమిని కొనుగోలు చేసి ఏర్పాటు చేయాలి. ఆక్రమణలను నిరోధించి దళితులకు అప్పగించాలి. విద్యుత్ సౌకర్యం కల్పించి బోర్లు, షెడ్లు ఏర్పాటు చేయాలి. ఆయా జిల్లాల జాయింట్ కలెక్టర్లు ఈ వ్యవహారంపై దృష్టి పెట్టాలి. కానీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదు.

- కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.మాల్యాద్రి

శ్మశాన స్థలాల సాధనలో కెవిపిఎస్ విజయం

అనంతపురం జిల్లాలో శ్మశానవాటికల కోసం 2016లో కెవిపిఎస్ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళనలు కొనసాగాయి. ఆ సంఘం ఆధ్వర్యంలో జిల్లాలో 63 మండలాలకు గాను 54 మండలాల్లో రెండు నెలల పాటు ప్రతి గ్రామాన్నీ సర్వే చేసి శ్మశానవాటికలు లేని దళితవాడలను గుర్తించారు. జిల్లా వ్యాప్తంగా 541 ఎకరాలు శ్మశాన వాటికలకు స్థలాలు కావాలని గుర్తించి వాటిని అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. తహశీల్దారు కార్యాలయాల ఎదుట చావుడప్పు కొట్టి తమ నిరసనను వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టరు కార్యాయం ముట్టడిని చేపట్టారు. ఈ ఆందోళనలకు అధికారులు దిగిరాక తప్పలేదు. శ్మశానాల కోసం 157.98 ఎకరాల భూమిని అప్పగించింది.

శ్రీరామ్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్

SHRIRAM HOUSING FINANCE

నమోదు కార్యాలయం: ఆఫీసు నెం. 123, అనగప్ప నైకన్ వీది, చెన్నై-600001.
ప్రధాన కార్యాలయం: లెవల్ 3, వోక్‌హార్డ్‌ట్ టవర్స్, ఈస్ట్ వింగ్ సి-2 బ్లోక్, బంద్ర కుర్ల కాంప్లెక్స్, బంద్రా (తూర్పు), ముంబాయి 400051.
టెలిఫోన్: 022 4241 0400, 022 4060 3100, వెబ్‌సైట్: **www.shriramhousing.in**

ఎస్సెట్ యొక్క ఆన్‌లైన్ ఇ-వేలం అమ్మకం

శ్రీరామ్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారి సెక్యూరిటైజేషన్ మరియు రికన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (2002 యొక్క 54) మరియు దాని యొక్క శక్తిలను చట్ట ప్రకారం సూచిస్తూ దిగువ ఆస్తి యొక్క వేలం "ఏది ఏ పద్దతిన ఆదారంగా" మరియు "ఆ పద్దతిన ఉన్న" "ఆన్‌లైన్ ఇ-వేలం" దాని యొక్క బకాయిలను మరియు తదుపరి వడ్డీలను చెల్లించుటకు, చార్జీలు మరాయు ఖర్చులు ఇతర., అన్ని వివరంగా దిగువ తెలియజేసిన వెబ్‌సైట్ **https://property.samil.in** లో ఉంటాయి.

రుణగ్రహీత మరియు కో-రుణగ్రహీత యొక్క పేరు	వేలం వేయుచున్న సెక్యూర్డ్ ఆస్తి యొక్క వివరాలు మరియు దాని సరిహద్దులు	17.02.2018 వరకు జప్తు మొత్తం	బయానా (ఇఎండి) వివరములు	బయానా (ఇఎండి) (రూ.)	రిజర్వు ధర (రూ)
శ్రీమతి. తేజోవతి పుసపాటి, భర్త శివ ఆంజనేయ నాగరాజు శ్రీ శివ ఆంజనేయ నాగరాజు, తండ్రి రాజా రత్న చారి ఋణం యొక్క అకౌంట్ నెం SHLHGUNT0000018	హెచ్ నెం 2-183, సర్వే నెం 321, చమ్మరు శివారు (గ్రామం), అచ్చామెపేట (జి.పి), క్రోసుర్ (మం), గుంటేరుయ (జిల్లా), ఎస్ఆర్ఓ క్రకోసూర్ పరిధి లో ఉన్న పరిధిలో ఉన్న సరిహద్దులు, **తూర్పు వైపు:** చింతపల్లి షేక్ సైదా వారి ఇల్లు పశ్చిమం వైపు:బత్తుల నాగేశ్వరరావు గారి స్థలం దక్షిణం వైపు:షేక్ మోహిద్దిన్ వారి స్థలం ఉత్తరం వైపు:యేరువ ప్రకాష్ రెడ్డి వారి స్థలం	**రూ 17.21.142/- (పదిహేడు లక్షల ఇరువై ఒక్క వేల వంద నలభై రెండు రూపాయిలు మాత్రమే)**	దిగువ వివరించిన అకౌంట్ ద్వారా ఆర్‌టిజిఎస్/ ఎన్ఇఎఫ్‌టి ద్వారా బయానాను డిపాజిట్ చేయవలెను: బ్యాంకు పేరు: యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్ బ్రాంచి: బంద్రకుర్ల కాంప్లెక్స్ ముంబాయి బ్యాంకు అకౌంట్ నెం: ప్రస్తుత అకౌంట్ నెం: 911020013220315. ఐఎఫ్ఎస్‌సి కోడ్- **UTIB0000230**	**రూ.71,600/- (డెబ్బై ఒక్క వేల ఆరు వందల రూపాయిలు మాత్రమే)** **బయానా దాఖలుకు చివరి తేది 22 మార్చి 2018 అనగా గురువారం సా.6.00గం॥లకు** **ముందుగా ఆస్థి యొక్క తనికీ తేది మరియు సమయం: 20 మార్చి 2018 అనగా మంగళవారం ఉ11:00 నుంచి మ12:00 వరకు**	రూ. 7,16,000/- (ఏడు లక్షల పదహారు వేల రూపాయిలు మాత్రమే) బిడ్ పెరుగుదల రూ 10,000/- మరియు వాటి మల్టిపుల్స్ ఇ-వేలం తేది మరియు సమయం 26 మార్చి 2018 అనగా సోమవారం ఉ 11:00 నుండి మ1:00 మధ్య
శ్రీమతి. ద్రాక్షావలి, భర్త యోసేబు@యేసోబు బందెల శ్రీ యోసేబు@యేసోబు బందెల, తండ్రి యేసు రత్నం ఋణం యొక్క అకౌంట్ నెం SHLHGUNT0000141	డో.నెం 271/1 లో ఉన్న చ.యార్డులు 193.6 యొక్క ప్రాంతం లో ఉన్న ఫ్లాటులు, మున్సిపల్ వార్డ్ నెం 12 వద్ద ఉన్నది, బ్లోక్ నెం 18, రేపల్లె పరిధిలో ఉన్నవి(గ్రామం), గ్టఊరు (జిల్లా) , రేపల్లె పరిధి లో ఉన్న పరిధిలో ఉన్న సరిహద్దులు, తూర్పు వైపు:జాయింట్ వీధి పశ్చిమం వైపు: గోరిసెట్టి రామ్మోహనరావు యొక్క ఆస్తి దక్షిణం వెపు: గుర్రం కొండ కోటయ్య యొక్క ఆస్థి ఉత్తరం వైపు:గోరిగపూడి సత్యం యొక్క ఆస్థి	**రూ 14,35,028/- (పద్నాలుగు లక్షఅ ముప్పై ఐదు వేల ఇరువై ఎనిమిది రూపాయిలు మాత్రమే) (పద్దెనిమిది లక్షల పన్నెండు వేల యాభై రూపాయిలు మాత్రమే)**	దిగువ వివరించిన అకౌంట్ ద్వారా ఆర్‌టిజిఎస్/ ఎన్ఇఎఫ్‌టి ద్వారా బయానాను డిపాజిట్ చేయవలెను: బ్యాంకు పేరు: యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్ బ్రాంచి: బంద్రకుర్ల కాంప్లెక్స్ ముంబాయి బ్యాంకు అకౌంట్ నెం: ప్రస్తుత అకౌంట్ నెం: 911020013220315. ఐఎఫ్ఎస్‌సి కోడ్- **UTIB0000230**	**రూ.1,08,000/- (లక్ష ఎనిమిది వేలు రూపాయిలు మాత్రమే)** **బయానా దాఖలుకు చివరి తేది 22 మార్చి 2018 అనగా గురువారం సా.6.00గం॥లకు** **ముందుగా ఆస్థి యొక్క తనికీ తేది మరియు సమయం: 20 మార్చి 2018 అనగా మంగళవారం ఉ11:00 నుంచి మ12:00 వరకు**	రూ. 10,80,000/- (పది లక్షల ఎనభై వేల రూపాయిలు మాత్రమే) బిడ్ పెరుగుదల రూ 10,000/- మరియు వాటి మల్టిపుల్స్ ఇ-వేలం తేది మరియు సమయం 26 మార్చి 2018 అనగా సోమవారం మ 1:00 నుండి మ3:00 మధ్య
శ్రీ షేక్ అబ్దుల్ సత్తార్, తండ్రి షేక్ ఫీర్‌సాహెబ్, శ్రీమతి. నూర్‌జహాన్ షేక్, భర్త. అబ్దుల్ సత్తార్, ఋణం యొక్క అకౌంట్ నెం **SHLHGUNT0000104**	మొత్తం స్థలం నం 5-148 లో ఉన్న ప్రాంతం 387.2 చ.యార్డులు మరియు 325.24 చ. మీటర్లు, డో.నెం 901 లో ఉన్న నిర్మాణం, పినెల్లఇ (గ్రామం) లో ఉన్న, మాచవరం (మండలం), గుంటూరు జిల్లా, ఎస్ఆర్ఓ పిడుగురాళ్ళ యొక్క పరిధి లో ఉన్న పరిధిలో ఉన్న సరిహద్దులు, తూర్పు వైపు:తుమ్మలపలి చెరువు వద్ద ఉన్న ఆర్ అండ్ బి యొక్క 33 అడుగుల రోడ్డు పశ్చిమం వైపు:మహమ్మద్ ఇస్మాయిల్ యొక్క స్థలం దక్షిణం వైపు:చేందు భీబిజాన్ యొక్క స్థలం ఉత్తరం వైపు:మ్హమ్మద్ ఇస్యాయిల్ యొక్క స్థలం	**రూ 13,34,358/- (పదమూడు లక్షల ముప్పై నాలుగు వేల మూడు వందల యాభై ఎనిమిది రూపాయిలు మాత్రమే)**	దిగువ వివరించిన అకౌంట్ ద్వారా ఆర్‌టిజిఎస్/ ఎన్ఇఎఫ్‌టి ద్వారా బయానాను డిపాజిట్ చేయవలెను: బ్యాంకు పేరు: యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్ బ్రాంచి: బంద్రకుర్ల కాంప్లెక్స్ ముంబాయి బ్యాంకు అకౌంట్ నెం: ప్రస్తుత అకౌంట్ నెం: 911020013220315. ఐఎఫ్ఎస్‌సి కోడ్- **UTIB0000230**	**రూ.1,19,600/- (లక్ష పందొమ్మిది వేల ఆరు వందల రూపాయిలు మాత్రమే)** **బయానా దాఖలుకు చివరి తేది 22 మార్చి 2018 అనగా గురువారం సా.6.00గం॥లకు** **ముందుగా ఆస్థి యొక్క తనికీ తేది మరియు సమయం: 20 మార్చి 2018 అనగా మంగళవారం ఉ11:00 నుంచి మ12:00 వరకు**	రూ.11,96,000/- (పదకొండు లక్షల తెంభై ఆరు వేల రూపాయిలు మాత్రమే) బిడ్ పెరుగుదల రూ 10,000/- మరియు వాటి మల్టిపుల్స్ ఇ-వేలం తేది మరియు సమయం 26 మార్చి 2018 అనగా సోమవారం ఉ 11:00 నుండి మ1:00 మధ్య

ఇ-వేలం యొక్క నియమాలు మరియు నిబందనలు:

1. బిడ్ డాక్యుమెంట్ యొక్క నిబంధనలు మరియు నిబంధనల ప్రకారం, వేలం వేయబడుతుంది. వేలం వేయుటకు శ్రీరామ్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ (ఎస్‌హెచ్‌ఫ్ఎల్),www.sriramhousing.in మరియు సర్వీస్ ప్రొవైడర్ యొక్క వెబ్ సైట్ https://property.samil.in ద్వారా, సెక్యూర్డ్ ఎస్సెట్ యొక్క వివరాలు వేలం కొరకు పొందుపరచబడిన/బిడ్ ఫారాలు పొందవలెను.
2. వివరాలకు, సహాయం, ప్రక్రియ మరియు ఆన్‌లైన్ శిక్షణ కోసం, కాగోరు బిడ్డర్లు ఎం/ఎస్ శ్రీరామ్ ఆటోమాల్ ఇండియా లిమిటెడ్ (ఎస్ఏఎంఐఎల్) యొక్క శ్రీ. డెబ్‌జ్యోతి రాయ్ ను సంప్రదించగలరు, సంప్రదించవలసిన నంబరు: +91-9874702021, **e-mail ID: debjyothi.r@samil.in**
3. ఎప్పటికప్పుడు కొనుగోలుదారులు/బిడ్డర్లు వారి పేరును నమోదు చేసుకోవాలి. **https://property.samil.in** పైన పేర్కొన్న పోర్టల్ మరియు తేదీ మరియు సమయాలలో ఇ-వేలం లో పాల్గొనడానికి యూజర్ ఐడి మరియు పాస్ వర్డ్ ను ఉచితంగా పొందవచ్చు.
4. ఇ-వేలం లో పాల్గొనడానికి ఉద్దేశించిన కొనుగోలుదారుడు/ వేలం వేసేవారు, వాటాల యొక్క రిజర్వు ధరలో 10% తిరిగి చెల్లించవలసిన బయానా చెల్లింపు వివరాలను, పాన్‌కార్డ్ యొక్క కాపీలు, కంపెనీ విషయంలో బోర్డు తీర్మానాలు మరియు మార్చి 22 2018 అనగా గురువారం న లేదా ముందు అడ్రస్ ప్రూఫ్. పైన పేర్కొన్న ప్రతి అంశానికి ప్రత్యేకమైన బయానాలను వేరుగా సమర్పించాలని కాగోరు కొనుగోలుదారులు/బిడ్డర్లను కోరడమైనది.
5. ఈ పథకం ప్రకారం, అర్‌టిజిఎస్/ఎన్ఇఎఫ్‌టి ద్వారా ప్రతి వస్తువుకు అతడు/దాని యొక్క ఆఫర్ యొక్క 25% (బయానా తో సహా) విజయవంతమైన కొనుగోలుదారుడు/ బిడ్డర్ జమచేస్తాడు. ఎస్‌హెచ్‌ఎఫ్ఎల్ వారిచే వేలం ధృవీకరించబడవలసి ఉంటుంది, అమ్మకం విఫలమైన యెడల విడిపించుకొనుటకు విఫలమైన మరియు సఫలీకృత కొనుగోలుదారుడు/ బిడ్డర్ మిగిలిన మొత్తాన్ని కోల్పోవలసి ఉంటుంది.
6. ఇ-వేలంలో విజయవంతం కానివారికి హెఫ్‌హెచ్ఎల్ వారు ఇ-వేలం ముగింపునకు 72 గంటలలోగా తిరిగి చెల్లించబడుతుంది. బయానాకు ఎటువంటి వడ్డీ తీసుకొనబడదు.
7. కొనుగోలు చేసిన పరిశీలన బ్యాలెన్సు యొక్క మొత్తంలో చెల్లింపు ప్రకారం, విజయవంతమైన కొనుగోలుదారుడు / వేలంపాటలో చెల్లించినదాని ప్రకారం, సెక్యూర్డ్ ఆస్తి లేదా అలాంటి పొడిగించిన వ్యవధి యొక్క అమ్మకం నిర్ధారణ యొక్క పదిహేనవ (15) రోజుకు ముందుగా వ్రాతపూర్వకంగా అంగీకరించాలి. ఒక వేల విఫలమైతే అప్రమేయంగా, అప్పటి వరకు డిపాజిట్ చేయబడిన అన్ని మొత్తాలను కోల్పోతారు.
8. ఆస్తి లేదా మరింత సమాచారం యొక్క తనిఖీ కోసం, కాగోలరు వేలందారులు అధీకృత అధికారులు శ్రీ. రాము ఆవుల మరియు శ్రీ.పి.గోపి కృష్ణను **ramu_a@shriramhousing.com & gopikrishna_p@shriramhousing.com** /(ఇమెయిల్) లేదా 09848903539 లేదా 09963786787 (మోబైల్). తెలుసుకొనవచ్చు.
9. వేలం ఏ దశలోనైనా ఆధీకృత అధికారి బిడ్/ఆఫర్ అంగీకరించుట/తిరస్కరించుట/సవరించుట లేదా ఏవైనా కారణం లేకుండా ముందస్తు నోటీసు ఇవ్వకుండా వాయిదా వేయవచ్చు.
10. సఫలీకృత కొనుగోలుదారుడు/బిడ్డర్ చట్టబద్ధమైన రుసుము, పన్నులు, ఫీజు చెల్లించవలసిన, స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ రుసుము మొదలైనవాటిని కలిగి ఉండవలెను. ఇది వర్తించే చట్టం ప్రకారం అతని/ఆమె అనుకూలంగా ఇచ్చిన ఆస్తిని పొందటానికి చెల్లించవలసి ఉంటుంది.
11. పేర్కొన్న అత్యుత్తమ బకాయిలకు బాధ్యత వహించే రుణగ్రహీతలు/హామీదారులు పైన పేర్కొన్న వేలంపాట విక్రయం యొక్క హెూల్డింగ్ గురించి భద్రతా వడ్డీ సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 8 క్లాజు (6) క్రింద నోటీసును ఈ నోటీసుగా వ్యవహరిస్తారు.

ఎన్‌బి: ఇక్కడ గమనించవలసినది ఏమనగా సెక్యూర్డ్ క్రెడిటార్ అందరి ఋణగ్రహీతలుకుజగ్యారెంటార్లకు/ప్రాదాన్యం ప్రకారంమోర్టగేజర్లకు/రిజిస్టర్డ్ పోస్టులకు గాను ఈ నోటీసు జారీ చేయడమైనది, ఒకవేళ ఎవరైనా ఈ నోటీసు స్వీకరించనట్లయితే, ఈ ప్రకటనే ప్రత్యామ్నాయంగా భావించి చూడగలరు

సం/-
అధీకృత అధికారి
శ్రీరామ్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్

ప్రాంతం :గుంటూరు
తేది : 21.02.2018



లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్ పత్రాన్ని ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

భాషోద్యమంలో కవుల పాత్ర అమోఘం

భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు విజయభాస్కర్

ప్రజాశక్తి- మొగల్రాజపురం (విజయవాడ)

భాష జాతిని బతికిస్తుందని, ఈ ఉద్యమంలో కవులు ఎనలేని పాత్రను పోషిస్తున్నారని భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డి.విజయభాస్కర్ అన్నారు. సోమవారం విజయవాడలోని కల్చరల్ సెంటర్ అఫ్ విజయవాడ అండ్ అమరావతిలో అమరావతి పొయెటిక్ ప్రిజమ్-2016కు లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్ (నేషనల్) ధ్రువపత్ర ప్రధానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మూడేళ్లుగా అంతర్జాతీయ కవి సమ్మేళనాలను నిర్వహిస్తూ కవితా సంపుటాలను వెలువరిస్తున్న మాలక్ష్మీ గ్రూప్ చైర్మన్ వై.హరిశ్చంద్రప్రసాద్‌ను అభినందించారు. సినీ నిర్మాత దగ్గుపాటి సురేష్‌బాబు మాట్లాడుతూ.. హరిశ్చంద్రప్రసాద్ సాంస్కృతిక రాయబారిగా వ్యవహరిస్తున్నట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో తెలుగు సినీ రంగం కూడా పాలుపంచుకుంటుందన్నారు. తొలుత కవి సమ్మేళన క్యూరేటర్, కల్చరల్ సెంటర్ గౌరవ సలహాదారు పద్మజా అయ్యంగార్ మూడేళ్లుగా జరిగిన అంతర్జాతీయ కవి సమ్మేళనాలపై నివేదిక సమర్పించారు. ఈ సందర్భంగా లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్ సర్టిఫికెట్‌ను సురేష్‌బాబు ఆవిష్కరించారు. కార్యక్రమంలో కల్చరల్ సెంటర్ సిఇఒ ఈమని శివనాగిరెడ్డి, జెమిని టివి కిరణ్, సందీప్ మండవ, నగరానికి చెందిన కవులు కాటూరు రవీంద్ర త్రివిక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా రష్యా కళాకారుల కూచిపూడి నృత్యం

ప్రజాశక్తి - సత్యనారాయణపురం (విజయవాడ)

కళలకు ప్రాంతీయ బేధం లేదని నిరూపించారు రష్యా కళాకారులు. భాషా, భావం తెలియకపోయినా మాతృభాషలో తర్జుమా చేసుకుని భావాన్ని అర్థం చేసుకుని అకుంఠిత దీక్షతో కూచిపూడిని ప్రదర్శించారు. ఆంధ్రదేశాన పుట్టిన కూచిపూడి నృత్యం ఖ్యాతి అంతర్జాతీయ స్థాయిలో పేరుప్రఖ్యాతలు గడిస్తుండటం తెలుగు వారికి గర్వకారణం. రష్యా రాజధాని మాస్కోలోని తపస్య కూచిపూడి డ్యాన్సు స్కూలు విద్యార్థులు విజయవాడ నగరంలో నృత్య ప్రదర్శన చేశారు. ఆంధ్రప్రదేశ్ సృజనాత్మకత, సంస్కృతి సమితి ఆధ్వర్యంలో ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ సంగీత నృత్య కళాశాలలో మంగళవారం ఈ ప్రదర్శన జరిగింది. నర్తకీమణులు అభినయించిన తీరు చూపరులను విశేషంగా ఆకట్టుకుంది. అచ్చం తెలుగువారికి తీసిపోని విధంగా సంప్రదాయ బద్ధంగా నృత్యం చేశారు. శ్రీగణపతిం, స్వరజతి, శివాష్టకం, బృందావన నిలయే, దశావతార శబ్దం, జగదానందకారక, తిల్లాన అంశాలకు నృత్యాభినయం చేశారు. నాట్యాచార్యులు పద్మరాగిణి పుట్టి నేతృత్వంలో కళాకారులు స్తనిస్లావా కమిషాన్‌స్కేయ, యులియా గుసెవా, యులియా బూనినా, సోఫియా సరిమావో, క్లారా సరిమావో, వలెన్‌టీనా వరబ్యోవా, మరియా సికనోవాలు నృత్యం చేశారు. అనంతరం మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ కూచిపూడిలో కన్వెషన్ సెంటర్ నిర్మాణం చేయనున్నట్లు చెప్పారు. ఏప్రిల్ 5 నుంచి కొండపల్లి ఉత్సవాలను నిర్వహించబోతున్నట్లు తెలిపారు. కూచిపూడి నృత్యం చేసిన రష్యా కళాకారులను ఆయన సన్మానించి జ్ఞాపికలు అందజేశారు.

రైల్వే స్టేషన్‌లో నక్షత్ర తాబేళ్లు పట్టివేత

ప్రజాశక్తి-గాంధీనగర్ (విజయవాడ)

విజయవాడ రైల్వే స్టేషన్‌లో అక్రమంగా తరలిస్తున్న నక్షత్ర తాబేళ్లను ఇంటెలిజెన్స్ అధికారులు దాడి చేసి మంగళవారం పట్టుకున్నారు. విజయవాడ డైరెక్టరేట్ అఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ అధికారులు తెలిపిన వివరాల మేరకు.. 15906 నెంబర్ గల వివేక్ ఎక్స్‌ప్రెస్ రైలు జనరల్ బోగీలో కదిరికి చెందిన ఇద్దరు మహిళలు బ్యాగులోని బట్టల మధ్య 406 తాబేళ్లను పెట్టుకుని భువనేశ్వర్‌కు తీసుకెళ్లారు. అక్కడ పోలీసుల నిఘా ఉన్నట్లు మధ్యవర్తి చెప్పడంతో దిబ్రూగర్ నుంచి కన్యాకుమారి వెళ్తున్న రైల్లో తిరుగు ప్రయాణమయ్యారు. రైలు విజయవాడ స్టేషన్‌కు చేరగా ఆర్‌పిఎఫ్ సిఐ కుమార్ తమ సిబ్బంది సహకారంతో దాడి చేశారు. తాబేళ్లను బంగ్లాదేశ్‌కు తరలించేందుకు ప్రయత్నించారని అధికారులు తెలిపారు. వన్యప్రాణి సంరక్షణ చట్టం కింద అధికారులు కేసు నమోదు చేశారు. స్వాధీనం చేసుకున్న తాబేళ్లను అటవీశాఖ రేంజ్ అధికారి వి.సాయిబాబాకు అప్పగించారు.

పబ్లిక్ నోటీసు

Notice under Regulation 6.5 of the Telecommunication (Broadcasting and cable services) Interconnection (Digital Addressable Cable Television Systems) Regulations 2012 (No.9 of 2012)

M/s. IndusInd Media and communications Limited (Hits Division) - NXT Digital

ఇ-టెండరు ఆహ్వానిస్తూ నోటీసు

భారత రాష్ట్రపతి తరుపున, ది ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు, విసిడి, సిపిడబ్లుడి, విశాఖపట్నం వారు దిగువ పనికి సిపిడబ్లుడి యొక్క నమోదిత మరియు అర్హత గల కాంట్రాక్టర్ల నుండి ఆన్‌లైన్ పర్సంటేజ్ రేట్ బిడ్‌లు ఆహ్వానించడమైనది:-

నిట్ సం.56/2017-18/ఇఇ/విసిడి/ విశాఖపట్నం

పనిపేరు: అడ్మినిస్ట్రేషన్ బిల్డింగ్ యొక్క A/R & M/O, జి.ఎస్.ఐ, విశాఖపట్నం 2017-18. ఎస్‌హెచ్: నీటి సరఫరా నిర్వహణ, మిగిలిన పనులు, అతిథి గృహాల దిగువ అంతస్తు వద్ద వాటిని గదులుగా మార్చుట. టెండరుకు అంచనా విలువ: రూ.6,42,778/-, బయానా:రూ.12,856/-, పూర్తిచేయుటకాలం: 120 రోజులు, బిడ్‌దాఖలకు చివరి తేది మరియు సమయం: 28.02.2018న 15.30గం.ల వరకు.

బిడ్ ఫారాలు మరియు ఇతర వివరాలు వెబ్‌సైట్ **www.tenderwizard.com/CPWD** నుండి పొందవచ్చు అదే విధంగా ప్రెస్ నోటీసు **www.eprocure.gov.in** అందుబాటులో ఉంటుంది.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ
జిల్లా కార్యాలయం, ఉడా ఆఫీస్ రోడ్, విజయవాడ.
ఫోన్: 7702003571

నెం. పి.డి.యస్2/మూమెంట్/ఏఫ్ జి/స్టేజి - 11/2018-19 **తేది: 20.02.2018**

బియ్యం రవాణా చేయుటకు ప్రకటన

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ లిమిటెడ్, విజయవాడ కృష్ణా జిల్లాలోని బంటుమిల్లి, అవనిగడ్డ, మొవ్వ, మచిలీపట్నం, గుడివాడ, కైకలూరు, పామర్రు, తిరువూరు, విస్సన్నపేట, నూజివీడు, గన్నవరం, ఉయ్యూరు, మైలవరం, కంచికచర్ల, జగ్గయ్యపేట, నందిగామ, విజయవాడ (రూరల్) & విజయవాడ (అర్బన్) మండల స్థాయి గోదాముల్లో నుండి చౌక ధరల దుకాణాలకు బియ్యం రవాణా చేయుటకు సీల్డు టెండర్లు కోరటమైనది. దరఖాస్తు రుసుము: రూ. 3,000/-

వివరములకు ఈ క్రింది వెబ్ సైట్‌ను సంప్రదించగలరు. www.krishna.nic.in

సం/- జాయింట్ కలెక్టర్ మరియు ఇ.ఒ.ఇ.డి.,
జిల్లా పౌర సరఫరాల సంస్థ, కృష్ణా జిల్లా.

సంపాదకీయం

భారత్-ఇరాన్ బంధం

ఇరాన్ అధ్యక్షుడు హసన్ రోహాని భారత్‌లో జరిపిన మూడు రోజుల పర్యటన చిరకాల మిత్రులైన ఈ రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక, ఆర్థిక, వాణిజ్య సహకార సంబంధాల పటిష్టతకు కొత్త ఊపిరులూదింది. ఉన్నత స్థాయి చర్చల అనంతరం ఇరు దేశాల అధినేతలు సంయుక్తంగా విడుదలజేసిన ప్రకటన చూసినా, వివిధ అంశాలపై కుదుర్చుకున్న డజనుకుపైగా ఒప్పందాలు, ఎంఒయులను చూసినా ఇదే విషయం స్పష్టమవుతుంది. మధ్య ఆసియా, తూర్పు యూరపు, ఆఫ్ఘనిస్తాన్‌తో ఈ ఉపఖండ మార్కెట్‌ను కలిపే కీలకమైన చబహార్ - జెహెదాన్ రైలుమార్గం ఏర్పాటు, భారతీయ కంపెనీకి చబహార్ షాహిద్ బెహెస్తి రేవు నిర్వహణ కాంట్రాక్టు అప్పగింత , ద్వంద్వ పన్నుల రద్దు, ఇరాన్ నుంచి చేసుకునే చమురు దిగుమతులకు రూపాయల్లో చెల్లించే సదుపాయం కల్పించడం వంటివి వీటిలో అతి ముఖ్యమైనవి. చమురు దిగుమతులకు రూపాయల్లో చెల్లించే సౌకర్యం ఇంతవరకు నేపాల్, బంగ్లాదేశ్‌లకు మాత్రమే ఇరాన్ కల్పించింది. దీనిని ఇప్పుడు భారత్‌కు కూడా వర్తింపజేయాలని నిర్ణయించడం ముదావహం. ఇరాన్ నుంచి ఏటా కోటి టన్నులకు పైగా ముడి చమురు దిగుమతి చేసుకుంటున్న మన దేశానికి రూపాయల్లో చెల్లించే సదుపాయం కల్పించడం వల్ల ఇంధన భద్రతతోబాటు, విదేశీ మారకద్రవ్యం పెద్దమొత్తంలో ఆదా అవుతుంది. 2008లో అమెరికాతో అణు ఒప్పందం కుదుర్చుకున్నప్పుడు ఇరాన్‌తో గ్యాస్‌పైపు లైన్ ప్రాజెక్టునుంచి భారత్ వైదొలగాలని అగ్రరాజ్యం షరతు విధించింది. ఆ షరతుకు తలొగ్గిన అప్పటి కాంగ్రెస్ నేతృత్వంలోని యుపిఏ ప్రభుత్వం గ్యాస్ పైపులైన్ ప్రాజెక్టును అటకెక్కించగా, ప్రస్తుత నరేంద్ర మోడీ ప్రభుత్వం అమెరికాకు మరింత మోకరిల్లి ప్రాజెక్టును పూర్తిగా చంపేసింది. దానికి బదులు టర్క్‌మానిస్తాన్ - ఆఫ్ఘనిస్తాన్ - పాకిస్తాన్ - భారత్ పైపులైను ప్రాజెక్టును ముందుకు తెచ్చింది. దాంతో ఇరాన్-పాకిస్తాన్‌ల మధ్య గ్యాస్‌పైపు లైను నిర్మాణం పూర్తయి పాక్‌కు ఇరాన్ గ్యాస్ సరఫరా చేస్తోంది. అయితే ఇప్పుడు పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్‌ల ద్వారా గ్యాస్ పైపు లైన్ల వల్ల భద్రతా పరమైన సమస్యలున్నాయని భారత ప్రభుత్వం చెబుతోంది. అందువల్ల ఇరాన్ నుండి సముద్రంలో పైపు లైను వేసి నేరుగా భారత్‌కు గ్యాస్ తెచ్చుకోవాలని ప్రయత్నిస్తోంది.

ఇరాన్- ఆఫ్ఘన్ సరిహద్దుల మీదుగా సాగే చబహార్ - జెహదాన్ రైలు మార్గం నిర్మాణానికి రెండు దేశాలు అంగీకరించాయి. ఇది పూర్తయితే ఈ ఉపఖండానికి ఆఫ్ఘనిస్తాన్, మధ్య ఆసియా, తూర్పు యూరపు దేశాలకు వాణిజ్య వారధిగా భారత్ నిలుస్తుంది. దీనివల్ల భారత్ - ఇరాన్ మధ్య ప్రస్తుతం జరుగుతున్న 1300 కోట్ల డాలర్ల వాణిజ్యం రెట్టింపయ్యే అవకాశముంది. వ్యాపారాన్ని సులభతరం చేసేందుకు, ఆరోగ్యం, మందులు, వ్యవసాయం తదితర రంగాల్లో పరస్పర సహకారాన్ని మరింత పెంపొందించుకోవాలని ఇరుదేశాలు సంకల్పించడం ఆహ్వానించదగ్గ పరిణామం. నూట ఇరవై కోట్లకు పైగా జనాభా కలిగిన భారత్‌కు ఐక్యరాజ్య సమితి భద్రతామండలిలో శాశ్వత సభ్యత్వం కల్పించాలన్న డిమాండ్‌కు రోహానీ మద్దతు పలికారు. ఇలా అన్ని రంగాల్లోను ఆయన భారత్‌కు స్నేహ హస్తం అందించారు.

మధ్య ఆసియాలో చమురు నిల్వలపై పట్టు కోసం అమెరికా సాగిస్తున్న కుట్రలను ఇరాన్ ఒక వైపు దీటుగా ఎదుర్కొంటూ మరో వైపు ఈ ప్రాంతంలోని భారత్ లాంటి దేశాలకు స్నేహ హస్తం చాచడం ఇరాన్ దౌత్య పరిణతిని తెలియజేస్తున్నది. సిరియాలో అసద్ ప్రభుత్వాన్ని కూలదోయాలని చూసిన అగ్ర రాజ్య కుట్రలను రష్యా, టర్కీతో కలిసి సమర్థవంతంగా తిప్పికొట్టింది. ఆ పరాభవాన్ని జీర్ణించుకోలేని ట్రంప్ ఇరాన్‌పై ఒంటికాలితో లేస్తున్నాడు. 2015లో కుదుర్చుకున్న ఇరాన్ అణు ఒప్పందాన్ని రద్దు చేస్తానని హూంకరించాడు. అది సాధ్యం కాకపోవడంతో, ఆ ఒప్పందాన్ని తిరగదోడాలంటూ నానా యాగీ చేస్తున్నాడు. ఒప్పందంలో భాగస్వాములుగా ఇతర సభ్య దేశాలపై ఒత్తిడి తెచ్చాడు. ఒప్పందాన్ని తిరగదోడే ప్రశ్నే లేదని చైనా, రష్యా కరాఖండిగా తేల్చి చెప్పాయి. యూరోపియన్ యూనియన్ దేశాలు కూడా ట్రంప్‌ను వెనకేసుకురావడానికి నిరాకరించాయి. ఈ పరిస్థితుల్లో ఇరాన్‌కు భారత్ అండగా నిలవాల్సిన అవసరముంది. అమెరికాతో వ్యూహాత్మక రక్షణ ఒప్పందం కుదుర్చుకున్నప్పటి నుంచి మోడీ ప్రభుత్వం అగ్రరాజ్యం అడుగులకు మడుగులొత్తుతున్నది. దీనిలో భాగంగానే ఇజ్రాయిల్‌తో సన్నిహిత సంబంధాలను ఏర్పరచుకున్నది. రోహానీ, మోడీ భేటీ అయిన రోజే అమెరికా జాతీయ భద్రతా సలహాదారు హెచ్ ఆర్ మెక్ మాస్టర్ ఒక ప్రకటన చేస్తూ ఇరాన్‌లో పెట్టుబడులు పెట్టే దేశాలు ఉగ్రవాదానికి, మధ్య ప్రాచ్యంలో హత్యాకాండకు పరోక్షంగా సహకరించినట్టే అవుతుందని బెదిరించాడు. ఇటువంటి బెదిరింపులకు లొంగరాదు. భారత్ ఇరాన్ సంబంధాలు, వాణిజ్య ఒప్పందాలు ఇరు దేశాలకూ ప్రయోజనకరమైనవి, ఇందులో ఇతర దేశాల జోక్యాన్ని తిప్పికొట్టాలి.

ఇదీ విషయం



రూప రహిత వ్యూహంతో
ఉద్యమాలు చేస్తారట...
నోరు మెదపకుండానే
హస్తినను నిలదీస్తారట!

కుడితిలోన ఎలకల్లా
సర్కారీ నేతలు...
బూడిదలో పన్నీరు
ఆంధ్ర జనం ఆశలు!


- కొల్లూరు వెంకట్

సందర్భం

మాతృభాషలతోనే మానవ ప్రగతి


2000 సంవత్సరం నుండీ ప్రతీ ఏటా ప్రపంచమంతటా 'అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని ఫిబ్రవరి 21న అనేక భాషా జాతుల ప్రజలు జరుపుకొంటూనే ఉన్నారు. తెలుగు జాతికి సంబంధించి, ఈ అంశాన్ని గ్రహించి తొలుత ప్రజాసాహితి, నడుస్తున్న చరిత్ర వంటి పత్రికలు వెలుగులోకి తెచ్చినప్పటికీ 2003 ఫిబ్రవరి 21న హైదరాబాదు కేంద్రంగా 'తెలుగు భాషోద్యమ సమాఖ్య' ఏర్పడి పెద్ద ఎత్తున ప్రారంభోత్సవ సభ జరుపుకొనడంతో మాతృభాషా దినోత్సవమూ, దాని వెనుకగల చరిత్రా ప్రచారంలోకి వచ్చాయి.

'భాషా జాతి' అనే అవగాహన సహజంగా రూపు దిద్దుకొన్న ఒక సామాజిక రాజకీయ సిద్ధాంతంగా స్థిరపడింది. ఒకే భాషాజాతికి చెందిన ప్రజలు విభిన్న ప్రాంతాల్లో, విభిన్న రాజకీయ పరిస్థితుల మధ్య బతుకుతూ మతం, భౌగోళికత వంటి ఇతర అంశాల పరంగా భిన్నంగా ఉన్నప్పటికీ తమ భాషా మౌలికతను కోల్పోకుండానే కొనసాగుతూ ఉంటారు. తమదైన సాంస్కృతిక వైవిధ్యాన్నీ, గొప్ప వారసత్వాన్నీ కాపాడుకొంటూనే ఉంటారు. అందుకు మూలమైన తమ భాషల్ని కాపాడుకోవడం వల్లనే అది సాధ్యమవుతుంది. అనేక రాజకీయ, ఆర్థిక, సామాజిక, భౌగోళిక కారణాలవల్ల ఈ భాషా వైవిధ్యం క్రమంగా తీవ్రమైన సవాళ్ళను ఎదుర్కొంటున్నది. ఈ పరిణామం 20వ శతాబ్దం చివరి దశకంలో ముఖ్యంగా ప్రపంచీకరణ విధానాల విజృంభణతో వేగాన్నందుకుంది. అప్పటికే శాస్త్ర సాంకేతిక రంగాల్లో, విద్య, పాలనా రంగాల్లోనూ తిష్ట వేసుకున్న ఆంగ్ల భాష, 'ఎల్‌పీజీ'తో పాటు విస్తరించి వ్యాపార భాషగా కూడా విజృంభించింది. దానితోపాటు దాని సంస్కృతిని కూడ విస్తరింపజేస్తున్నది. 'భాషలు తమ సంస్కృతిని కూడా మోసుకొస్తాయి' అన్న సంగతిని మనం విస్మరించ కూడదు.



డా ॥ సామల రమేష్‌బాబు

ఈ పరిణామాలతో చిన్న చిన్న భాషలు క్రమంగా మరుగున పడి పోవడమో, పూర్తిగా నశించిపోవడమో జరుగుతోంది. భాషలు నశించిపోవడంతో ఆయా భాషా జాతుల సంస్కృతులు కూడా నశించిపోతాయి గదా. ముందుగా ఈ పరిస్థితులను యూరప్, అమెరికా ఉపఖండాల్లో గమనించిన 'యునెస్కో' దీనిపై పూర్తిగా అధ్యయనం మొదలుపెట్టి, ప్రపంచ వ్యాప్తంగా పరిశోధన చేసిన పిమ్మట తన వేదికలపై సమగ్ర చర్చలు జరిపి 1999లో ఒక నిర్ణయానికి వచ్చింది. భాషలు కనుమరుగు కావడమంటే తరతరాల వారసత్వ విజ్ఞానం కూడా కనుమరుగు కాక తప్పదన్న సంగతినీ, పర్యావరణ రక్షణలో భిన్న భాషాజాతుల రక్షణ ఒక ప్రధాన అంశం అన్న సంగతినీ ప్రస్ఫుటంగా ఎత్తి చూపింది. పర్యావరణ రక్షణ ఎంత ముఖ్యమో భాషల రక్షణ కూడా అంతే ముఖ్యం అని ప్రకటించింది. ఎన్నో తరాలుగా మానవ జాతి ప్రపంచ వ్యాప్తంగా సమకూర్చుకొన్న వారసత్వ విజ్ఞానాన్ని



కోల్పోవడాన్ని ప్రముఖంగా ప్రస్తావించింది. ఇందుకోసం ఏం చేయాలో సమగ్రంగా అధ్యయనం చేసి విద్యా, వైజ్ఞానిక, సాంస్కృతిక రంగాల్లో మాతృభాషలను రక్షించుకోవడం తప్పనిసరి అని ప్రకటించింది. ప్రతి ఏటా ఒక రోజును మాతృభాషా దినోత్సవంగా నిర్ణయించి ప్రకటించాలనే నిర్ణయానికి వచ్చి ఇందుకు తగిన తేదీ కోసం పలు అభిప్రాయాలను పరిశీలించింది. చరిత్ర పుటల్నీ తిరగ వేసింది.

1952లో ఫిబ్రవరి 21న 'ఢాకా' నగరంలో తమ మాతృభాష రక్షణ కోసం పాకిస్తాన్ పాలకుల విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమిస్తున్న విద్యార్థుల, మేధావుల, రచయితల ఊరేగింపుపై పోలీసులు జరిపిన కాల్పుల్లో వందలాది మంది గాయాలపాలవడమే కాకుండా నలుగురు విద్యార్థులు మరణించారు. ఆ ఉద్యమం మరి 20 ఏళ్ళు గడిచే సరికి విముక్తి పోరాటానికి దారి తీసి 1971లో తూర్పు పాకిస్తాన్ - స్వతంత్ర రాజ్యంగా - 'బంగ్లాదేశ్' గా అవతరించడానికి దారి తీసింది. ఈ చారిత్రాత్మక పరిణామానికి మూలమైన 'ఫిబ్రవరి 21'ని 'యునెస్కో' వారు అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవంగా నిర్ణయించారు.

ఫిబ్రవరి 21 నే ఎందుకు?

ఆరోజునే ఎందుకు? ఆ తేదీకున్న ప్రాముఖ్యత ఏమిటి? అన్న ప్రశ్న వస్తుంది. ప్రాముఖ్యతే కాదు, 1952 ఫిబ్రవరి 21 వెనక గొప్ప వీరోచిత గాథే ఉంది. నేటి బంగ్లాదేశ్‌లో ప్రతి ఫిబ్రవరి 21ని 'బంగ్లా మృత వీరుల దినం'గా కృతజ్ఞతతో స్మరిస్తారు. విద్యార్థులు పశ్చిమ పాకిస్తాను పోలీసుల చేతుల్లో చిత్రహింసల పాలయ్యారు. నలుగురు విద్యార్థులైతే తమ ప్రాణాలనే బలిదానం చేశారు. ఈ అసమాన అంతిమ త్యాగం ఎందుకోసం? ప్రియాతి ప్రియమైన తమ భాష కోసం. తమ మాతృభాష వైభవం కోసం. 'సోనార్ బంగ్లా' కోసం! పశ్చిమ, తూర్పు పాకిస్తాన్లలో అంతా ముస్లింలే గదా, వారిది ఒకే 'ఇస్లాం' మతం గదా. అయినా, మతాన్ని పక్కనబెట్టి, ప్రథమ స్థానాన్ని స్వభాషకి సంతరించిన స్వాభిమానధనులు బంగ్లాదేశీయులు. అందుకే వారి 'మృత వీరుల స్మారకదినం' యావత్తు ప్రపంచ దేశాలకే 'మాతృభాషా దినోత్సవం' అయింది-సముచితంగా, సమున్నతంగా! అంతేకాదు. ఆనాటి మృతవీరుల సజీవ స్ఫూర్తే తరువాత రెండు దశాబ్దాల కాలంలో విముక్తి పోరాటంగా విజృంభించి, 1971 నాటికి ఉజ్వల విజయంగా 'స్వతంత్ర బంగ్లాదేశ్' ప్రపంచ పటంలో అవతరించింది.

అసలు బంగ్లా భాష పాకిస్తాన్‌కి మొదటి రాజ్యభాష కావలసినంత పూర్తి యోగ్యత ఉంది. అప్పటి పశ్చిమ పాకిస్తాను జనాభా మూడున్నర కోట్లు. అక్కడ ఉర్దూనే కాక ఇతర భాషలు మాట్లాడేవారు, ఇస్లాంలోనే అనేక తెగలవారు కలగా పులగంగా ఉన్నారు. తమ సంస్కృతీ మూలాల కోసం మధ్య ఆసియా దేశాలతో సంబంధాలకు అర్రులు చాచేవారు. తూర్పు బెంగాల్ జనాభా నాలుగున్నర కోట్లు. ఒకే బంగ్లా భాష, ఒకే సంస్కృతీ వారసత్వాలు కలిగిన కలిసికట్టు సమాజం. కాని ఈ జ్ఞానం ఉర్దూ దురహంకారులైన పశ్చిమ పాకిస్తాన్ పంజాబీలకు తలకెక్కలేదు. దేశ రాజధాని కరాచీలో తిష్ట వేసి తామే చరిత్రకు అధినాయకులమని విర్రవీగారు.

మార్చి 19న పాకిస్తాను తొలి అధ్యక్షుడు మహ్మదాలీ జిన్నా ఢాకా వచ్చాడు. ప్రజాస్వామ్య స్ఫూర్తి అంటే ఏమిటో ఎరగని ఆ 'క్వాయిదే ఆజాం' తనకు జరిగిన సన్మాన సభలో ఉర్దూ మాత్రమే రాజభాషగా ఉంటుందని సెలవిచ్చాడు. 'ఒప్పుకోం. మేం ఒప్పుకోం' అన్న నినాదాలు ఆ సభలోనే మిన్నుముట్టాయి. అదే సంవత్సరం సెప్టెంబరు 11 న జిన్నా మరణించి వుండకపోతే, ఆయన ఇంకా ఎన్నో అవమానాల పాలయ్యేవాడు. ఆ తర్వాత పాకిస్తాన్‌లో రాజకీయ అనిశ్చితి, 1951 అక్టోబరులో ప్రధాని లియాఖత్ ఆలీఖాన్ హత్య వల్ల ఈ భాషోద్యమంలో కొంత విరామం వచ్చింది. 1952 ఫిబ్రవరి 21 తూర్పు బెంగాల్ శాసన సభ బడ్జెట్ సమావేశ ప్రారంభ దినం. అప్పుడు రెండోసారి పాక్ ప్రధాని అయిన క్వాజా నజీముద్దీన్ ఢాకా అంతటా నిషేధాజ్ఞలు ప్రకటింప చేశాడు. వీటిని ధిక్కరిస్తూ ఉవ్వెత్తున లేచిన విద్యార్థి ఉద్యమం ఆ రోజున చరిత్ర సృష్టించింది. నలుగురు విద్యార్థుల బలిదానంతో మాతృభాషా ప్రియత్వానికి విశ్వకిరీటం 'నజరానా' గా వెలిగింది!

ఒక దశాబ్దం తిరగకుండానే-తూర్పు బెంగాల్ మాతృభాషోద్యమం తన ఉదాత్త ప్రజాస్వామిక ఆకాంక్షను నెరవేర్చుకుంది. దీనికి జాతీయ నేతల, రచయితల అండదండలున్నా, ఉద్యమాన్ని నిర్వహించింది ప్రధానంగా అధ్యాపక, విద్యార్థి వర్గాలే. అందునా ఢాకా విశ్వవిద్యాలయం ముందు వరుసలో నిలబడింది. 1952లో తూర్పు బెంగాలీయులందరూ కలసి మాతృభాషా సంస్కృతుల పరిరక్షణకై ఒక తీర్మానాన్ని తయారు చేసి ఐక్యరాజ్య సమితి (యునెస్కో) ముందుంచారు. ఈ చారిత్రక తీర్మానాన్ని ఆనాడే 27 దేశాల ప్రభుత్వాలు సమర్థించాయి. బంగ్లాదేశ్ ఉద్యమానికి యునెస్కో ఆలస్యంగానైనా తన మద్దతు ప్రకటించి ప్రపంచవ్యాప్తంగా భాషా సంస్కృతుల పరిరక్షణోద్య మాలకు ఊపిరినిచ్చింది. సంస్థ తన ప్రకటనలో '1952 వ సంవత్సరం ఫిబ్రవరి 21 నాడు అశువులు బాసిన అనేకమంది అమరజీవుల స్మృత్యర్థం ఆ రోజును అంతర్జాతీయ మాతృభాషాదినోత్సవంగా పరిగణించాలి' అని పేర్కొంది. ఈ ప్రకటనతో ప్రపంచంలోని వేలాది భాషలను గౌరవించినట్లయింది.

ప్రపంచ వ్యాప్తంగా మాతృభాషా దినోత్సవ ప్రకటన ద్వారా భాషోద్యమాలకు కొత్త చైతన్యం వచ్చింది. అంతరించి పోతున్న భాషా సంస్కృతుల పరిరక్షణకు, అల్ప సంఖ్యాక భాషా సమూహాల రక్షణకు, వివిధ భాషల ప్రత్యేక ఉనికిని నిలబెట్టేందుకు ఈ అవకాశం పనికి వస్తుంది.

మన దేశంలో వందలాది భాషలున్నాయి. అయితే వాటిలో 22 మాత్రమే మన రాజ్యాంగంలో చోటు చేసుకున్నాయి. ఇవిగాక దేశంలో తక్కువ సంఖ్యలోనైనా ప్రజల మాతృభాషలనేకం ఉన్నాయి. ఈ సందర్భంలో 'యునెస్కో' 2000లోనే ఒక హెచ్చరికను జారీ చేసింది. ఏ భాషాజాతిలోనైనా 30 శాతం మంది పిల్లలు తమ మాతృభాషలో చదువుకోనట్లయితే ఆ భాషాజాతి క్రూరంగా కనుమరుగయ్యే దిశగా వున్నట్లు భావించాలని స్పష్టంగా చెప్పింది. ఆ దృష్ట్యా చూస్తే రెండు తెలుగు రాష్ట్రాల్లో ఉన్న 9 కోట్ల మంది, ఇతర రాష్ట్రాల్లోనూ, విదేశాల్లోనూ అల్లుకొని ఉన్న మరి అంతమందీ తెలుగువారిలో ఎందరికి తమ భాషను చదవడం, రాయడం వచ్చు అనే ప్రశ్న ఉంది. ఆ సంఖ్య కనీసం తెలుగు రాష్ట్రాల్లోనే 30 శాతానికి మించదు. బయట ఉన్నవారిలో అది బహుశా 5 శాతం కూడా ఉండదేమో! మరి మన మాతృభాషను రక్షించుకోవడానికి మన ప్రభుత్వాలు, ప్రజలు ఎంతవరకు కృషి చేస్తున్నారు?

(రచయిత తెలుగు భాషోద్యమ సమాఖ్య అధ్యక్షుడు,
సెల్ : 9848016136)

సందర్భం

విద్యావ్యాప్తిలో హక్ అనిర్వచనీయ సేవలు



నేడు డా॥ మహమ్మద్ అబ్దుల్ హక్ జయంతి

కర్నూలు జిల్లాలో విద్యావ్యాప్తికి అబ్దుల్ హక్ ఎనలేని సేవలు చేశారు. అందుకే అక్కడి ఉర్దూ విశ్వవిద్యాలయానికి ఆయన పేరు పెట్టారు. ఉర్దూ, అరబ్బీ, పర్షియన్ భాషలలో పండితుడైన ఉమర్, హజీరా దంపంతులకు 1901 ఫిబ్రవరి 21న డాక్టర్ మహమ్మద్ అబ్దుల్ హక్ జన్మించారు. ప్రాథమిక స్థాయిలో తండ్రి వద్దనే విద్యాభ్యాసం జరిగింది. పన్నెండు సంవత్సరాల వయసులోనే గొప్పగొప్ప మేధావుల సమక్షంలో మద్రాసుకు వెళ్ళి ప్రసంగించారు. 1915లో కర్నూలులోని మున్సిపల్ హైస్కూలులో నేరుగా ఫోర్త్ ఫారమ్‌లో ప్రవేశం పొందారు. 1918లో బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్, మద్రాసు వారు నిర్వహించిన ఎస్‌ఎస్‌ఎల్‌సిలో ఉన్నతశ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు. మద్రాసులో ఆయన ఉన్నతవిద్య అభ్యసించారు. అయితే ఆ సమయంలో మద్రాసు ప్రెసిడెన్సి కళాశాలలో ఆయనకు తీవ్ర అవమానం జరిగింది. కళాశాల హెడ్ గుమాస్తా వీరి దరఖాస్తును ముఖంపై విసిరేస్తూ మీలాంటి వారికి ఇక్కడ ప్రవేశం లేదని అరిచారు. దీంతో మద్రాసులో మహమ్మదన్ కళాశాలలో ప్రవేశం పొంది 1920లో ఇంటర్‌లో ఉత్తీర్ణత సాధించారు. అబ్దుల్ హక్ అరబిక్, ఉర్దూ, పర్షియన్ భాషలలో అత్యున్నతమైన పాండిత్యాన్ని సంపాదించి మద్రాసు విశ్వవిద్యాలయం నుండి 'అఫ్జల్-ఉల్-ఉలమా' పట్టా పొందారు.

1924లో ఎంఏ అరబిక్‌లో ఉత్తీర్ణులైన హక్ పాండిత్యాన్ని గుర్తించిన బ్రిటీష్ ప్రభుత్వం అదే సంవత్సరం ప్రభుత్వ మహమ్మదన్ కళాశాల మద్రాసులో అరబిక్ లెక్చరర్‌గా నియమించింది. అప్పుడే మహమ్మదన్ కళాశాల తరపున హక్, 'ఉర్దూ సాహితీ సమితి'ని స్థాపించి 'సఫీనా' పేరుతో మాస పత్రిక నడిపారు. ఈ పత్రికలో ఆయన 'హమ్‌రాజ్' కలం పేరుతో వ్యాసాలు రాసేవారు.

1936లో ఇంగ్లండు వెళ్ళి ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలో అరబిక్ భాషపై పరిశోధన చేసి డాక్టరేట్ పట్టా పొందారు. తిరిగి మద్రాసు చేరుకున్న హక్ మహమ్మదన్ కళాశాలలో అరబిక్ ప్రొఫెసర్‌గా ఉంటూ కళాశాలను ఉన్నత ప్రమాణాలతో నడిపించారు. ఆ కాలంలోనే బాలికలు చదువుకోవడానికి కూడా అవకాశం కల్పించారు. 1918లో ఏ కళాశాలలో చదవడానికి అవకాశం లేదని తిరస్కరించారో అదే మద్రాసు ప్రెసిడెన్సీ కళాశాలకు 1948లో ప్రిన్సిపాల్‌గా నియమితు లయ్యారు. ఉర్దూభాషలో 'ఇటాలియా' పేరుతో ఈయన వెలువరించిన గ్రంథం చెన్నై రాష్ట్రపు సెకండరీ స్కూల్ లీవింగ్ సర్టిఫికెట్ పరీక్షకు పాఠ్యాంశంగా అనుమతిం చారు. ఈజిప్టులో 'ఆల్-అజర్' విశ్వవిద్యాలయం, ఈయనను ఘనంగా సత్కరించింది. 1952లో అలీఘర్ విశ్వవిద్యాలయానికి ప్రొ-వైస్ ఛాన్సెలర్‌గా బాధ్యతలు నిర్వహించారు. 1955లో మద్రాసు పబ్లిక్ సర్వీస్ కమిషన్ సభ్యులుగా నియమితులయ్యారు.

1946లో తండ్రి మరణంతో, వారు స్థాపించిన కర్నూలులోని 'ఇస్లామిక్ అరబిక్ కాలేజీ' బాగోగులపైనా, నిర్వహణపై తన దృష్టిని పూర్తిగా కేంద్రీకరించవలసి వచ్చింది. విద్యలో కర్నూలు జిల్లా వెనుకబడటాన్ని, ఉన్నత విద్య కోసం విద్యార్థులు పడే కష్టాలను స్వయంగా తెలుసుకున్న వారు కనుకనే, ఈ ప్రాంతానికి సేవ చేయాలని ఆయన నిర్ణయించు కున్నారు. 1947లో దేశానికి స్వాతంత్ర్యం రాకముందే ఉస్మానియా కళాశాలను స్థాపించారు. ఈ కళాశాలలో తెలుగు, ఉర్దూ, ఇంగ్లీషు మీడియంలో డిగ్రీ చదవగలిగే అవకాశాన్ని కల్పించారు. మొదట మైనారిటీ విద్యాసంస్థగా ఏర్పడినా తరువాత కాలంలో కుల మతాలకు అతీతంగా అందరూ చదివే అవకాశం కల్పించారు.

ఇంకా ఈయన మలబార్‌లోని ఫరోఖ్‌లో 'ఫరూఖ్ కాలేజ్', తిరుచునా పల్లిలో 'జమాల్ మహమ్మద్ కాలేజీ', చెన్నైలో 'న్యూ కాలేజీ', 'సౌత్ ఇండియన్ ఎడ్యుకేషన్ ట్రస్టు ఉమెన్స్ కాలేజీ'లను స్థాపించారు. కర్నూలులో వీరు స్థాపించిన ఉస్మానియా కళాశాల నేడు శాఖోపశాఖలుగా విస్తరించి అనేక విద్యాసంస్థలను ఏర్పాటు చేసింది. (హజీరా) ఉస్మానియా మహిళా డిగ్రీ కళాశాల, హజీరా బాలికల జూనియర్ కళాశాల, డాక్టర్ అబ్దుల్ హక్ యునాని మెడికల్ కళాశాల, ఉస్మానియా కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్, ఉమర్ అరబిక్ హైస్కూల్ మొదలైనవి.

ఈ విద్యాసంస్థలన్నీ హక్ సేవకు ప్రతిరూపాలు, విద్యాప్రగతికి దీపాలు. వీరి కీర్తి కిరీటంలో కలికి తురాయిలు. అనుక్షణం వీరి శ్రమను, వీరి విజ్ఞానాన్ని జ్ఞప్తికి తెచ్చే స్మృతి మందిరాలు. అంతేకాదు, నేటి రాజకీయ, విద్య, ఆర్థిక రంగాలలో ప్రముఖులుగా వెలుగొందుతున్న వారెందరో ఈ విద్యాలయంలో అభ్యసించినవారే కావడం విశేషం.

డా ॥ మండి అన్వర్ హుసేన్,
(ఉస్మానియా కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ ఆఫ్ తెలుగు,
కర్నూలు, సెల్ : 9440655230)

జన వాక్యం

అప్పడే మట్టి కొట్టారు

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి నిధులు కేటాయించక పోవడంపై అన్ని పార్టీలు, సంఘాలు తీవ్రస్థాయిలో నిరసనలు, నినాదాలు వ్యక్తం చేశాయి. అధికార పార్టీ వారు కూడా ప్రజల నుండి వ్యతిరేకత ఎదురవ్వకుండా తమ వంతు ప్రయత్నం చేశారు. రాష్ట్రం విడిపోకూడదని సమైక్యాంధ్ర నినాదాల నుండి రాష్ట్ర రాజధాని నిర్మాణం, ప్రత్యేక హోదా, ప్రత్యేక ప్యాకేజీ వరకు నిరసనలు చేస్తూనే వున్నాం. అయినా రాజధాని నిర్మాణం కోసం మన ప్రధాని కేంద్రం నుండి మట్టి తెచ్చి ఇచ్చినప్పుడే వారి ధోరణి ఏంటో అర్థం చేసుకోవాల్సింది. అప్పుడు చెంబులో మట్టి తెచ్చారు... ఇప్పుడు నేరుగా ఆంధ్రా అభివృద్ధికి మట్టి కొట్టారు... ఇక కేంద్రం నుండి నిధులు వస్తాయని అనుకోవడం భ్రమే! లోటు బడ్జెట్ ఉన్న రాష్ట్రం గురించి కేంద్రమే పట్టించుకుంటుందో... రాష్ట్రాభివృద్ధికి రాష్ట్రం ఏం చేస్తుందో వేచి చూడాల్సిందే!


కునిరిగి రమేష్,
అనంతపురం జిల్లా.

వ్యాసాలు, ఉత్తరాలు రాయవల్సిన చిరునామా
editpageps@gmail.com

చర్చ

అర్చకులకూ ఉద్యమమే శరణ్యం

ఆంధ్రప్రదేశ్‌లోని హిందూ దేవాలయాల అర్చకులు తాము చాలా కాలంగా అనేక సమస్యలను ఎదుర్కొంటున్నామని, అవి అపరిష్కృతంగా ఉండిపోయాయని, వాటిని ప్రభుత్వం పరిష్కరించకుంటే ఉద్యమానికి దిగుతామని హెచ్చరిస్తున్నారు. 2014 ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న వాగ్దానాలను అమలు చెయ్యమని వారు డిమాండ్ చేస్తున్నారు. 2017 ఫిబ్రవరి 16న జారీ అయిన జి.ఒ ఎంఎస్ 76 నోటిఫికేషన్‌ను అమలు చేయమని కోరుతున్నారు. ఇదివరకే ఎంపిక చేసిన దేవాలయాలకు ప్రభుత్వం బాకీ పడి వుందని, ఆ బకాయిలను వెంటనే చెల్లించాలని అడుగుతున్నారు. అంతే కాదు, కొత్తగా మరో వెయ్యి దేవాలయాలను కూడా ఎంపిక చేసి వాటికి నెలకు రూ.6 వేలు చెల్లించాలని కోరుతున్నారు. తమవి న్యాయమైన కోర్కెలని, వాటిని ప్రభుత్వం పరిష్కరించాలని, లేకుంటే ఉద్యమబాట పడతామని హెచ్చరిస్తున్నారు.



రాచపాలెం చంద్రశేఖర రెడ్డి

ఇదంతా వింటే, ఇదేదో కార్మిక సంఘమో, ఉద్యోగ సంఘమో, విద్యార్థి సంఘమో చేస్తున్న డిమాండులాగా ఉంది. కాని ఈ హెచ్చరిక చేస్తున్నది హిందూ సమాజంలో అత్యంత గౌరవనీయ స్థానంలో ఉన్న అర్చకులు. అర్చకులు చేసిన ఉద్యమ హెచ్చరిక ఒకవైపు ఉద్యమ అనివార్యతను చాటి చెబుతున్నది. మరో వైపు అర్చక వ్యవస్థ పట్ల ప్రశ్నలనూ రేకెత్తిస్తున్నది. ప్రజల సమస్యలకు అనేక రంగాల వాళ్ళు అనేక రకాల పరిష్కారాలు చెబుతూ ఉంటారు. తత్వవేత్తలు, డాక్టర్లు, ఇంజనీర్లు, రాజకీయవాదులు, మేధావులు ఇలా అనేక రకాల వాళ్ళు తమతమ పద్ధతులలో సామాజిక సమస్యలకు పరిష్కారం సూచిస్తుంటారు. అలాగే వేదాంతులు, జ్యోతిష్యులు, అర్చకులు కూడా మానవ సమస్యలకు తమవైన పరిష్కారాలు సూచిస్తూ ఉంటారు. పూజలు, వ్రతాలు, నోములు మొదలుకొని యజ్ఞాలు, యాగాల వరకు వీళ్ల చెప్పే పరిష్కార మార్గాలుంటాయి. ఆరోగ్యం బాగుపడాలన్నా, ఉద్యోగం రావాలన్నా, పెళ్లి కావాలన్నా, ఆర్థికంగా పైకి రావాలన్నా, కుటుంబ బాధలు పోవాలన్నా ఇంకా అనేక శారీరక, మానసిక, కౌటుంబిక, సామాజిక సమస్యలకు వీళ్లు ఇలాంటి పరిష్కారాలే చెబుతుంటారు. అంటే ఒక మనిషికి మరో మనిషి నుండి, ఒక గుంపు నుండి మరో గుంపుకు వచ్చే సమస్యలకు వీళ్ల మనిషికి, గుంపుకు సంబంధం లేని ప్రాంగణంలో పరిష్కారాలు సూచిస్తుంటారు. వాటిని నమ్మిన వాళ్ళు, వీళ్లు చెప్పే పరిష్కారాల మీద పెద్ద మొత్తంలో డబ్బులు

అర్చకులు ఉద్యమబాట పడుతున్నారంటే తాము పూజించే, ఇతరులతో పూజింపజేసే దేవుళ్లు తమ సమస్యలను పరిష్కరించలేదని మనం అర్థం చేసుకోవాలి. మనిషి సమస్యను మనిషే పరిష్కరించాలి. మనిషి తప్ప ఇంకేదీ మనిషి సమస్యను పరిష్కరించ లేదు. అందుకే ఉద్యమాలు పుట్టాయి.



ఖర్చు పెట్టేస్తూ వుంటారు. మనిషికొచ్చే సమస్యకు వ్యవస్థలో పరిష్కారాన్ని అన్వేషించడం పోయి, వీళ్ల దేవుళ్లలో పరిష్కారాలను చూపిస్తూ ఉంటారు.

అయితే వీళ్లకొచ్చిన సమస్యలను పరిష్కరించుకోవడం కోసం వీళ్ల ఇతరులకు చెప్పిన పూజలు, అభిషేకాలు, యజ్ఞాలు, యాగాలు చేస్తున్నారా? అర్చకులు ఆర్థిక సమస్యల్ని తాము అర్చించే దేవుళ్లకు నివేదించరా? భక్తుల సమస్యలకు వీళ్ల చెప్పే పరిష్కారాలను, తమ సమస్యలకు కూడా అన్వయించుకోవాలి కదా! భక్తులకు వీళ్ల సూచించే పరిష్కారాలను వీళ్ల సమస్యలకు కూడా అన్వయించుకొని విఫలమై ఉద్యమబాట పడుతున్నారా! విశ్వాసాలకు ప్రచారం చేసే అర్చకులు ఉద్యమ బాట పట్టడం వైరుధ్యం కాదా! విశ్వాసమన్నా నిజం కావాలి. ఉద్యమమన్నా నిజం కావాలి.

అర్చకులు ఉద్యమబాట పడుతున్నారంటే తాము పూజించే, ఇతరులతో పూజింపజేసే దేవుళ్ల తమ సమస్యలను పరిష్కరించలేదని మనం అర్థం చేసుకోవాలి. మనిషి సమస్యను మనిషే పరిష్కరించాలి. మనిషి తప్ప ఇంకేదీ మనిషి సమస్యను పరిష్కరించ లేదు. అందుకే ఉద్యమాలు పుట్టాయి. అర్చకుల డిమాండ్లు వాళ్ల ఉద్యమ నినాదం ఈ వాస్తవాన్నే చాటి చెబుతున్నాయి. మనిషి భౌతిక శ్రమతో, భౌతిక జీవితంతో సంబంధం లేని, మత విశ్వాసాలతో నిండిన కర్మకాండల వల్ల ప్రయోజనం శూన్యం. 'ముప్పదికోట్ల దేవత లెగబడ్డ దేశమున' అని జాషువా అన్నట్లు వీధికొక్క దేవుడు కొలువుతీరిన మన దేశంలో ప్రజల సమస్యలు రోజురోజుకూ ఎందుకు ఎక్కువవుతున్నాయని భావవాదులు ఆలోచించాలి.

గతంలో తమ కోర్కెల సాధన కోసం అర్చకులు మూడు రోజులు దేవాలయాలు మూసేశారు. దైవమే మానవ సమస్యలను పరిష్కరించే టట్టయితే, అర్చకులు తమ డిమాండ్ల సాధన కోసం అభిషేకాలు, అర్చనలు చేయాలి. యజ్ఞాలు, యాగాలు చెయ్యాలి. తమ వద్దకు వచ్చే భక్తులకు అర్చకులు, పురోహితులు, ఏయే ఉపాయాలు చెబుతుంటారో, తమ సమస్యలకు కూడా వాటినే అనుసరిస్తే అవి పరిష్కారం కావు. కనుకనే వాళ్ల ఉద్యమబాట పట్టారు. ఈ వాస్తవాన్ని అర్చకులు కూడా గుర్తించాలి.

అర్చకులు అడుగుతున్నది జీవితానికి భద్రత. ఆర్థిక భద్రత. ఇవి భౌతిక సమస్యలు. వీటిని ప్రభుత్వం తీర్చాలి. పరిష్కరించాలి. అర్చకులు తమ సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాన్ని ఎంచుకొని, తమ దగ్గరకు వచ్చే వాళ్లకు ఉద్యమేతర మార్గం సూచించకూడదు. 'పోరాడితే పోయేదేమీ లేదు, బానిస సంకెళ్ల తప్ప' అన్న ఉద్యమ నినాదాన్ని అర్చకులు గుర్తు చేసుకోవాలి. అర్చకులు కూడా మనుషులే. వాళ్లకూ సమస్యలు వుంటాయి. వాటికి పరిష్కారాలు కావాలి. అవి శాస్త్రీయమైన, హేతుబద్ధమైన పరిష్కారాలుగా వుండాలి.

అర్చకులు గుర్తించవలసిన వాస్తవం ఒకటుంది. మొత్తం సామాజిక సమస్యలలో అర్చకుల సమస్య ఒక అంతర్భాగం. మొత్తం సమాజంలో అర్చకులు ఒక భాగం. అందువల్ల మొత్తం సామాజిక సమస్యల పరిష్కారంలో భాగంగా అర్చకుల సమస్యలూ పరిష్కారం అవుతాయి. ఈ కారణంగా సమాజంలో ఏ సమూహమైనా తన సమస్యల పరిష్కారం కోసం గొంతు విప్పి నినదించినప్పుడు అర్చకులు కూడా వాళ్లతో గొంతు కలపాలి. ఎంత ఎక్కువ మందితో మనం కలిసి నడవగలిగితే మన జీవితాలు అంత ఆరోగ్యకరంగా ఉంటాయన్న వాస్తవాన్ని అందరూ గుర్తించాలి. మేము వేరే అనుకుంటే గట్టు మీద పడిన చేప పరిస్థితి దాపురిస్తుంది. అర్చకులు చేసే పనులు భావవాద విశేషాలే అయినా, వాళ్ల ఆర్థిక సమస్యలు పరిష్కారం కావాలి. వాళ్ల ఆకలి తీరాలి.

(రచయిత ప్రజాశక్తి బుక్‌హౌస్ గౌరవ సంపాదకులు)

గుమ్మాడమ్మా గుమ్మడి




‘గుమ్మాడి.. గుమ్మాడీ.. ఆడిందంటే అమ్మాడీ’ అంటూ గుమ్మడి మీద పాటలూ ఉన్నాయి. ఏదేమైనా గుమ్మడికాయగానీ, పువ్వుగానీ బంగారువర్ణంతో మెరిసిపోతూ మురిపిస్తుంటాయి. పోషకాలు మెండుగా ఉండే తీపిగుమ్మడి రుచి అదుర్స్! దీంతో చాలామంది కూరో, పులుసో మాత్రమే చేస్తుంటారు. కానీ, గుమ్మడితో చేయాలేగానీ.. చాలా వెరైటీ వంటకాలే ఉన్నాయి. చలిమిడి, హల్వా, మజ్జిగపులుసు, కేక్ వంటి వెరైటీ వంటకాలు ఎలా తయారు చేయాలో ప్రయత్నించి చూద్దాం.. పదండి.

చలిమిడి

కావల్సిన పదార్థాలు : చెక్కు తీసి సన్నగా తరిగిన తీపి గుమ్మడి ముక్కలు – పెద్ద కప్పు, నెయ్యి – పావుకప్పు, బెల్లం తురుము – ముప్పావు కప్పు, తెల్ల నువ్వులు, కొబ్బరి ముక్కలు – రెండు టేబుల్‌స్పూన్ల చొప్పున, యాలకులపొడి – రెండు చెంచాలు.

తయారుచేసే విధానం: గుజ్జు, గింజలు తీసేసిన గుమ్మడి ముక్కల్ని ఎంచుకోవాలి. పాన్‌లో రెండు టేబుల్‌స్పూన్ల నెయ్యి కరిగించి గుమ్మడి ముక్కల్ని వేయాలి. ఐదారు నిమిషాలకు అవి వేగి రంగు మారతాయి. ఆ తరవాత మంట తగ్గించి మూతపెట్టేయాలి. అయితే అలాగే వదిలేయకుండా మధ్య మధ్య కలుపుతూ ఉండాలి. అవసరాన్ని బట్టి చెంచా నెయ్యి కూడా వేసుకోవాలి. గుమ్మడి ముక్కలు పూర్తిగా ఉడికి ముద్దలా కావడానికి కనీసం పావుగంట పడుతుంది. గుమ్మడి ముక్కలు మెత్తగా అయ్యాక బెల్లం తురుము చేర్చాలి. అది కరిగేలోగా సగం తెల్ల నువ్వుల్ని పొడిచేసుకోవాలి. బెల్లం పూర్తిగా కరిగి మిశ్రమం దగ్గరగా అవుతున్నప్పుడు నువ్వులపొడి, మిగిలిన నువ్వులూ వేయాలి. అలాగే నేతిలో వేయించుకున్న కొబ్బరిముక్కలు, యాలకులపొడి వేసి బాగా కలిపి దింపేయాలి. ఇది ముద్దలా ఉంటుంది. మూడురోజుల దాకా నిల్వ ఉంటుంది.



మజ్జిగ పులుసు

కావలసిన పదార్థాలు : తీపి గుమ్మడికాయ ముక్కలు– 12 (పెద్దవి), కొబ్బరి తురుము – అరకప్పు, పచ్చిమిర్చి – రెండు లేదా మూడు, ఎండుమిర్చి– మూడు, జీలకర్ర – అరటీ స్పూను, ధనియాలు – అరటీ స్పూను, పెరుగు– రెండు కప్పులు, ఉప్పు – తగినంత.



తయారుచేసే విధానం : ముందుగా గుమ్మడికాయ ముక్కలను తగినంత నీరు పోసి ఉడికించుకోవాలి. ఎండు మిరపకాయలు, పచ్చిమిర్చి, పచ్చి కొబ్బరి, జీలకర్ర అన్నీ కలిపి మెత్తగా రుబ్బుకోవాలి. ఉడుకుతున్న గుమ్మడికాయ ముక్కలలో రుబ్బిన ముద్ద, ఉప్పు, పెరుగు వేసి మరికొద్ది సేపు ఉడికించుకోవాలి. పాన్‌లో నెయ్యి రెండు స్పూన్లు వేసి, కొద్దిగా ఆవాలు, మినపప్పు, నాలుగు ఎండుమిర్చి ముక్కలు చేసి, కరివేపాకు రెబ్బలు రెండు వేసి తాలింపు పెట్టాలి. అంతే ఎంతో రుచికరమైన గుమ్మడికాయ మజ్జిగ పులుసు రెడీ! ఇది వేడి వేడి అన్నంలోకి బాగుంటుంది.

కేక్

కావలసిన పదార్థాలు : గుమ్మడికాయ గుజ్జు – అరకప్పు, మైదా – అరకప్పు, గోధుమరవ్వ– పావు కప్పు, బేకింగ్ పౌడర్ – పావు టీ స్పూన్, బేకింగ్ సోడా – పావు టీ స్పూన్, ఉప్పు – చిటికెడు, లవంగం – ఒకటి, దాల్చినచెక్క– ఒక చిన్న ముక్క, శొంఠి – చిన్నముక్క, బాదంపప్పులు– 10, కరిగించిన వెన్న – 75 గ్రాములు, స్వీట్ కండెన్స్‌డ్ మిల్క్ – 150 గ్రాములు, వెనీలా ఎసెన్స్– పావు టీ స్పూన్, నీళ్ళు – 20 మి.లీ,

తయారుచేసే విధానం : గుమ్మడి ముక్కలను కొంచెం ఉడకబెట్టి, ఉడికిన ఆ ముక్కల్లోంచి గుజ్జును తీసుకొని, మిక్సీలో మెత్తగా చేసుకోవాలి. శొంఠి, లవంగం, దాల్చినచెక్క ముక్కలను రోట్లో వేసుకొని మెత్తగా దంచి పెట్టుకోవాలి. కేక్ తయారుచేసుకోవడానికి కేక్‌టిన్‌ని తీసుకొని దానిలో బటర్ పేపర్ సమంగా సరిపోయేలా కట్‌చేసుకొని వేసుకోవాలి. బటర్ పేపర్ వేసే ముందు కేక్‌టిన్‌కి కొంచెం నెయ్యి రాయాలి. తర్వాత దానిలో బటర్‌పేపర్ వేసి దానిమీదా కొంచెం నెయ్యి వేసి రాయాలి. బాదం పప్పుల్ని చిన్న చిన్న ముక్కలుగా కట్ చేసుకోవాలి.



ఓవన్‌ని 180 డిగ్రీల ప్రీ హీట్‌లో పెట్టుకోవాలి. డీప్‌గా ఉన్న బౌల్‌ని తీసుకొని అందులో గుమ్మడికాయ గుజ్జు, స్వీట్‌అండ్ కండెన్స్డ్ మిల్క్, వెన్న, వెనీలా ఎసెన్స్ వీటన్నింటినీ బాగా కలుపుకోవాలి. ఇంకో బౌల్‌లో మైదా, గోధుమరవ్వ, బేకింగ్ పౌడర్, బేకింగ్ సోడా, ఉప్పు, తయారుచేసి పెట్టుకున్న స్పైస్ పౌడర్, తరిగిన బాదం పప్పులను వేసి కలపండి. తర్వాత ఈ మిశ్రమంలో తయారుచేసి పెట్టుకున్న గుమ్మడి మిశ్రమాన్ని ఉండలు లేకుండా బాగా కలుపుకోవాలి. మిశ్రమం చిక్కగా కాకుండా తగినంత నీరు పోసుకొని కలుపుకోవాలి. కేక్‌టిన్‌లోనికి ఈ మిశ్రమాన్ని వేసి, సమంగా ఉండేలా చేయాలి. దాన్ని ప్రీహీటెడ్ ఓవెన్‌లో పెట్టుకోవాలి. దీనిని 30 నుంచి 40 నిమిషాలు బేక్ చేసుకోవాలి. కేక్ ఉడికిన తర్వాత బటర్‌పేపర్‌ని తొలగించాలి.

సూప్

కావలసిన పదార్థాలు : మీగడ –కప్పు, గుమ్మడికాయ – ఒకటి, తేనె – టీస్పూను, వెల్లుల్లి – రెండు రెబ్బలు, ఉల్లిపాయ – ఒకటి, చికెన్ స్టాక్ – రెండు లీటర్లు, ఆలివ్ ఆయిల్ – తగినంత, ఉప్పు, మిరియాల పొడి – తగినంత, పండుమిర్చి – రెండు (విత్తనాలు తీసి సన్నగా తరగాలి), నిమ్మకాయలు – రెండు, నిమ్మచెక్క – కొద్దిగా.

తయారుచేసే విధానం : ఓవెన్‌ను 200 డిగ్రీల దగ్గర ప్రీ హీట్ చేసుకోవాలి. గుమ్మడికాయను సగానికి కోసి, విత్తనాలు తీసేయాలి. కోసిన వైపు ఆలివ్ ఆయిల్, ఉప్పు, మిరియాల పొడి రుద్ది పక్కన పెట్టుకోవాలి. ఒక పండు మిరపకాయను టూత్‌పిక్‌తో గుచ్చి గుమ్మడికాయలో ఉంచాలి. ట్రేలో ఉల్లి ముక్కలు, వెల్లుల్లి ఉంచి, వాటి మీద ఆలివ్ ఆయిల్ చల్లి, గుమ్మడికాయతోపాటు ఓవెన్‌లో ఉంచాలి. ఉడికిన తర్వాత ట్రే బయటకు తీసి చల్లారనివ్వాలి.



తర్వాత గుమ్మడి గుజ్జును గరిటతో తీసి పక్కన పెట్టుకోవాలి. దీనిలో ఉల్లి, వెల్లుల్లి, కప్పు చికెన్ స్టాక్ వేసి బ్లెండర్‌లో మెత్తగా గుజ్జు చేసుకోవాలి. పాన్‌ను వేడిచేసి, మిగిలిన చికెన్ స్టాక్, తేనె, మీగడ వేసి, కొద్దిగా ఉప్పు కలిపి, చిన్న మంట మీద ఉడికించాలి. సన్నగా తరిగిన పండుమిర్చి, నిమ్మచెక్క, నిమ్మరసం, ఉప్పు, మిరియాల పొడి మొత్తం మిక్సీలో వేసి మసాలా తయారుచేసుకోవాలి. ఇప్పుడు సూప్‌ను బౌల్స్‌లో నింపి, పైన మసాలా చల్లి సర్వ్ చేయాలి.

ఓట్మీల్ కుకీస్

కావలసిన పదార్థాలు : ఓట్స్– కప్, గోధుమపిండి– 90 గ్రాములు, గ్రౌండ్ సిన్న మోన్ –2 స్పూన్లు, జాజికాయ – పావు టీ స్పూన్, అల్లం – పావు టీ స్పూన్, బేకింగ్ పౌడర్– ఒకటిన్నర స్పూన్, ఉప్పు– పావు టీ స్పూన్, వెన్న – రెండు టేబుల్ స్పూన్లు, గుమ్మడికాయ గుజ్జు – 180 గ్రాములు, వెనీలా – స్పూన్, స్వచ్ఛమైన మాపుల్ సిరప్– అరకప్పు, సెమీటివిట్ చాక్లెట్ చిప్స్– రెండు స్పూన్లు, చిన్న చాక్లెట్ చిప్స్– టేబుల్ స్పూన్.

తయారుచేసే విధానం : ఒక గిన్నెలో ఓట్స్, గోధుమపిండి, దాల్చినచెక్క, జాజికాయ, అల్లం, బేకింగ్ పౌడర్, ఉప్పు కలిపి ఉంచుకోవాలి. ఇంకో గిన్నెలో కొంచెం వెన్న వేసి గుమ్మడికాయ గుజ్జు మరియు వెనీలాను వేసి కలుపుకోవాలి. పిండి మిశ్రమాన్ని అందులో బాగా కలపాలి. ముద్దగా తయారైన పదార్థాన్ని చాక్లెట్ చిప్స్‌లో వేయాలి. సమతలంగా ఉన్న ఒక షీట్‌మీద కుకీస్ షేప్‌లో అమర్చుకోవాలి. వాటిమీద చిన్న చాక్లెట్ చిప్స్ పెట్టుకోవాలి. 325 ఫార్మ్ హీట్‌లో 11–14 నిమిషాలపాటు ఓవెన్‌లో బేకింగ్ చేయాలి. ఓవెన్‌లో నుంచి తీసి పది నిమిషాలు చల్లార్చుకోవాలి. అంతే టేస్టీ కుకీస్ రెడీ..!





రోగనిరోధక శక్తిని పెంచుతాయి

గుమ్మడిలో కెరోటినాయిడ్స్ పుష్కలంగా ఉంటాయి. ఇవి విటమిన్–ఎ ని తయారుచేస్తాయి. గుమ్మడి గింజలు రోగనిరోధక శక్తిని పెంచుతాయి. ముఖ్యంగా జలుబు, దగ్గు, ఆస్తమా ఉన్నవారికి గుమ్మడి చాలా మేలు చేస్తుంది.



- జానకి బడుగు
పోషకాహార నిపుణులు

దాచిపెట్టడం.. ఎందుకు?

శానిటరీ నాప్‌కిన్స్ అనగానే అదేదో చాటుమాటు వ్యవహారంగా.. ఎవరికీ తెలియకుండా.. ఎవరూ చూడకుండా ఉండాలనే ధ్యాసే ఎక్కువగా ఉంటుంది. అలా ఉండకూడదంటున్నారు సామాజిక చైతన్యకారులు. పాడ్స్ కొన్నప్పుడు ఉపయోగించేటప్పుడు ప్లాస్టిక్ కవర్‌లో దాచిపెట్టడం సర్వసాధారణం. దీనికి కారణం.. అవి బయటికి కనిపించకుండా ఉండాలనే ఆలోచనే. హ్యాండ్‌బ్యాగ్‌లో నేరుగా పెట్టాలంటే కూడా సంశయిస్తూ.. అదేదో కూడని వస్తువులా భావిస్తారు. చాలాచోట్ల శానిటరీ నాప్‌కిన్స్ న్యూస్‌పేపర్‌లో చుట్టేసి, నల్లటి ప్లాస్టిక్ కవర్‌లోనో, లేదా వేరే ముదురు రంగు కవర్‌లోనో పెట్టేస్తారు. తెలిసీ తెలిసి ప్లాస్టిక్ వాడకాన్ని ఈ విధంగా పెంచుతున్నారు. ఆ ప్లాస్టిక్‌తో ఎంత నష్టం చేకూరుతుందో పట్టింపు ఉండదు. అందుకే ఇది చాటుమాటు వ్యవహారం కాదు. అందరికీ తెలియాల్సినవి తెలుసుకోవాల్సినదే. ‘ఎందుకు శానిటరీ నాప్‌కిన్స్ మీ హ్యాండ్‌బ్యాగ్‌లో పెట్టరు?’ అనే ప్రశ్న నుంచి మొదలైంది ఓ ప్రచార ఉద్యమం. డోంట్ హైడ్ ఇట్. పీరియడ్ పేరుతో సోషల్‌మీడియాలో లేవనెత్తిన ఓ అంశానికి విశేష స్పందన వస్తోంది. నేహా తుల్సైన్ ఈ ప్రచారాన్ని ప్రారంభించారు. ప్రజల ఆలోచనా తీరు మారితే తప్ప ఇది సాధ్యం కాదని, అందుకోసమే ఈ ప్రచారోద్యమానికి శ్రీకారం చుట్టినట్టు నేహా చెప్తున్నారు. శానిటరీ ప్యాడ్స్‌ని తీసుకెళ్లడం అంటే.. చెడును తీసుకెళ్తున్నామనే భావన ఉన్నన్ని రోజులూ సమాజంలో



మార్పు రాదని అంటున్నారు. ఈ ప్రచారంలో భాగంగా ప్రజల్లో చైతన్యం కల్పించాలన్నారు. ఈ ఉద్యమంలో భాగంగా ఎర్రటి పోల్కా చుక్కలతో ఉన్న తెల్లటి కాన్వాస్ బ్యాగ్‌లో ప్యాడ్స్ ప్యాక్ ఉంచుతున్నారు. ఇది ఈ ఏడాది జనవరి మాసంలో ప్రారంభమైంది. వీళ్లు రూపొందించిన కాన్వాస్ బ్యాగ్‌లో పది ప్యాడ్స్ పడతాయి. ప్రతి ప్యాడ్ మీదా సామాజిక ఉద్దేశంతో రాసిన సందేశం ఉంటుంది. ఇలా ప్యాడ్స్ కోసం అందమైన బ్యాగ్ చేయడం బాగుంది కదా! దీని ఉద్దేశం ప్యాడ్ ఎంత ముఖ్యమైందో చెప్పడమే.

వ్యర్థంతో అర్థవంతమైన ప్రాజెక్ట్

ఊటీలో ప్రారంభించనున్న ఈ ప్రాజెక్ట్ వ్యర్థంతో అర్థవంతంగా మారనుంది. చెత్త సమస్యను తగ్గించడమే కాదు, చాలామంది రైతన్నలకు అండగా నిలబడింది. మరికొద్ది రోజుల్లో నిర్మాణం కానున్న ఈ కంపోస్ట్ యార్డ్ నిర్మాణానికి కృషి చేశారు నీలగిరి జిల్లా కలెక్టర్‌గా పనిచేస్తున్న దివ్య. నీలగిరి మున్సిపాలిటీ పరిధిలోని ఖండాల్‌లో దీని నిర్మాణం జరుగుతోంది. దీన్ని జిల్లా కలెక్టర్ దివ్య ప్రారంభించారు. ఊటీ పరిసర ప్రాంతాల్లోని రెస్టారెంట్లు, కాటేజ్‌లు, మార్కెట్‌లో సుమారు ఎనిమిది టన్నుల చెత్తను వేస్తున్నారు. ఇంత చెత్తను ప్రయోజనకరంగా వాడేలా ఒక కొత్త ఆవిష్కరణ చేయాలనుకున్నారావిడ. ఆ ఆవిష్కరణ వల్ల పదిమందికి మంచి చేయాలనుకున్నారు. అందుకే



ఆర్గానిక్ వేస్ట్ యార్డ్ నిర్మించి, దాని నుంచి సేంద్రీయ ఎరువు తయారుచేయ నున్నారు. ఈ కార్యక్రమంవల్ల సేంద్రీయ వ్యవసాయానికి ప్రోత్సాహం ఇవ్వడంతో పాటు రైతులకు అండగా నిలబడినట్టు ఉంటుందని భావించారు. భవిష్యత్తులో తక్కువ ధరకే ఈ సేంద్రీయ ఎరువును ఇవ్వనున్నారు. యార్డ్ ప్రారంభమయ్యాక రోజుకు సుమారు మూడు టన్నుల ఎరువు తయారుచేయనున్నారు. చెత్తతో కొత్తగా చేయాలనే ఐడియా ఎవరిదో కానీ అందుకు సహకరించిన కలెక్టర్ దివ్యను అక్కడి వాళ్లు అభినందిస్తున్నారు. పర్యావరణానికి హాని చేసే చెత్తతో ఎరువులు తయారుచేసే ఇలాంటి ప్రాజెక్టులు ఇంకా రావాలని ఆకాంక్షిస్తున్నారు.

మీ కోసం



పచ్చిమిర్చిని నిల్వ చేసేటప్పుడు వాటిని ఉంచిన కవరులో కొద్దిగా పసుపును వేస్తే అవి తొందరగా పండిపోవు

జీవన సౌరభం


అందరినీ నమ్మడం.. ఎవరినీ నమ్మకపోవడం.. రెండూ ప్రమాదకరమే!

45 ఏళ్ల కిందటే ఊరిని దత్తత తీసుకున్న డాక్టర్!

ఇటీవల కాలంలో ఊరిని దత్తత తీసుకోవడం ద్వారా కొంతమంది సినిమా హీరోలు, సెలబ్రిటీలు ప్రచారంలోకి వచ్చారు. అయితే నాలుగున్నర దశాబ్దాల కిందటే ఓ డాక్టర్, అతని భార్య ఒక ఊరిని దత్తత తీసుకోవడమే కాకుండా, అక్కడి ప్రజలతో కలిసిమెలసి జీవిస్తున్నారు. ఇప్పటి సెలబ్రిటీల దత్తతల కన్నా వారి ఆచరణ ఎంతో విభిన్నమైనది కూడా. ఆయన పేరు డాక్టర్ ప్రకాష్‌బాబా ఆమ్టే, ఆయన భార్య పేరు మందాకిని ఆమ్టే. ఇందులో ఆయన ఊరినే ఎందుకు దత్తత తీసుకోవాల్సి వచ్చిందో తెలుసుకోవాలంటే మనం నలభై ఐదు సంవత్సరాల వెనక్కి వెళ్లాలి. అంటే 1973లోకి వెళ్లాలి. రామన్ మెగాసెసె అవార్డు గ్రహీత బాబాఆమ్టే కుమారుడే ఈ డాక్టర్ ప్రకాష్‌బాబా ఆమ్టే. అప్పటికి ఆయన ఎంబీబీఎస్ చదివి ఎంఎస్ చేస్తున్నారు. చదువుతున్న సమయంలోనే గిరిజన తండాల అభివృద్ధి కోసం సేవచేయాలని ప్రత్యేకంగా ‘లోక్ బిరాదరి ప్రకల్ప్’ అనే ప్రాజెక్టును ఆయన ఏర్పాటు చేశారు. అందుకోసం మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లాలో ఉన్న హేమల్‌కసా అనే మారుమూల గ్రామాన్ని ఎంచుకున్నారు. అక్కడ తనకు కొంత భూమి ఇవ్వాలని ప్రభుత్వానికి దరఖాస్తు పెట్టుకున్నారు. ప్రభుత్వం నుంచి అనుమతి లభించగానే చేస్తున్న ఎంఎస్ వదిలి భార్యతో సహా ఆ గ్రామానికి వెళ్లారు. అయితే అక్కడ అన్నీ సమస్యలే వారికి కనిపించాయి.



ఆ గ్రామంలో అప్పటికి ఇంకా కరెంటు లేదు. పాఠశాల, హాస్పిటల్ అంటేనే అక్కడి వారికి తెలియదు. అంతటి మారుమూల పల్లెను ప్రకాష్‌బాబా ఆమ్టే మూడు దశల్లో అభివృద్ధి చేయదలుచుకున్నారు. అందులో ఒకటి లోక్ బిరాదరి ప్రకల్ప్ దవాఖానా (హాస్పిటల్), లోక్ బిరాదరి ప్రకల్ప్ ఆశ్రమ్ (పాఠశాల), ఆమ్టేస్ యానిమల్ పార్క్. స్థానిక గిరిజనుల ఆరోగ్యం కోసం హాస్పిటల్, వారి పిల్లల కోసం పాఠశాలను ఏర్పాటు చేయాలనేది ఆ ప్రాజెక్టుల ముఖ్య ఉద్దేశం. అంతేకాదు స్థానికులు తమ ఆహారం కోసం ఎక్కువగా వన్యప్రాణులపై ఆధార పడుతుండడంతో వాటిని సంరక్షించడం కోసం ఆమ్టే ఓ ప్రణాళికను సిద్ధం చేశారు. తన వద్ద ఉన్న ఆహారాన్ని వారికి ఇచ్చి, వారు పట్టుకున్న వన్య ప్రాణులను తన యానిమల్ పార్క్‌లో పెంచడం





ప్రారంభించారు.

అలా ప్రకాష్‌బాబా ఆమ్టే వద్ద ఇప్పుడు అనేక చిరుతపులులు, ఎలుగుబంట్లు, పాములు, పక్షులు, జింకలు, గుడ్లగూబలు, మొసళ్లు, హైనాలు, కోతులు ఉన్నాయి. వాటన్నింటికీ ఆయనే సంరక్షకుడు. అయితే వన్య మృగాలను హ్యాండిల్ చేయడమంటే అంత సులువు కాదు. కొన్ని క్రూర మృగాలు కూడా ఉంటాయి. ఉదాహరణకు చిరుతపులులు. అయినా ప్రకాష్‌బాబా ఆమ్టే వాటితో సాంగత్యం చేయడం మొదలుపెట్టారు. ఇప్పుడు అవి ఆయన ఏం చెబితే అవే చేస్తాయి. అంతగా అవి ఆయనకు మాలిమయ్యాయి. ఈ క్రమంలో ఆయన స్థాపించిన హాస్పిటల్ ద్వారా ఇప్పుడు ఏడాదికి దాదాపుగా 40 వేల మంది స్థానికులకు వైద్యం అందుతోంది. ఆయన ఏర్పాటు చేసిన పాఠశాలలో ఇప్పుడు 600కు పైగా పిల్లలు చదువుకుంటున్నారు. ఇదంతా ఆయన చలవే అంటారు స్థానికులు.

ప్రకాష్‌బాబా ఆమ్టే చేసిన కృషికిగాను ఆయనకు ఎన్నో అవార్డులూ లభించాయి. 2014లో మదర్ థెరిస్సా అవార్డు, 2012లో లోకమాన్య తిలక్ అవార్డు, 2009లో గాడ్‌ఫ్రే ఫిలిప్స్ లైఫ్‌టైం అచీవ్‌మెంట్ అవార్డు, 1984లో ఆదివాసీ సేవక్ అవార్డులు ఆయనను వరించాయి. 2008లో ఆయనకు, ఆయన భార్యకు కలిపి ప్రఖ్యాత రామన్ మెగాసెసె అవార్డును ప్రదానం చేశారు. 2002లో ఆయనకు పద్మశ్రీ కూడా వచ్చింది. అంత సాధించినా ఆయన ఇంకా ఆ గిరిజన ప్రాంత వాసులతోనే ఇప్పటికీ జీవిస్తున్నాడు. జీవితాంతం తాను మరణించే వరకూ గిరిజనుల సేవకే అంకితమవుతానని అంటున్నారు ప్రకాష్‌బాబా ఆమ్టే.

ఆయన జీవితంపై ఓ సినిమా కూడా తీశారు. నానాపటేకర్, సోనాలి కులకర్ణిలు ప్రధానపాత్రల్లో ‘డాక్టర్ ప్రకాష్‌బాబా ఆమ్టే: ది రియల్ హీరో’ అనే పేరుతో ఆ సినిమా వచ్చింది. మొనాకో ప్రభుత్వమైతే ఆయన, ఆయన భార్య పేరిట ఓ స్టాంపును కూడా విడుదల చేసింది. డాక్టర్ ప్రకాష్‌బాబా ఆమ్టే జీవితం నుంచి ప్రస్తుత దత్తత సెలబ్రిటీలు నేర్చుకోవాల్సిందైతే చాలానే ఉంది. ★

సెన్సెక్స్ ↓ 236
33,774

నిఫ్టీ ↓ 74
10,378

రూపాయి ↓ 30 పై॥
అమెరికా డాలరుకు రూ.
64.21

ఆటగాళ్లతో బ్రిడ్జ్‌స్టోన్ జట్టు..

ప్రముఖ టైర్ల కంపెనీ బ్రిడ్జ్‌స్టోన్ ఇండియా ప్రపంచ వ్యాప్త ఒలింపిక్ భాగస్వామ్యంలో భాగంగా నలుగురు ఆటగాళ్లతో భాగస్వామ్యం కుదుర్చుకుంది. మేరీ కామ్, సాక్షి మాలిక్, లలితా బాబర్, శ్రీకాంత్ కిడంబితో జట్టు కట్టింది. ఇప్పటికే పివి సిందూను ఆ సంస్థ ప్రచారకర్తగా నియమించుకుంది. ఒలింపిక్ గేమ్స్‌లో బ్రిడ్జ్‌స్టోన్ వీరితో భాగస్వామిగా ఉండనుంది.



బీమాలో శిక్షణ..

రాయల్ సుందరమ్ జనరల్ ఇన్సూరెన్ కంపెనీ సిఇఒ ఎంఎస్ శ్రీధర్, మణిపాల్ గ్లోబల్ ఎడ్యుకేషన్ సర్వీసెస్ వైస్ ప్రెసిడెంట్ బీమల్‌జీత్ సింగ్ భాసిన్ ఒక ఒప్పందం కుదుర్చుకున్నారు. ఇందులో భాగంగా మణిపాల్ గ్లోబల్ బీమా రంగంలో అభ్యర్థులకు శిక్షణ అందించి రాయల్ సుందరమ్‌కు అందించనుంది.



క్రిప్టో కరెన్సీలతో జాగ్రత్త

ఎస్‌బిఐ కార్డు హెచ్చరిక

న్యూఢిల్లీ : బిట్‌కాయిన్, ఇతర క్రిప్టోకరెన్సీలతో ప్రమాదాలు పొంచి ఉన్నాయని ఎస్‌బిఐ కార్డు తన వినియోగదారులను హెచ్చరించింది. ఈ డిజిటల్ కరెన్సీల కొనుగోలుకు తమ కార్డు వాడకాన్ని అనుమతిస్తున్నప్పటికీ అప్రమత్తంగా ఉండాలని తమ ఖాతాదారులకు ఎస్ఎంఎస్‌లు పంపించింది. అంతర్జాతీయంగా, స్థానికంగా వీటిపై ఆందోళనలు ఉన్నాయని, క్రిప్టోకరెన్సీలు, వర్చ్యువల్ కరెన్సీల ఒప్పందాల్లో భద్రతాపరమైన ప్రమాదాలు పొంచి ఉన్నాయని తెలిపింది. ఎస్‌బిఐ క్రెడిట్ కార్డుకు 50 లక్షల మందికి పైగా ఖాతాదారులున్నారు.

పిఎన్‌బికి రేటింగ్ ఎజెన్సీల షాక్

న్యూఢిల్లీ : నీరవ్ మోడీ బడా కుంభకోణంలో చిక్కుకున్న పంజాబ్ నేషనల్ బ్యాంకు (పిఎన్‌బి)కు ప్రముఖ రేటింగ్ ఎజెన్సీలు మూడీస్, ఫిచ్‌లు షాక్ ఇచ్చాయి. పిఎన్‌బి పరపతిని డౌన్‌గ్రేడ్ చేస్తూ నెగిటివ్‌లోకి మార్చుతున్నట్లు తెలిపాయి. పిఎన్‌బికి ఫారిన్ కరెన్సీ డిపాజిట్ రేటింగ్‌ను బిఎఎ3/పి-3కు, ఫారిన్ కరెన్సీ జారీ రేటింగ్‌ను బిఎఎ3 కు తగ్గించినట్లు మూడీస్ వెల్లడించింది. పిఎన్‌బి బ్యాంకు బేస్‌లైన్ క్రెడిట్ అసెస్‌మెంట్(బిసిఎ), అడ్జస్టెడ్ బిసిఎ బిఎ3గా, కౌంటర్‌పార్టీ రిస్క్ అసెస్‌మెంట్ రేటింగ్ బిఎఎ3(సిఆర్)/పి-3(సిఆర్)ను డౌన్‌గ్రేడ్ రివ్యూలో ఉంచుతున్నట్టు మూడీస్ తెలిపింది. కాగా ఫిచ్ పిఎన్‌బి రేటింగ్‌ను వయోబిలిటీ 'బిబి' రేటింగ్‌ను నెగిటివ్ ఆర్‌డబ్ల్యుఎన్‌కు తగ్గించింది. తాజా అక్రమ లావాదేవీలు పిఎన్‌బిని అంతర్గతంగా, బహిర్గతంగా బ్యాంకు రిస్క్ కంట్రోల్స్‌పై ఈ మోసం పలు అనుమానాలకు తావిస్తుందని మూడీస్ విమర్శించింది. గత కొన్నేళ్లుగా ఈ కుంభకోణం జరుగుతున్నప్పటికీ, ఎవరూ గుర్తించకపోవడం నిర్వహణ పర్యవేక్షణ నాణ్యతా లోపాన్ని ఎత్తిచూపుతుందని పేర్కొంది. ఈ మోసపూరిత లావాదేవీల ఫలితంగా బ్యాంకు లాభాలు తీవ్ర ఒత్తిడిలోకి వెళ్లాయని ఫిచ్ తెలిపింది.

పేటియంపై వినియోగ దారుల మండిపాటు

న్యూఢిల్లీ : పేటియం యాప్‌లో క్రెడిట్ కార్డుల ద్వారా వాలెట్‌కు రీఛార్జ్ చేసుకునే నగదును ఆ సంస్థ గిఫ్ట్ ఓచర్లుగా మార్చేస్తోంది. తమకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ఈ మార్పు చేసిన పేటియంపై వినియోగదారులు మండిపడుతున్నారు. క్రెడిట్ కార్డు ద్వారా జమ చేసిన ఈ నగదును కేవలం పేటియం మాల్‌లో ఉత్పత్తులను కొనుగోలు చేయడం లేదా రీఛార్జ్‌లు చేసుకోవడానికి మాత్రమే ఉపయోగించాలి. ఈ నగదును బ్యాంకుకు లింక్ చేయడం కానీ, ఎవరికైనా బదిలీ చేయడానికి గాని వీలు లేదు.

బ్యాంకులపై పర్యవేక్షణ కరువు

- 7 నెలలుగా ఆర్‌బిఐలో పోస్టు ఖాళీ
- సాగదీస్తోన్న ప్రభుత్వం
- నిర్వీర్యానికి ప్రయత్నం..!

న్యూఢిల్లీ : ప్రభుత్వ రంగ బ్యాంకులను అన్ని విధాలుగా నిర్వీర్యం చేయాలనే ఆలోచనో ఏమో కాని బ్యాంకులపై ఆర్‌బిఐ పర్యవేక్షణ కరువైంది. ఆర్‌బిఐలో ఈ విభాగాన్ని చూసే అధికారి నియామకంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవ హరిస్తోంది. ప్రయివేటు బ్యాంకుల యాజమాన్య నిర్వహణ తీరు వేరుగా ఉంటుంది. వాటి ఆలోచన విధానం వాణిజ్య పరంగా ఉంటుంది. కాని పిఎస్‌బిల్లో పరిస్థితి భిన్నంగా ఉంటుంది. ప్రభుత్వ, ఆర్‌బిఐ పర్యవేక్షణ, నియంత్రణ లేకపోతే గాడితప్పే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. గత ఏడు నెలలుగా దేశంలోని బ్యాంకులను పర్యవేక్షించడానికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ)లో పూర్తి స్థాయి డిప్యూటీ గవర్నర్ లేరు. గత జులైలో ఎస్ఎస్ ముద్ర పదవీ విరమణ అనంతరం కేంద్ర ప్రభుత్వం ఆ పదవిని భర్తీ చేయకుండా అలానే వదిలేసింది. దీంతో ఈ విభాగాన్ని పట్టించుకునే వారే లేరని తెలుస్తోంది. పంజాబ్ నేషనల్ బ్యాంకులో దాదాపు రూ.11,500 కోట్ల కుంభకోణం చోటు చేసుకున్న తర్వాత బ్యాంకులపై ఆర్‌బిఐ, ప్రభుత్వ పర్యవేక్షణపై అనుమానాలు తలెత్తుతున్నాయి. రిజర్వు బ్యాంకులో నలుగురు డిప్యూటీ గవర్నర్లు ఉండాలి. ప్రస్తుతం ఈ హోదాలో విరాల్ ఆచార్య, బిపి కనుంగో, ఎన్ఎస్ విశ్వనాథన్‌లు మాత్రమే ఉన్నారు. బ్యాంకుల పనితీరును పర్యవేక్షించే కీలకమైన డిపార్ట్‌మెంట్‌కు బాధ్యతలు చూడాల్సిన డిప్యూటీ డైరెక్టర్ పదవి ఖాళీగా ఉంది. బ్యాంకుల కార్యకలాపాలను తనిఖీలు చేయ డంలో బ్యాంకింగ్ పర్యవేక్షణ విభాగం పాత్ర కూడా ఉంటుంది. అలాంటి విభాగాన్ని విస్మరించారనే విమర్శలు పెరుగుతున్నాయి. జులై 30న ముద్ర పదవీ విరమణ పూర్తికాక ముందే నాలుగో డిప్యూటీ గవర్నర్‌ను నియామకానికి కేంద్రం ప్రక్రియ ప్రారంభించి, నిలిపి వేసింది. ఈ పోస్టుకు ఇంటర్వ్యూలు పూర్తయి షార్ట్ లిస్ట్ చేసిన అభ్యర్థుల జాబితాను రద్దుచేసింది. మళ్లీ ప్రక్రియ ప్రారంభించినప్పటికీ పెద్ద పురోగతి లేదు. గతంలో ప్రభుత్వ రంగ బ్యాంకులకు చెందిన ఛైర్మన్‌లను, ఉన్నతాధికారులను ఆర్‌బిఐలోకి తీసుకునే వారు. గతేడాది నుంచి ప్రైవేట్, విదేశీ బ్యాంకుల్లో కార్యనిర్వాహక పదవుల్లో పనిచేసి నవారిని కూడా ఈ పదవికి తీసుకోవాలని మోడీ సర్కార్ నిర్ణయం తీసుకుంది.

ఐటిలో లక్ష ఉద్యోగాలు

- ఐటి రెవెన్యూలో 9% వృద్ధి
- నాస్కామ్ రిపోర్టు

హైదరాబాద్ : వచ్చే ఆర్థిక సంవత్సరం 2018-19లో భారత ఐటి, బిపిఒ రంగం 7-9 శాతం వృద్ధి సాధించే అవకాశాలు ఉన్నాయని ఐటి పరిశ్రమ బాడీ నాస్కామ్ అంచనా వేసింది. కాగా 2017-18లో 7.8 శాతం వృద్ధి ఉందని నాస్కామ్ ప్రెసిడెంట్ ఆర్ చంద్రశేఖర్ తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లో జరిగిన నాస్కామ్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2018-19లో భారత సాఫ్ట్‌వేర్ ఎగుమతులు 137 బిలియన్ డాలర్లకు చేరొచ్చన్నారు. 2017-18లో ఇది 126 బిలియన్ డాలర్లుగా నమోదవడానికి వీలుందన్నారు. కాగా 2018-19లో ఐటి పరిశ్రమ కొత్తగా లక్ష ఉద్యోగాలు కల్పించనుందని అంచనా వేశారు. ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, ఇంటర్నెట్ అఫ్ థింగ్స్ ద్వారా ఇది సాధ్యమవుతుందన్నారు. ఇదే సమయంలో ఐటి రెవెన్యూ 10-12 శాతం ఆదాయాన్ని అంచనా వేసినట్టు తెలిపారు. నాస్కామ్ రిపోర్ట్ ప్రకారం 2017-18లో ఐటి రంగంలో 30 శాతం వాటా డిజిటల్ విభాగం అగ్రస్థానంలో ఉందని, ఇంజనీరింగ్, ఆర్ అండ్ డి 13 శాతం, వ్యాపార ప్రక్రియ నిర్వహణ 8 శాతం చొప్పున వాటా కలిగి ఉన్నాయన్నారు. భారతదేశ మొత్తం ఎగుమతుల్లో ఐటి రంగం 24శాతం వాటా కలిగి ఉంది.



రెట్టింపు విదేశీ పర్యాటకులే లక్ష్యం

కేరళ పర్యాటక శాఖ

ప్రజాశక్తి - బిజినెస్ బ్యూరో

వచ్చే ఐదు సంవత్సరాల్లో విదేశీ పర్యాటకుల సంఖ్యలో 100 శాతం వృద్ధి సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని కేరళ పర్యాటక శాఖ డిప్యూటీ డైరెక్టర్ కె రాజ్ కుమార్ అన్నారు. దేశీయ పర్యాటకుల్లో 50 శాతం పెరుగుదల అంచనా వేస్తున్నామన్నారు.

ఇందుకోసం పర్యాటక రంగానికి సంబంధించి కొత్త ప్రణాళికలు రూపొందించా మన్నారు. మంగళవారం హైదరాబాద్‌లో ట్రావెల్ ఎజెన్సీలతో కలిసి రోడ్‌షో ఏర్పాటు చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ 2018లో విదేశీ పర్యాటకుల్లో 10-15 శాతం వృద్ధి అంచనా వేస్తున్నామ న్నారు. రెవెన్యూలో 8-10 శాతం వరకు పెరుగుదల ఉండొచ్చన్నారు. పర్యాటకం వల్ల రూ.33 వేల కోట్ల రెవెన్యూ సమకూరిందన్నారు. రూ.8,835 కోట్ల విదేశీ మారకం వచ్చిందన్నారు. 2016లో కేరళకు 10,38,419 మంది విదేశీ పర్యాటకులు వచ్చారన్నారు.

ఇంతక్రితం ఏడాదితో పోల్చితే ఇది 6.25 శాతం పెరుగుదల ఉందన్నారు. దేశీయ పర్యాటకులు 5.67 శాతం పెరిగి 1.32 కోట్లుగా నమోదయ్యారన్నారు. తమ రాష్ట్రానికి వచ్చే దేశీయ పర్యాటకుల్లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు ఐదవ స్థానంలో ఉన్నాయన్నారు.

పర్యాటకంలో ఇతర రాష్ట్రాలతో పోల్చితే 11వ స్థానంలో ఉన్నామన్నారు. అయితే ఇతర రాష్ట్రాలు పుణ్య క్షేత్రాలకు వచ్చే భక్తులను కూడా పరిగణలోకి తీసుకుంటున్నాయన్నారు. కాని తాము శబరిమల లాంటి పుణ్యక్షేత్రాలకు వచ్చే వారిని లెక్కలోకి తీసుకోవడం లేదన్నారు. అలా తీసుకుంటే మెరుగైన ర్యాంకింగ్‌లో ఉంటామన్నారు. పర్యాటక రంగంపై జిఎస్‌టి అధిక పన్ను శాతం 18-28 శాతం మేర ఉందన్నారు. ఇది తగ్గుతే పర్యాటకానికి మరింత మేలు జరుగుతుందన్నారు. దేశ అంతర్జాతీయ టూరిస్టులను ఆకర్షించడానికి ప్రస్తుత ఏడాది ద్వితీయార్థంలో బి2బి కేరళ ట్రావెల్ మార్ట్ ఏర్పాటు చేస్తున్నామన్నారు.

టెట్, డీఎస్సీ పరీక్షల ప్రత్యేకం


'ఫాదర్ ఆఫ్ మోడరన్ ఫిజిక్స్' ఎవరు?

గైడ్



ఎస్.పి. మనోహర్‌కుమార్,
టీచర్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,
నున్న, కృష్ణాజిల్లా.
సెల్ : 9490300637

(జనరల్ సైన్స్) కాంతి



స్వయం ప్రకాశమైన వస్తువుల నుంచి ఏర్పడి, విద్యుదయస్కాంత తరంగ రూపంలో బుజుమార్గంలో ప్రయాణించి, దృష్టి జ్ఞానాన్ని కలుగజేసే శక్తి స్వరూపమే కాంతి.

కాంతిని వెలువరించే వాటిని **'కాంతి జనకాలు'** అంటారు. ఇవి రెండు రకాలు

1. స్వయం ప్రకాశాలు: స్వయంగా కాంతిని ఇచ్చే వస్తువులను 'స్వయం ప్రకాశాలు' అంటారు.

ఉదా: నక్షత్రాలు, సూర్యుడు, మినుగురు పురుగులు

2. అస్వయం ప్రకాశాలు: స్వయంగా కాంతిని ఇవ్వని వస్తువులను పరప్రకాశాలు లేదా అస్వయం ప్రకాశాలు అంటారు.

ఉదా: గ్రహాలు, ఉపగ్రహాలు.

✧ **కాంతి ప్రసారం:** కాంతిని తమగుండా ప్రసారంచేసే గుణం ఆధారంగా వస్తువులను మూడు రకాలుగా వర్గీకరించవచ్చు.

1. పారదర్శక పదార్థాలు: కాంతిని స్వేచ్ఛగా తమ ద్వారా ప్రసరింపజేసే పదార్థాలను 'పారదర్శక పదార్థాలు' అంటారు.

ఉదా: నీరు, గాజు, శూన్యం

2. అపారదర్శక పదార్థాలు: కాంతిని తమ ద్వారా ప్రసరింపజేయనివ్వని పదార్థాలను 'అపారదర్శక పదార్థాలు' అంటారు.

ఉదా: కర్ర, రాయి

3. పాక్షిక పారదర్శక పదార్థాలు: కాంతిని తమ ద్వారా పాక్షికంగా ప్రసరించజేసే పదార్థాలను 'పాక్షిక పారదర్శక పదార్థాలు అంటారు.

ఉదా: మైనం, నూనెకాగితం.

✧ కాంతిని కొలిచే శాస్త్రాన్ని **'ఫోటోమెట్రీ'** అంటారు. ఒక కాంతి జనకం నుంచి ఒక సెకనుకాలంలో వెలువడిన కాంతి అభివాహాన్ని 'ప్రతిదీప్తి సామర్థ్యం' అంటారు. దీనిని **'ల్యూమెన్'** లలో కొలుస్తారు. **1ల్యూమెన్= 1 ఎర్గ్/సెకన్.** ఒక యూనిట్ ఘనకోణం నుంచి వెలువడే కాంతి అభివాహాన్ని **'కాంతి తీవ్రత'** అంటారు. కాంతి తీవ్రతను క్యాండిలాలో కొలుస్తారు.

1 క్యాండిలా = 1ఎర్గ్/సెకన్/ స్టేరేడియన్.

✧ **కాంతి సిద్ధాంతాలు:** కాంతి ధర్మాలను వివరించడానికి శాస్త్రవేత్తలు కొన్ని సిద్ధాంతాలను ప్రతిపాదించారు. వాటిలో ముఖ్యమైనవి కణ సిద్ధాంతం, తరంగ సిద్ధాంతం, విద్యుదయస్కాంత తరంగ సిద్ధాంతం, క్వాంటం సిద్ధాంతం.

✧ **కణ సిద్ధాంతం:** న్యూటన్ దీనిని ప్రతిపాదించాడు. ఈయన ప్రకారం స్వయం ప్రకాశాలైన వస్తువుల నుంచి కాంతి 'కార్పస్కల్స్' అనే సూక్ష్మ కణాల రూపంలో వెలువడుతుంది. ఈ కణాల పరిమాణం ఆధారంగానే రంగులు ఏర్పడతాయని, సాంద్రతర యానకంలో ఎక్కువ వేగంతో, విరళ యానకంలో తక్కువ వేగంతో చలిస్తాయిని ప్రతిపాదించాడు. తెల్లని కాంతిలో ఏడు రంగులు ఉంటాయని న్యూటన్ ఊహించాడు. న్యూటన్ కాంతి ధర్మాలైన వక్రీభవనం, కాంతి బుజుమార్గంలో ప్రయాణించడాన్ని వివరించే ప్రయత్నం చేశాడు.

✧ **తరంగ సిద్ధాంతం:** హైగెన్స్ దీనిని ప్రతిపాదించాడు. యాంత్రిక తరంగాల రూపంలో కాంతి ప్రయాణిస్తుందని, కాంతి జనకం నుంచి తరంగాలు అన్ని దిశల్లో ప్రయాణిస్తాయని తెలియజేశాడు. విశ్వమంతా 'ఈథర్' అనే పదార్థంతో నిండి ఉందని, దీని ద్వారానే కాంతి తరంగాలు ప్రయాణిస్తాయిని ఊహించాడు. థామస్ యంగ్ అనే శాస్త్రవేత్త చేసిన వ్యతికరణ ప్రయోగం కాంతి తరంగ సిద్ధాంతాన్ని బలపరిచింది.

✧ **విద్యుదస్కాంత తరంగ సిద్ధాంతం:** దీని 'మాక్స్‌వెల్' ప్రతిపాదించాడు. మాక్స్‌వెల్ విద్యుదయస్కాంత తరంగాల సిద్ధాంతాన్ని హెర్జ్ అనే శాస్త్రవేత్త మెరుగుపరిచాడు. ఈ తరంగాల్లో పరస్పరం లంబంగా ఉండే విద్యుత్, అయస్కాంత క్షేత్రాలు నిరంతరం మారుతూ ఉంటాయి. కాంతి తరంగాలు విద్యుదయస్కాంత తరంగాలలో భాగమేనని ప్రతిపాదించాడు. కాంతి తరంగాలు తిర్యక్ తరంగాలని నిరూపితమయ్యాయి.

✧ **క్వాంటం సిద్ధాంతం:** దీనిని మాక్స్‌ప్లాంక్ ప్రతిపాదించాడు. ఈ సిద్ధాంతాన్ని అనుసరించి విద్యుదయస్కాంత తరంగాలలో శక్తి క్వాంటీకరించబడిన ప్యాకెట్‌ల రూపంలో ఉంటుంది. ఈ ప్యాకెట్‌లలో ఉండే శక్తిని క్వాంటం అనీ, ఆ ప్యాకెట్‌లను ఫోటాన్ అనీ అంటారు. 1905 సంవత్సరంలో ఐన్‌స్టీన్ కాంతి క్వాంటీకరించిన ఫోటాన్‌లు అనే శక్తి ప్యాకెట్‌ల రూపంలో ఉంటుందని ప్రకటించాడు. ఈ సిద్ధాంత ఫలితంగా **మాక్స్‌ప్లాంక్‌కు** 1918లో నోబెల్ ప్రైజ్ లభించింది. అంతేకాకుండా **'ఫాదర్ ఆఫ్ మోడరన్ ఫిజిక్స్'** గా గుర్తింపు తెచ్చుకున్నారు.

కాంతి ధర్మాలు

1. కాంతి బుజుమార్గ ప్రసారం: కాంతి ఎల్లప్పుడూ విద్యుదయస్కాంత తరంగ రూపంలో బుజుమార్గంలో ప్రయాణిస్తుంది. ఈ గుణం వల్లనే నీడలు, గ్రహణాలు ఏర్పడతాయి. కాంతి జనకం కంటే వస్తువులు చిన్నగా ఉన్నప్పుడు, తెరకు దగ్గరగా ఉన్నప్పుడు నీడలు స్పష్టంగా ఏర్పడతాయి. దూరంగా ఉన్నప్పుడు నీడలు కనిపించవు. పక్షి నేలకు దగ్గరగా ఉన్నప్పుడు దాని నీడ ఏర్పడుతుంది. కానీ పైకి వెళ్ళగానే నీడ అదృశ్యం అవుతుంది. సూర్యుడు, చంద్రుడు మధ్యలోకి భూమి వచ్చినప్పుడు, భూమి నీడ చంద్రునిపై పడి చంద్రగ్రహణం ఏర్పడుతుంది. సూర్యునికి, భూమికి మధ్యలో చంద్రుడు వచ్చినపుడు చంద్రుని నీడ భూమిపై పడి సూర్యగ్రహణం ఏర్పడుతుంది. సూర్యగ్రహణం అమావాస్యరోజుల్లో, చంద్రగ్రహణం పౌర్ణమి రోజుల్లో మాత్రమే ఏర్పడతాయి.

2. కాంతి వేగం: సూర్యుని నుంచి కాంతి కిరణాలు భూమిని చేరడానికి పట్టే కాలం 8.2 నిమిషాలు.

✧ **శూన్యంలో కాంతివేగం 3×10^{8} మీ/సె** చంద్రునిపై పడిన కాంతి పరావర్తనం చెంది భూమిని చేరడానికి పట్టే కాలం సెకను మాత్రమే.

3. కాంతి వక్రీభవనం: కాంతి ఒక యానకం నుంచి మరొక యానకంలోకి ప్రయాణించేటప్పుడు వేగంలో మార్పు సంభవించడం వల్ల ఆ రెండు యానకాల సరిహద్దు వద్ద వంగి ప్రయాణిస్తుంది. దీనినే **'కాంతి వక్రీభవనం'** అంటారు.

ఉదా: నీటిలో మునిగిన వస్తువు లేదా కర్ర వంగినట్లుగా అనిపిస్తుంది. నక్షత్రాలు మినుకు మినుకుమనటం, గ్లాసులో ఉన్న పెన్సిల్ వంగినట్లు కనిపించడం, నీటిలో ఉన్న నాణెం వాస్తవపరిమాణం కంటే పెద్దగా, తక్కువ లోతులో ఉన్నట్లు కనిపించడం. సూర్యోదయం కంటే రెండు నిమిషాల ముందే వెలుతురు కనిపించడానికి కారణం. అంతేకాదు సూర్యాస్తమయం తర్వాత రెండు నిమిషాల పాటు వెలుతురు కనిపించడానికి కారణం కాంతి కిరణాల వక్రీభవనం.

ఒక యానకంలో కాంతి ఎంత వేగంగా లేదా ఎంత నెమ్మదిగా ప్రయాణిస్తుందనేది ఆ యానక వక్రీభవన గుణకం తెలియజేస్తుంది. యానకం వక్రీభవన గుణకం ఎంత ఎక్కువగా ఉంటే ఆ యానకంలో కాంతి వేగం అంత ఎక్కువగా ఉంటుంది.

ఉదా: గాజు యొక్క వక్రీభవన గుణకం 3/2.

4. కాంతి పరావర్తనం: వస్తువు తలాలపై పడిని కాంతి వెనుకకు అదే యానకంలోకి తిరిగి రావడాన్నే 'పరావర్తనం' అంటారు. దీనిమూలంగానే జీవులు దృష్టి జ్ఞానాన్ని పొందుతున్నాయి. నునుపు తలాలపై కాంతి క్రమ పరావర్తనం చెందుతుంది. ఈ ధర్మం వల్లే వస్తువుల ప్రతిబింబాలు ఏర్పడుతున్నాయి. దర్పణాల పనితీరు పరావర్తనంపై ఆధారపడి ఉంటుంది. గరుకు తలాలపై కాంతి క్రమరహిత పరావర్తనం, అలాగే నునుపు తలాలపై కాంతి క్రమ పరావర్తం చెందుతుంది. అద్దంలో ఒక వ్యక్తి తన పూర్తి ప్రతిబింబాన్ని చూడాలంటే అద్దం మనిషి ఎత్తులో కనీసం సగం **(h/2)** ఉండాలి.

5. సంపూర్ణాంతర పరావర్తనం: పతనకోణం, సందిగ్ధకోణం కంటే ఎక్కువగా ఉన్నప్పుడు కిరణం మళ్ళీ సాంద్రత యానకంలోకి పరావర్తనం చెందుతుంది. దీనినే సంపూర్ణాంతర పరావర్తనం అంటారు. ఈ ధర్మం వల్లే ఎండాకాలంలో నల్లని రోడ్డుపై, ఎడారులలో ఎండమావులు ఏర్పడతాయి. వజ్రం మెరుపుకు, శీతల ఎడారులలో వస్తువులు మామూలు ఎత్తుకంటే తక్కువ ఎత్తుగా ఉన్నట్లు కనిపించడానికి (లూమింగ్) కారణం సంపూర్ణాంతర పరావర్తనం. వైద్యులు ఎండోస్కోపి, లాప్రోస్కోపిలలో ఉపయోగించే దృశ్యా తంతువులో కాంతిలోని సంపూర్ణాంతర పరావర్తన ధర్మం.

6. కాంతి విక్షేపణం: న్యూటన్ దీనిని కనుగొన్నాడు. పట్టకం గుండా కాంతి ప్రయాణించినప్పుడు దానిలోని రంగులు విడిపోతాయి.

ఈ ధర్మాన్నే కాంతి విక్షేపణ అంటారు. దీనిని వర్ణపటదర్శిని ద్వారా తెలుసుకోవచ్చు. పదార్థ వక్రీభన గుణకం కాంతిలోని వేర్వేరు రంగులు వేర్వేరుగా ఉంటుంది. వక్రీభవన గుణకం తక్కువ పౌనఃపున్యం గల కాంతికి అంటే ఎరుపురంగుకు తక్కువగా, ఎక్కువ పౌనఃపున్యంగల కాంతి అంటే ఊదారంగుకి ఎక్కువగా ఉంటుంది.

ఉదా: వర్షం పడినప్పుడు వాతావరణలోని నీటి బిందువులు సూర్యకాంతిని విడగొట్టడం వల్ల ఇంద్రధనస్సు ఏర్పడుతుంది. ఇంద్రధనస్సు ఎప్పుడూ సూర్యునికి ఎదురుగా ఏర్పడుతుంది. సూర్యకిరణాలు 30^{0} నుంచి 55^{0} వాలులో ఉన్నప్పుడు చూడగలం. 40^{0} నుంచి 42^{0} ల వాలులో సూర్యకిరణాలు ప్రసరిస్తున్నప్పుడు స్పష్టమైన ఇంద్రధనుస్సు ఏర్పడుతుంది. అంటే తెల్లవారిన వెంటనే, మిట్టమధ్యహ్నం, పొద్దుపోయే ముందు ఇంద్రధనస్సు చూడలేము. అంటే ఆయా సమాయాలలో ఇంద్రధనస్సు ఏర్పడదు. ఇంద్రధనస్సులో రంగుల తరంగ ధైర్ఘ్యాలను అనుసరించి పైన ఎరుపు రంగు ఉండి కింద ఊదా రంగు ఉంటాయి.

7. కాంతి పరిక్షేపణం: కాంతి ప్రయాణించే యానకంలో ఏకరూపకత లేక కిరణాలు చెదిరిపోవడాన్నే కాంతి పరిక్షేపణం అంటారు.

ఉదా: మంచుగడ్డ కంటే మంచు ముక్కలు మెరవడం. సముద్రపునీరు నీలి రంగులో కనిపించడం. అంతరిక్షం నుంచి చూసినప్పుడు ఆకాశం నలుపు రంగులో కనిపించడం. ప్రశాంత నీటి ఉపరితలం కంటే అలజడులున్న నీటి ఉపరితలం మెరుస్తూ కనిపించడానికి కాంతి పరిక్షేపణమే కారణం.

8. కాంతి వ్యతికరణం: దీనిని 'థామస్ యంగ్' కనుగొన్నాడు. ఏకవర్ణ కాంతి తరంగాలు ఒకదానిపై మరొకటి ఆధ్యారోపనం చెందినప్పుడు, కొన్ని ప్రదేశాల్లో కాంతి తీవ్రత గరిష్టంగానూ, మరికొన్ని ప్రదేశాల్లో కనిష్టంగానూ ఉంటుంది. కాంతితీవ్రతలో ఈ మార్పు రావడాన్ని **'వ్యతికరణం'** అంటారు. వ్యతికరణం ఏర్పడినప్పుడు కాంతి శక్తి పునర్విభజన జరుగుతుంది. ఎటువంటి శక్తీ నష్టం జరుగదు. అంటే కాంతి వ్యతికరణం 'శక్తి నిత్యత్వ సూత్రాన్ని' పాటిస్తుంది.

ఉదా: నీటిపై తేలుతున్న నూనెపొరలు విభిన్న రంగుల్లో కనిపించడం.

9. కాంతి వివర్తనం: తిన్నని అంచువద్ద కాంతి జ్యామితీయ నీడలోకి వంగి ప్రయాణించడాన్ని వివర్తనం అంటారు.

ఉదా: సిడిలు, డివిడిలపై రంగుల చారలు కనిపించడం వివర్తనానికి ఉదాహరణ.

10. కాంతి ధృవణం: కాంతిలోని విద్యుత్ క్షేత్రం ఒకే తలానికి పరిమితం అవడాన్ని ధృవణం అంటారు. దీనిని కనుగొన్నది బార్థోలైనస్. కాంతి విద్యుదయస్కాంత తరంగాల రూపంలో ఉంటుంది. ఈ తరంగాలలో విద్యుత్, అయస్కాంత క్షేత్రాలు పరస్పరం లంబంగా ఉంటాయి. ఈ క్షేత్రాలు కాంతి ప్రయాణ దిశకు కూడా లంబంగా ఉంటాయి. ఈ లక్షణం ఆధారంగా కాంతి తరంగాలు తిర్యక్ తరంగాలని నిరూపితం అయ్యింది. కాంతి ఈ ధర్మం సర్పిలాకార నిచ్చెన రూపంలో ఉండే డిఎన్ఎ నిర్మాణాన్ని అధ్యయనం చేయడంలో ఉపయోగపడుతుంది.

★

ఉద్యోగాలు

ఇండియన్ బ్యాంక్‌లో 21 పోస్టులు

చెన్నైలోని ఇండియన్ బ్యాంక్ ప్రధాన కార్యాలయం 21 స్పోర్ట్స్ కోటా ఖాళీల భర్తీకి అర్హులైన పురుష అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతూ ప్రకటన విడుదల చేసింది.

పోస్టులు: ఆఫీసర్ (జేఎంజీ స్కేల్ 1), క్లర్క్.

క్రీడా విభాగాల వారీ ఖాళీలు: బాస్కెట్ బాల్-6, క్రికెట్-7, వాలీబాల్-5, హాకీ-3.

వేతన శ్రేణి: ఆఫీసర్-రూ.23,700-రూ.42,020, క్లర్క్-రూ.11,765-రూ.31,540.

అర్హతలు: ఇంటర్మీడియెట్/ తత్సమాన విద్య ఉత్తీర్ణులై ఉండాలి. అలాగే ఆఫీసర్ పోస్టులకు సంబంధిత క్రీడా విభాగంలో దేశం తరపున ప్రాతినిధ్యం వహించి ఉండాలి. క్రికెట్ విభాగానికైతే రంజీ ట్రోఫీ/ దులీప్ ట్రోఫీలో ప్రాతినిధ్యం వహించినా పరిగణిస్తారు. క్లర్క్ పోస్టులకు సంబంధిత క్రీడా విభాగంలో రాష్ట్రం తరపున జాతీయ స్థాయి సీనియర్/ జూనియర్ పోటీల్లో ప్రాతినిధ్యం/ కంబైన్డ్ యూనివర్సిటీ బృందాల్లో సభ్యుడుగా/యూనివర్సిటీ స్థాయి పోటీల్లో ఏదైనా యూనివర్సిటీ తరపున లేదా ఇంటర్ డిస్ట్రిక్ట్ చాంపియన్‌షిప్‌లో ఏదైనా డిస్ట్రిక్ట్ తరపున పాల్గొని, తొలి మూడు స్థానాల్లో ఏదో ఒకటి పొంది ఉండాలి.

వయసు: 2018, జనవరి 1 నాటికి 18-26 ఏళ్ల లోపు ఉండాలి.

ఎంపిక: స్క్రీనింగ్ (వయసు, క్రీడా విజయాలు), ట్రయల్స్ (ఫిజికల్ ఫిట్‌నెస్, స్పీడ్ ఎండ్యూరెన్స్, గేమ్ స్కిల్), అచీవ్‌మెంట్స్, ఇంటర్వ్యూ (ఆఫీసర్ పోస్టులకు మాత్రమే).

దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్.

దరఖాస్తు చేరడానికి చివరి తేదీ: మార్చి 3, 2018.

పూర్తి వివరాలు : వెబ్‌సైట్‌లో చూడొచ్చు

వెబ్‌సైట్: www.indianbank.in

స్విమ్స్‌లో 'సిములేషన్' ప్రారంభం

ప్రజాశక్తి-తిరుపతి సిటి

స్విమ్స్‌కు అనుబంధంగా నిర్వహిస్తున్న శ్రీపద్మావతి మెడికల్ కళాశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన సిములేషన్ ఇంటర్నేషనల్ ట్రైనింగ్ సెంటర్‌ను రాష్ట్ర వైద్యశాఖ మంత్రి డాక్టరు కామినేని శ్రీనివాస్ ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ.. ఇటువంటి అధునాతన ఇంటర్నేషనల్ ట్రైనింగ్ సెంటర్ స్విమ్స్‌లో అందుబాటులోకి రావడం ప్రజలందరికీ ఎంతో ఉపయోగకరమన్నారు. వైద్యులకు అత్యంత అధునాతన వైద్య పరిజ్ఞానం ఈ శిక్షణ ద్వారా పొందవచ్చన్నారు. గుండెజబ్బుల రోగులకు మరింత నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి రానున్నట్లు తెలిపారు. స్విమ్స్ సంస్థ అభివృద్ధికి డైరెక్టరు డాక్టరు టిఎస్.రవికుమార్ చేస్తున్న సేవలను ఆయన కొనియాడారు.



సమావేశం

విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఎపి రాష్ట్ర నిరుద్యోగ ఐక్యవేదిక ఆధ్వర్యాన రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు

ఖాళీ పోస్టుల భర్తీకి తక్షణమే నోటిఫికేషన్

నిరుద్యోగ ఐక్యవేదిక రౌండ్‌టేబుల్‌లో మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు డిమాండ్

ప్రజాశక్తి-గాంధీనగర్ (విజయవాడ)

రాష్ట్రంలో ఉన్న ఖాళీ పోస్టుల భర్తీకి తక్షణమే నోటిఫికేషన్ విడుదల చేయాలని మాజీ ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు డిమాడ్ చేశారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఎపి రాష్ట్ర నిరుద్యోగ ఐక్యవేదిక ఆధ్వర్యాన రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. లక్ష్మణరావు మాట్లాడుతూ.. ఎపిపిఎస్‌సి ఛైర్మన్ పదవుల్లో కొనసాగుతున్న వారికి కనీస అవగాహన లేక నిరుద్యోగులు నానా అవస్థలు పడుతున్నారని విమర్శించారు. ఆన్‌లైన్ పరీక్షల ద్వారా కాంట్రాక్ట్ సంస్థలకు మేలు జరుగుతుంది తప్ప ప్రయోజనం ఉండదన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చిన తరువాత ఖాళీ పోస్టుల భర్తీ ప్రక్రియ పక్కన పెట్టారన్నారు. డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఎం.సూర్యారావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో 33 లక్షల మంది అర్హత కలిగిన నిరుద్యోగులున్నట్లు ప్రజాసాధికారిక సర్వేలో తేలిందని చెప్పిన ప్రభుత్వం నాలుగేళ్లుగా ఖాళీ పోస్టులను భర్తీ చేయకపోవడం విచారకరమన్నారు. జిఒ నెంబరు 622ను తక్షణమే రద్దు చేయాలని, పంచాయతీ కార్యదర్శుల పోస్టుల భర్తీ శాశ్వత ప్రాతిపదికన జరపాలని డిమాండ్ చేశారు. ఐక్య వేదిక కన్వీనర్ కెవి.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ.. కమల్‌నాథన్ కమిటీ నివేదిక ప్రకారం ప్రభుత్వ శాఖల్లో ఖాళీలను రెగ్యులర్ విధానం ద్వారా భర్తీ చేసేందుకు వెంటనే నోటిఫికేషన్ విడుదల చేయాలన్నారు.

రజకులను ఎస్‌సి జాబితాలో చేర్చాలి

ప్రజాశక్తి-గాంధీనగర్ (విజయవాడ)

ఎన్నికల ముందు టిడిపి ఇచ్చిన వాగ్దానం ప్రకారం రజకులను ఎస్‌సి జాబితాలో చేర్చాలని, రజక దోభి అభివృద్ధి సంస్థ జాతీయ ఛైర్మన్ డాక్టర్ ఎం.అంజయ్య అన్నారు. విజయవాడలోని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో 18 రాష్ట్రాలు, 3 కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఉన్న రజకులు ఎస్‌సి జాబితాలో ఉన్నారన్నారు. మద్రాసు రాష్ట్రం నుంచి విడిపోయిన తరువాత ఆంధ్రాలో ఉన్న రజకులను బిసి-ఎలో చేర్చి 60 ఏళ్లుగా ఈ ప్రభుత్వాలు అన్యాయం చేస్తూనే ఉన్నాయన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నేటికీ దుర్భర పరిస్థితులు ఎదుర్కొంటూ జీవనం సాగిస్తున్నారన్నారు. 45 లక్షల మంది జనాభా కలిగిన రజకుల ఓట్లతో అధికారంలోకి వచ్చే ప్రభుత్వాలు ఒక ఇస్త్రీ పెట్టె ఇచ్చి పబ్బం గడుపుకుని పదవులు వెలగబెడుతున్నారన్నారు. జనాభా ప్రాతిపదికన ఎమ్మెల్యే, ఎంపి సీట్లు కేటాయించి రాజకీయ నేపథ్యం కల్పించాలన్నారు. రానున్న అసెంబ్లీ సమావేశాల్లో రాష్ట్రం తీర్మానించి కేంద్రానికి పంపించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శులు పి.కమ్మన్న, ఎంవి.రామయ్య, అధ్యక్షుడు ఎం.నరసింహారావు, రాష్ట్ర మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు పి.పార్వతి, యువసేన అధ్యక్షుడు డివి.కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీడ్ యాక్సెస్ రోడ్డు నిర్మాణంపై రైతుల అభిప్రాయాల సేకరణ

ప్రజాశక్తి - తాడేపల్లి (గుంటూరు)

గుంటూరు జిల్లా తాడేపల్లిలో రాజధానికి వెళ్లే సీడ్ యాక్సెస్ రోడ్డు నిర్మాణంపై ఆర్‌డిఒ బి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో రైతుల అభిప్రాయాలను మంగళవారం సేకరించారు. అయితే అసలు ఎంత భూమి కావాలో స్పష్టం చేయాలని రైతులు అధికారులను ప్రశ్నించారు. చట్ట ప్రకారం ప్రాజెక్టుకు ఎంత అవసరం, ఎంత తీసుకుంటారనే వివరాలను మున్సిపల్, పంచాయతీ కార్యాలయాల వద్ద బోర్డుల ద్వారా తెలపాల్సి ఉన్నా తెలపడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిహారంలో పది శాతం ప్రభుత్వం డిపాజిట్ చేయాల్సి ఉన్నా ఆ పనీ చేయలేదన్నారు. భూసేకరణ చేయాల్సి వస్తే రూ.248 కోట్లు ఖర్చవుతుందని భూసేకరణ అధికారి నివేదిస్తే స్థానిక రెవెన్యూ అధికారులు రూ.154 కోట్లని నివేదించారని, సామాజిక ప్రభావ అంచనా నివేదికలో రూ.49 కోట్లుగా పేర్కొన్నారని, వీటిల్లో ఏది సరైందని నిలదీశారు. బాధిత కుటుంబాల సంఖ్యపై ఇచ్చిన నివేదికల్లోనూ పొంతన లేదన్నారు. రోడ్డు మ్యాప్ అంశంలో అభ్యంతరాలనూ వెలిబుచ్చిన రైతులు సీడ్ యాక్సెస్ రోడ్డు నిర్మాణానికి వ్యతిరేకంగా మున్సిపాలిటీ తీర్మానించిన అంశాన్ని గుర్తు చేశారు. పలువురు తమ భూములను ఇవ్వబోమని రాతపూర్వకంగా స్పష్టం చేశారు

విద్యుత్ కార్మికుల సమ్మె ప్రారంభం

ప్రజాశక్తి యంత్రాంగం

విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల ఐక్యవేదిక ఆధ్వర్యాన విద్యుత్ కాంట్రాక్టు కార్మికులు రాష్ట్రవ్యాప్తంగా మంగళవారం నుంచీ సమ్మె బాటపట్టారు. జిల్లా కేంద్రాల్లో ధర్నాలతో కదంతొక్కారు. తమను తక్షణమే క్రమబద్ధీకరించాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, అక్రమంగా తొలగించిన వారినందరినీ విధుల్లోకి తీసుకోవాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని పెద్దపెట్టున నినదించారు. కార్మికులకు న్యాయం చేసేవరకూ సమ్మె, ఆందోళనలు కొనసాగిస్తామని నాయకులు స్పష్టం చేశారు.

గుంటూరు విద్యుత్ భవన్ వద్ద 350 మందికి పైగా కార్మికులతో సమ్మె శిబిరం నిర్వహించారు. సిఐటియు జిల్లా కార్యదర్శి కె.బాబుప్రసాద్, యునైటెడ్ ఎలక్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా కార్యదర్శి వెంకటేశ్వరరావు, సుబ్బారెడ్డి మాట్లాడారు. శ్రీకాకుళంలోని ఎపిఇపిడిసిఎల్ ఎస్ఇ కార్యాలయం వద్ద, విజయనగరంలోని విద్యుత్ భవన్ వద్ద ధర్నా నిర్వహించారు. విశాఖలోని జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ధర్నా చేశారు. సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి ఎం.జగ్గునాయుడు మాట్లాడుతూ, విద్యుత్‌శాఖలో దీర్ఘకాలంగా కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ కార్మికులుగా పనిచేస్తున్న వారందరినీ రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా ఉన్న 1,250 మంది కార్మికులు విధులను బహిష్కరించి సమ్మెలో పాల్గొన్నారు. కాకినాడ కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సిహెచ్.రాజ్‌కుమార్, ఎం.వీరలక్ష్మి మద్దతు తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరం ఎలక్ట్రిసిటీ డివిజన్ పరిధిలోని కాంట్రాక్టు కార్మికులు భీమవరం డిఇ కార్యాలయం ఎదుట ఏర్పాటుచేసిన సమ్మె శిబిరాన్ని సిఐటియు జిల్లా అధ్యక్షులు కె.రాజారామ్మోహన్‌రాయ్ ప్రారంభించారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి ప్రసాద్ మాట్లాడారు. ఒంగోలులోని విద్యుత్ భవన్ వద్ద రిలే దీక్షలు ప్రారంభమయ్యాయి. సిఐటియు జిల్లా నాయకులు మజుందర్ మాట్లాడారు. చిత్తూరు ఎపిడిసిఎల్ ఆఫీసు ముందు కార్మికులు సమ్మె శిబిరం నిర్వహించి, నిరసన తెలియజేశారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం 'సమాన పనికి సమాన వేతనం' అమలు కావడం లేదన్నారు. ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు పి.మురళి సంఘీభావం ప్రకటించారు. కడప ట్రాన్స్‌కో సిఇ కార్యాలయం ఎదుట కార్మికులు నిరసన తెలిపారు.



కడపలో ఆందోళన చేస్తున్న విద్యుత్ కాంట్రాక్టు కార్మికులు

క్రిస్టియన్ రైట్స్ ప్రొటక్షన్ సొసైటీకి సహకారం: జూపూడి

ప్రజాశక్తి-గాంధీనగర్ (విజయవాడ)

క్రిస్టియన్ రైట్స్ ప్రొటక్షన్ సొసైటీకి అన్నివిధాల సహకారం అందిస్తానని ఎస్‌సి కార్పొరేషన్ ఛైర్మన్ జూపూడి ప్రభాకర్ అన్నారు. విజయవాడలోని హోటల్ ఐలాపురంలో ఆ సొసైటీ 2018 క్యాలెండర్‌ను మంగళవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జూపూడి మాట్లాడుతూ.. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ రాజ్యాంగంలో పొందుపరిచిన హక్కులను పోరాడి సాధించుకోవాలన్నారు. అమరావతిలో క్రిస్టియన్లకు 100 ఎకరాల భూమిని కేటాయించాలనే ప్రతిపాదనను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతానని అన్నారు. సొసైటీ జాతీయ అధ్యక్షుడు ఎ.జీవరత్నం మాట్లాడుతూ.. ప్రతి మండల కేంద్రంలో చర్చిల నిర్మాణానికి తహశీల్దార్లు స్థలం కేటాయించేలా కృషి చేయాలన్నారు.

ఇండస్‌ఇండ్ బ్యాంక్

జోనల్ కార్యాలయం: పాత నం.115-116, కొత్త నం.34, జి.ఎన్.చెట్టి రోడ్, టి.నగర్, చెన్నై-600017. ఫోన్ నం.044-28346545.

ముందస్తు-అమ్మకపు నోటీసు

1. పైడిశెట్టి జయలక్ష్మీ, భర్త సాంబశివరావు, 2. పైడిశెట్టి సాంబశివరావు, తండ్రి సూరయ్య, 3. కొండవీటి రాధా మోహనరావు, తండ్రి సీతాపతిరావు, 1 నుండి 3 R/o ఫ్లాట్ నం.28, రోడ్ నం.5, సెక్టార్.1, కీదరేశ్వరపేట, విజయవాడ-520003. రుణగ్రహీత మరియు సహా రుణగ్రహీత

4. పైడిశెట్టి జయలక్ష్మీ, భర్త సాంబశివరావు, సాయి శ్రీ అంజనా జువెలర్స్, డో.నం.11-49-35, రాధకృష్ణా మార్కెట్, వన్‌టౌన్, విజయవాడ-01, రుణగ్రహీత

5. పైడిశెట్టి సురేష్ కుమార్, తండ్రి సాంబశివరావు, డో.నం.17-21-18, అల్లాద్దీన్ స్ట్రీట్, పెజ్జోనిపేట, విజయవాడ-520001. అదేవిధంగా డో.నం:21-10/5-146/1సి, బుడమేరు కట్టా, మధురానగర్, విజయవాడ-520011 సహా-రుణగ్రహీత

సబ్జెక్ట్: సెక్యురిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 9తో అధ్యాయనంచేస్తూ SARFAESI చట్టం యొక్క సెక్షన్ 13(4) ప్రకారం తాకట్టుపెట్టిన ఆస్తి యొక్క అమ్మకం కొరకు నోటీసు

రిఫరెన్స్: లోను అగ్రిమెంట్ నం.ఎవివి05004ఎం తేది 21/10/2016

1. ఇండస్‌ఇండ్ బ్యాంక్ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారి అయిన దిగువసంతకందారుడు 10.10.2017న ది సెక్యురిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8తో అధ్యాయనం చేస్తూ సెక్యురిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యురిటీ ఇంటరెస్ట్ (SARFAESI) యాక్ట్, 2002 యొక్క సెక్షన్ 13 (4) క్రింద అతను అధికారాలను అధ్యాయనం చేస్తూ దిగువ వివరించిన ఆస్థిని స్వాధీనపరుచుకోవడమైనది.

2. ఇందుమూలంగా అందరికీ తెలియజేయునది ఏమనగా, ఇండస్‌ఇండ్ బ్యాంక్ లిమిటెడ్ ఇప్పుడు ప్రతిపాదించునది ఏమనగా సెక్యురిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8 (5) నిబంధనల క్రింద ఈ నోటీసు తేది నుండి 30 రోజుల తరువాత ఉన్నటువంటి అప్పులతో 'ఏది ఎక్కడ ఎ పద్ధతి & ఆ పద్ధతి ప్రకారం & అక్కడ పద్ధతి ప్రకారం ఏదైనా', మేము బకాయిలు మొత్తం పొందే వరకు అనగా రూ.26,33,084/- (కేవలం ఇరవై ఆరు లక్షల ముప్పైమూడువేలు మరియు ఎనభై నాలుగు రూపాయాలు) మా నోటీసులో డిమాండ్ చేసిన విధంగా 28.07.2017 నుండి సంవత్సరానికి 24% తదుపరి వడ్డీతో 27.07.2017గా సెక్యుర్డ్ ఆస్తి వివరించబడిన ఆస్థిని పబ్లిక్ వేలం మరియు/లేదా వేరే ఇతర పద్ధతుల ద్వారా అమ్ముటకు నిర్ణయించినారు, చట్టబద్ధంగా 30 రోజులలోగా నిర్బంధంగా సెక్యుర్డ్ ఆస్తులను వేలం జరుపుటకు తదుపరి చర్యలు తీసుకొనబడును.

ఆస్థి వివరణ:

ఐటం నం.1: "లోటస్ ల్యాండ్ మార్క్" సెక్టార్ నం., రోడ్ నం-5, ఫ్లాట్ నం.28 పాత అసెస్‌మెంట్ నం.173509ఎం/59, కొత్త అసెస్‌మెంట్ నం.425211, డోర్ నం.20-4-15 ప్రతీక్ నగర్, కీదరేశ్వరపేట, విజయవాడ, మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోపట, విజయవాడ, సబ్-రిజిస్ట్రి, రిజిస్ట్రేషన్ డిస్ట్రిక్ట్, కృష్ణా జిల్లా వద్ద ఉన్నటువంటి ఎల్‌పి.నం.11/2004, రివైజ్డ్ ఎల్‌పి.నం.4/2006 యొక్క పాత సర్వే నం.102, 102/2, 104/1సి, ఎన్‌టిఎస్.నం.8 నుండి 10, 6/1, 6/2, సర్వే నంలు. 101/1, 102/1, 104/3, సర్వే నంలు. 106/3, 105, 113/2, 111/2, 112, 113/1, 114/1, 109, ఎన్‌టిఎస్.నం.15, ఎన్‌టిఎస్.నం.17/సి, రెవిన్యూ వార్డ్.నం.8, బ్లాక్ నం.3, రెవిన్యూ వార్డ్ నం.8, యు.డి.ఎ ద్వారా జారీచేసిన ప్రస్తుతమున్న సర్వే నం.లు అనగా బ్లాక్ నం.15లో ఎన్‌టిఎస్.నం.1302, వార్డ్ నం.8 యొక్క బ్లాక్ నం.32లో ఎన్‌టిఎస్.నం.1812, బ్లాక్ నం.9లో ఎన్‌టిఎస్.నం.1 నుండి 6 మరియు 7పి, బ్లాక్ నం.10లో ఎన్‌టిఎస్.నం.60, 61, 62, 64, బ్లాక్ నం.11లో ఎన్‌టిఎస్.నం.1152, 1159, బ్లాక్ నం.15లో ఎన్‌టిఎస్.నం.1 నుండి 5, 6/పి, 7/పి, 8 నుండి 19, 20/పి, 21/పి మరియు 24, వార్డ్ నం.14 యొక్క బ్లాక్ నం.16లో ఎన్‌టిఎస్.నం.5, 1, 2, 3/పి, 5/పి, 6/పి, 7/పి, బ్లాక్ నం.11లో ఎన్‌టిఎస్.నం.115 నుండి 119, వార్డ్ నం.14 యొక్క బ్లాక్ నం.9లో ఎన్‌టిఎస్.నం.2,4 మరియు 6, మున్సిపల్ కార్పొరేషన్ యొక్క పరిధిలోపట, విజయవాడ, సబ్-రిజిస్ట్రి, రిజిస్ట్రేషన్ డిస్ట్రిక్ట్, కృష్ణా జిల్లా వద్ద ఉన్నటువంటి విడగొట్టని భూభాగం 55.55 చ.గజాలు కొలతలుగలది లేదా 46.44 చ.మీటర్లు భూమి నుండి ఏర్పాటైన భాగం 166.66 చ.గజాలు లేదా 139.34 చ.మీటర్లు భాగం మరియు ముక్క యావత్తు. భూమి హద్దులు: తూర్పు: ఫ్లాట్ నం.6 దక్షిణం: ఫ్లాట్ నం.29, పడమర: 40 అడుగుల వెడల్పు రోడ్ ఉత్తరం: ఫ్లాట్ నం.27,

ఐటం నం.2: ఐటం నం.1లో అర్‌సిసిలో నిర్మితమై తయారుకాబడి గ్రౌండ్ కలిసిన ఫ్లాట్, మొదటి మరియు రెండవ అంతస్తులు, పాత అసెస్‌మెంట్ నం.173509ఎం/59, కొత్త అసెస్‌మెంట్ నం.425211, ఫ్లింత్ ఏరియా 1272.6 చ.అడుగులు రెండవ అంతస్తు హద్దులు: తూర్పు: ఒపెన్ టు స్కై, దక్షిణం: ఒపెన్ టు స్కై, పడమర: స్టైయిర్‌కేస్ మరియు ఒపెన్ టు స్కై ఉత్తరం: ఒపెన్ టు స్కై.

తేది: 16.02.2018
ప్రదేశం: విజయవాడ

అధీకృత అధికారి
ఇండస్‌ఇండ్ బ్యాంక్

మందడం భూ కుంభకోణంలో ఒకరు అరెస్టు

ప్రజాశక్తి-తుళ్లూరు (గుంటూరు)

రాజధాని ప్రాంతంలో కలకలం సృష్టించిన మందడం భూ కుంభకోణం కేసులో ఒకరైన పఠాన్ గౌస్‌ఖాన్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి భూ లావాదేవీలకు సంబంధించిన రూ1.15 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు వివరాలను స్థానిక సబ్ డివిజనల్ పోలీసు కార్యాలయంలో డిఎస్‌పి శ్రీనివాసరావు మంగళవారం వెల్లడించారు. మందడంలోని 207 సర్వే నెంబరులో పఠాన్‌ఖాన్ అనే వ్యక్తి తనకు ఎకరం భూమి ఉందని చెప్పగా సిఆర్‌డిఎ అధికారులు ల్యాండ్ పూలింగ్‌లో తీసుకున్నట్లు రికార్డులలో నమోదు చేశారు. మూడేళ్లపాటు కౌలు, ప్లాట్లు ఇచ్చారు. అయితే భూమి లేనట్లు గుర్తించిన సిఆర్‌డిఎ డిప్యూటీ కలెక్టర్ కెఇ సాధన ఈ నెల 6న తుళ్ళూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన పోలీసులు కంప్యూటర్ ఆపరేటర్ సందీప్, మరికొందర్ని విచారించి ప్రధాన నిందితునిగా పఠాన్ గౌస్‌ఖాన్‌ను అరెస్టు చేశారు. పఠాన్ గౌస్‌ఖాన్ కుమారుడు మీరావలిఖాన్ ప్రధాన సూత్రధారి అని, మందడం సిఆర్‌డిఎ కాంపిటెంట్ అథారిటీ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న సందీప్‌తో కలిసి భూ కుంభకోణానికి పాల్పడ్డారని డిఎస్‌పి పేర్కొన్నారు.

మంగళగిరిలో మున్సిపల్ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - మంగళగిరి (గుంటూరు)

మున్సిపల్ కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్, ఎఐసిసిటియు ఆధ్వర్యంలో గుంటూరు జిల్లా మంగళగిరి మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులు మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షులు ఎస్ఎస్.చెంగయ్య మాట్లాడుతూ.. 151 జిఒ ప్రకారం వేతనాలు ఇవ్వడంతోపాటు 279 జిఒను రద్దు చేయాలని, బదిలీ వర్కర్లకు పని చూపాలని డిమాండ్ చేశారు. కార్మికులను కాంట్రాక్టర్లు వేధిస్తూ బానిసల్లా చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎఐసిసిటియు నాయకులు ఎ.ప్రభాకర్ మాట్లాడుతూ.. ఉన్నతాధికారులతో పలుమార్లు చర్చించినా సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. ఇప్పటికీ చెప్పులు, సబ్బులు, దుస్తులు ఇవ్వలేదన్నారు. సిఐటియు డివిజన్ ఉపాధ్యక్షులు జెవి.రాఘవులు మాట్లాడుతూ.. గతంలో సమ్మె చేసినపుడు ఇచ్చిన హామీల అమలులో ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తోందని, కాంట్రాక్టర్ల దయాదాక్షిణ్యాలపై ఆధారపడి జీవించాల్సిన దుస్థితి కార్మికులకు ఏర్పడిందని ఆవేదన వెలిబుచ్చారు. ఆందోళనకు సిపిఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం.రవి, సిఐటియు నాయకులు కె.ఏడుకొండలు మద్దతిచ్చారు. ధర్నాలో సిఐటియు నాయకులు ఎం.నాగార్జున ఎన్.నాగరాజు, ఎఐసిసిటియు నాయకులు దుర్గారావు, టి.హనుమంతరావు పాల్గొన్నారు.

నిరుద్యోగుల ఆత్మహత్యలను నిరసిస్తూ, ఉపాధి కల్పనా శాఖ నిర్లక్ష్యానికి వ్యతిరేకంగా అనంతపురంలో డివైఎఫ్ఐ నాయకులు మంగళవారం జిల్లా ఉపాధి కల్పనా శాఖ కార్యాలయాన్ని ముట్టడించారు.
ప్రజాశక్తి- అనంతపురం క్రైం

23న చలో గుంటూరుకు తరలిరండి

రౌండ్‌టేబుల్ సమావేశాల్లో వక్తలు

ప్రజాశక్తి- యంత్రాంగం

రాష్ట్రవ్యాప్తంగా దళితులపై జరుగుతున్న దాడులు, సాంఘిక బహిష్కరణలు, మహిళలపై అత్యాచారాలకు నిరసనగా 23న చేపట్టే చలో గుంటూరుకు తరలిరావాలని పలువురు పిలుపునిచ్చారు. గుంటూరు లాడ్జి సెంటర్ లూథరన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో తలపెట్టే ఈ కార్యక్రమం విజయవంతానికి గుంటూరు, తిరుపతిలో కెవిపిఎస్, దళిత, గిరిజన సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం రౌండ్‌టేబుల్ సమావేశాలు నిర్వహించారు. గుంటూరు జిల్లా మంగళగిరిలో కెవిపిఎస్ ఆధ్వర్యంలో ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ యాక్ట్ పరిరక్షణ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కారుమంచి రామారావు అధ్యక్షతన జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆండ్రా మాల్యాద్రి మాట్లాడారు. టిడిపి అధికారంలోకి వచ్చిన తరువాత దళిత, బలహీనవర్గాలపై పెత్తందార్ల దాడులు పెరిగాయన్నారు. దాడి చేసిన వారిని ప్రభుత్వం రక్షిస్తోందని, పెదగొట్టిపాడు ఘటనలో ప్రభుత్వం, పోలీసు యంత్రాంగమంతా పెత్తందార్ల తరుపునే పని చేశాయని విమర్శించారు. చలో గుంటూరుపై పెదకాకాని మండలంలో ఆండ్ర మాల్యాద్రి, తదితరులు ప్రచారం నిర్వహించారు. తిరుపతి యశోదానగర్‌లోని ఎంబి భవన్‌లో కెవిపిఎస్, వ్యవసాయ కార్మిక సంఘం సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన రౌండ్‌టేబుల్‌లో కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు కొత్తపల్లి సుబ్రమణ్యం మాట్లాడారు. విజయవాడ దుర్గాపురంలోని సిఐటియు సెంట్రల్ సిటీ కార్యాలయంలో దళిత, గిరిజన, ప్రజాసంఘాల ఐక్యవేదిక నాయకులు విలేకర్ల సమావేశం నిర్వహించారు. కెవిపిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.నటరాజ్ మాట్లాడారు.

ఈ నెల 23న చేపట్టే చలో గుంటూరును జయప్రదం చేయాలని ఏపి వ్యవసాయ కార్మిక సంఘం పిలుపునిచ్చింది. కొద్ది నెలలుగా రాష్ట్రంలో వివిధ ప్రాంతల్లో దళితులపై దాడులు జరుగుతూనే ఉన్నాయని సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు దడాల సుబ్బారావు, వి వెంకటేశ్వర్లు మంగళవారం ఒక ప్రకటనలో ఆందోళన వ్యక్తంచేశారు.

ప్రజ్ఞ

జవాబులు

1. రాజస్థాన్ రాజధాని జైపూర్‌లోని గాంధీనగర్ రైల్వేస్టేషన్
2. వర్జిన్ హైపర్‌లూప్‌వన్(వీహెచ్‌వో)
3. స్టార్ ఇండియా
4. యాష్ చోప్రా అవార్డు
5. హైదరాబాద్

ధర్నా

సంక్షేమ చట్టాన్ని అమలు చేయాలి

రాష్ట్ర వ్యాప్తంగా భ.ని.కా. ధర్నాలు
కార్మిక శాఖాధికారులకు వినతులు

ప్రజాశక్తి- యంత్రాంగం

సంక్షేమ చట్టాన్ని సక్రమంగా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా మంగళవారం నిర్మాణరంగ కార్మికులు పెద్ద ఎత్తున కదం తొక్కారు. కార్మిక శాఖ కార్యాలయాల వద్ద ధర్నాలు నిర్వహించారు. అనంతరం కార్మిక శాఖ అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ఎపి భవన, ఇతర నిర్మాణ కార్మికుల ఫెడరేషన్ ఆధ్వర్యంలో కృష్ణా జిల్లా మచిలీపట్నంలోని కార్మిక శాఖ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. గుడివాడలో అసిస్టెంట్ లేబర్ కార్యాలయం వద్ద రాష్ట్ర భవన నిర్మాణ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్స్ వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిం చారు. నూజివీడులోని అసిస్టెంట్ లేబర్ కమిష నర్ కార్యాలయం, తిరువూరులోని తహశీల్దార్ కార్యాలయం ముందు భవన నిర్మాణ కార్మికులు ధర్నా చేశారు. విస్సన్నపేటలో బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. విజయవాడలోని కార్మిక శాఖ కమిషనర్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. గుంటూరులోని డిసిఎల్ కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నాకు భవన నిర్మాణ కార్మికులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. విశాఖ జిల్లా బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యాన విశాఖ నగర పరిధి అక్కయ్యపాలెంలోని లేబర్ కార్యాలయం వద్ద భవన నిర్మాణ కార్మికులు నిరసన కార్యక్రమం చేపట్టారు. పశ్చిమగోదావరి జిల్లా ఏలూరు అశోక్‌నగర్‌లోని డిసిఎల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. నిడదవోలులోని ఎఎల్‌ఒ కార్యాల యాన్ని ముట్టడించారు. డిసిఎల్‌ను ఫోన్‌లో సంప్రదించగా, ఎఎల్‌ఒలతో బుధవారం సంయు క్త సమావేశం నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం భవన నిర్మాణ కార్మికులు బస్టాండ్ వరకూ ర్యాలీ చేసి అక్కడ మానవహారంగా ఏర్పడ్డారు. తాడేపల్లిగూడెం, కొవ్వూరు, తణుకు కార్మిక శాఖ కార్యాలయాల వద్ద ధర్నా చేశారు. తూర్పుగోదావరి జిల్లా కాకినాడ, పెద్దాపురం, పిఠాపురం, అమలాపురం లేబర్ కార్యాలయాల వద్ద ధర్నా నిర్వహించారు. రాజవొమ్మంగి, జగ్గం పేట, ఏలేశ్వరం, రావులపాలెం ఎంపిడిఒ కార్యాలయాల వద్ద ధర్నా చేశారు. సిఐటియు నాయకులు మద్దతు తెలిపారు. శ్రీకాకుళంలోని కార్మిక శాఖ సహాయ కమిషనర్ కార్యాలయం వద్ద భవన నిర్మాణ కార్మికులు ధర్నా చేశారు. విజయనగరం జిల్లా కేంద్రంలోని కార్మిక శాఖ కార్యాలయం వద్ద ఎపి బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్సు వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. చిత్తూరు జిల్లాలో కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ కార్యాలయం ముందు భవన నిర్మాణ కార్మికులు ధర్నా చేశారు. కడపలో కార్మిక శాఖ కార్యాలయం ఎదుట సిఐటియు ఆధ్వ ర్యంలో ధర్నా నిర్వహించారు. జిల్లా కేంద్రమైన కర్నూలులోని



నెల్లూరులో ర్యాలీ నిర్వహిస్తున్న నిర్మాణరంగ కార్మికులు

శ్రీరామ్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్

SHRIRAM HOUSING FINANCE

నమోదు కార్యాలయం: ఆఫీసు నెం. 123, అనగప్ప నైకన్ వీది, చెన్నై-600001.
ప్రధాన కార్యాలయం: లెవల్ 3, వోక్‌హార్డ్‌ట్ టవర్స్, ఈస్ట్ వింగ్ సి-2 బ్లోక్, బంద్ర కుర్ల కాంప్లెక్స్, బంద్రా (తూర్పు), ముంబాయి 400051.
టెలిఫోన్: 022 4241 0400, 022 4060 3100, వెబ్‌సైట్: www.shriramhousing.in

ఎస్సెట్ యొక్క ఆన్‌లైన్ ఇ-వేలం అమ్మకం

శ్రీరామ్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారి సెక్యూరిటైజేషన్ మరియు రికన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (2002 యొక్క 54) మరియు దాని యొక్క శక్తిలను చట్ట ప్రకారం సూచిస్తూ దిగువ ఆస్తి యొక్క వేలం "ఏది ఏ పద్ధతిన ఆదారంగా" మరియు "ఆ పద్ధతిన ఉన్న" "ఆన్‌లైన్ ఇ-వేలం" దాని యొక్క బకాయిలను మరియు తదుపరి వడ్డీలను చెల్లించుటకు, చార్జీలు మరాయు ఖర్చులు ఇతర., అన్ని వివరంగా దిగువ తెలియజేసిన వెబ్‌సైట్ https://property.samil.in లో ఉంటాయి.

రుణగ్రహీత మరియు కో-రుణగ్రహీత యొక్క పేరు	వేలం వేయుచున్న సెక్యూర్డ్ ఆస్థి యొక్క వివరాలు మరియు దాని సరిహద్దులు	17.02.2018 వరకు జప్తు మొత్తంజప్తు మొత్తం	బయానా (ఇఎండి) వివరములు	బయానా (ఇఎండి) (రూ.)	రిజర్వు ధర (రూ)
శ్రీ గుండగాని బుచ్చిబాబు, తండ్రి రాములు, శ్రీమతి గుండగాని స్వరూప, భర్త బుచ్చిబాబు ఋణం యొక్క అకౌంట్ నెం SHLHVIWA0000142	ఫ్లాటు నెం 203, శ్రీ వెన్నెల రెసిడెన్సిలో ఉన్న 1 వ అంతస్తు, ఫ్లాటు నెం 1 లో ఉన్న నిర్మాణం, సర్వే నెం 177/సి, 177/4 కంకినాడు (గ్రామం) (మండలం), కృష్ణా జిల్లా) , ఎస్‌ఆర్‌ఓ కంకిపాడు లో ఉన్న పరిధికి గాను సరిహద్దులు, తూర్పు వైపు: కామన్ కారిడార్ పశ్చిమం వైపు:ఆకాశం దక్షిణం వైపు: లిఫ్ట్ మరియు ఆకాశం ఉత్తరం వైపు: ఆకాశం	రూ 29,30,470/- (ఇరువై తొమ్మిది లక్షల ముప్పై వేల నాలుగు వందల డెబ్బై రూపాయిలు మాత్రమే)	దిగువ వివరించిన అకౌంట్ ద్వారా ఆర్‌టిజిఎస్/ ఎన్‌ఇఎఫ్‌టి ద్వారా బయానాను డిపాజిట్ చేయవలెను: బ్యాంకు పేరు: యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్ బ్రాంచి: బంద్రకుర్ల కాంప్లెక్స్ ముంబాయి బ్యాంకు అకౌంట్ నెం: ప్రస్తుత అకౌంట్ నెం: 911020013220315. ఐఎఫ్ఎస్‌సి కోడ్- UTIB0000230	రూ.2,21,000/- (రెండు లక్షల ఇరువై ఒక్క వేలరూపాయిలు మాత్రమే) బయానా దాఖలుకు చివరి తేది 22 మార్చి 2018 అనగా గురువారం సా.6.00గంllలకు ముందుగా ఆస్థి యొక్క తనికీ తేది మరియు సమయం: 20 మార్చి 2018 అనగా మంగళవారం ఉ11:00 నుంచి మ12:00 వరకు	రూ. 22,10,000/- (ఇరువై రెండు లక్షల పది వేల రూపాయిలు మాత్రమే) బిడ్ పెరుగుదల రూ 10,000/- మరియు వాటి మల్టిపుల్స్ ఇ-వేలం తేది మరియు సమయం 26 మార్చి 2018 అనగా సోమవారం ఉ 11:00 నుండి మ1:00 మధ్య

ఇ-వేలం యొక్క నియమాలు మరియు నిబందనలు:

1. బిడ్ డాక్యుమెంట్ యొక్క నిబంధనలు మరియు నిబంధనల ప్రకారం, వేలం వేయబడుతుంది. వేలం వేయుటకు శ్రీరామ్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ (ఎస్‌హెచ్‌ఎఫ్‌ఎల్),www.sriramhousing.in మరియు సర్వీస్ ప్రొవైడర్ యొక్క వెబ్ సైట్ https://property.samil.in ద్వారా, సెక్యుర్డ్ ఎస్సెట్ యొక్క వివరాలు వేలం కొరకు పొందుపరచబడిన/బిడ్ ఫారాలు పొందవలెను.
2. వివరాలకు, సహాయం, ప్రక్రియ మరియు ఆన్‌లైన్ శిక్షణ కోసం, కాగోరు బిడ్డర్లు ఎం/ఎస్ శ్రీరామ్ ఆటోమాల్ ఇండియా లిమిటెడ్ (ఎస్ఏఎంఐఎల్) యొక్క శ్రీ. డెబ్‌జ్యోతి రాయ్ ను సంప్రదించగలరు, సంప్రదించవలసిన నంబరు: +91-9874702021, e-mail ID: debjyothi.r@samil.in
3. ఎప్పటికప్పుడు కొనుగోలుదారులు/బిడ్డర్లు వారి పేరును నమోదు చేసుకోవాలి. https://property.samil.in పైన పేర్కొన్న పోర్టల్ మరియు తేదీ మరియు సమయాలలో ఇ-వేలం లో పాల్గొనడానికి యూజర్ ఐడి మరియు పాస్ వర్డ్ ను ఉచితంగా పొందవచ్చు.
4. ఇ-వేలం లో పాల్గొనడానికి ఉద్దేశించిన కొనుగోలుదారుడు/ వేలం వేసేవారు, వాటాల యొక్క రిజర్వు ధరలో 10% తిరిగి చెల్లించవలసిన బయానా చెల్లింపు వివరాలను, పాన్‌కార్డ్ యొక్క కాపీలు, కంపెనీ విషయంలో బోర్డు తీర్మానాలు మరియు మార్చి 22 2018 అనగా గురువారం న లేదా ముందు అడ్రస్ ప్రూఫ్. పైన పేర్కొన్న ప్రతి అంశానికి ప్రత్యేకమైన బయానాలను వేరుగా సమర్పించాలని కాగోరు కొనుగోలుదారులు/బిడ్డర్లను కోరడమైనది.
5. ఈ పథకం ప్రకారం, అర్‌టిజిఎస్/ఎన్‌ఇఎఫ్‌టి ద్వారా ప్రతి వస్తువుకు అతడు/దాని యొక్క ఆఫర్ యొక్క 25% (బయానా తో సహా) విజయవంతమైన కొనుగోలుదారుడు/ బిడ్డర్ జమచేస్తాడు. ఎస్‌హెచ్‌ఎఫ్‌ఎల్ వారిచే వేలం ధృవీకరించబడవలసి ఉంటుంది, అమ్మకం విఫలమైన యెడల విడిపించుకొనుటకు విఫలమైన మరియు సఫలీకృత కొనుగోలుదారుడు/బిడ్డర్ మిగిలిన మొత్తాన్ని కోల్పోవలసి ఉంటుంది.
6. ఇ-వేలంలో విజయవంతం కానివారికి హెఫ్‌హెచ్‌ఎల్ వారు ఇ-వేలం ముగింపునకు 72 గంటలలోగా తిరిగి చెల్లించబడుతుంది. బయానాకు ఎటువంటి వడ్డీ తీసుకొనబడదు.
7. కొనుగోలు చేసిన పరిశీలన బ్యాలెన్సు యొక్క మొత్తంలో చెల్లింపు ప్రకారం, విజయవంతమైన కొనుగోలుదారుడు / వేలంపాటలో చెల్లించినదాని ప్రకారం, సెక్యూర్డ్ ఆస్తి లేదా అలాంటి పొడిగించిన వ్యవధి యొక్క అమ్మకం నిర్ధారణ యొక్క పదిహేనవ (15) రోజుకు ముందుగా వ్రాతపూర్వకంగా అంగీకరించాలి. ఒక వేల విఫలమైతే అప్రమేయంగా, అప్పటి వరకు డిపాజిట్ చేయబడిన అన్ని మొత్తాలను కోల్పోతారు.
8.ఆస్తి లేదా మరింత సమాచారం యొక్క తనిఖీ కోసం, కాగోలరు వేలందారులు అధీకృత అధికారులు శ్రీ. రాము ఆవుల మరియు శ్రీ.పి.గోపి కృష్ణను ramu_a@shriramhousing.com & gopikrishna_p@shriramhousing.com /(ఇమెయిల్) లేదా 09848903539 లేదా 09963786787 (మొబైల్). తెలుసుకొనవచ్చు.
9. వేలం ఏ దశలోనైనా ఆధీకృత అధికారి బిడ్/ఆఫర్ అంగీకరించుట/తిరస్కరించుట/సవరించుట లేదా ఏవైనా కారణం లేకుండా ముందస్తు నోటీసు ఇవ్వకుండా వాయిదా వేయవచ్చు.
10. సఫలీకృత కొనుగోలుదారుడు/బిడ్డర్ చట్టబద్ధమైన రుసుము, పన్నులు, ఫీజు చెల్లించవలసిన, స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ రుసుము మొదలైనవాటిని కలిగి ఉండవలెను. ఇది వర్తించే చట్టం ప్రకారం అతని/ఆమె అనుకూలంగా ఇచ్చిన ఆస్తిని పొందటానికి చెల్లించవలసి ఉంటుంది.
11. పేర్కొన్న అత్యుత్తమ బకాయిలకు బాధ్యత వహించే రుణగ్రహీతలు/హామీదారులు పైన పేర్కొన్న వేలంపాట విక్రయం యొక్క హోల్డింగ్ గురించి భద్రతా వడ్డీ సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 8 క్లాజు (6) క్రింద నోటీసును ఈ నోటీసుగా వ్యవహరిస్తారు.

ఎన్‌బి: ఇక్కడ గమనించవలసినది ఏమనగా సెక్యూర్డ్ క్రెడిటార్ అందరి ఋణగ్రహీతలుకుజగ్యారెంటార్లకు/ప్రాదాన్యం ప్రకారంమోర్టగేజర్లకు/రిజిస్టర్డ్ పోస్టులకు గాను ఈ నోటీసు జారీ చేయడమైనది, ఒకవేళ ఎవరైనా ఈ నోటీసు స్వీకరించనట్లయితే, ఈ ప్రకటనే ప్రత్యామ్నాయంగా భావించి చూడగలరు

ప్రాంతం: విజయవాడ
తేది: 21.02.2018

సం/-
అధీకృత అధికారి
శ్రీరామ్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్

అగ్ని-2 పరీక్ష విజయవంతం

భువనేశ్వర్ : దేశీయంగా అభివృద్ధి చేసిన మధ్యంతర శ్రేణి బాలిస్టిక్ క్షిపణి అగ్ని-2ను మంగళవారం భారత్ విజయవంతంగా పరీక్షించింది. ఒడిషా సముద్ర తీరంలోని అబ్దుల్ కలామ్ దీవి నుండి దీనిని పరీక్షించింది. ఉపరితలం నుంచి ఉపరితలానికి ప్రయాణించే ఈ క్షిపణిని బాలసోర్‌జిల్లాలోని ఇంటిగ్రేటెడ్ టెస్ట్ రేంజ్ (ఐటిఆర్) కాంప్లెక్ 4 నుంచి మంగళవారం ఉదయం 8.38 నిముషాలకు ప్రయోగించారని రక్షణ మంత్రిత్వ శాఖ అధి కారి తెలిపారు. సైన్యానికి చెందిన స్ట్రాటజిక్ ఫోర్సెస్ కమాండ్ (ఎస్‌ఎఫ్‌సి) తన సాధారణ శిక్షణలో భాగంగా అగ్నిక్షిపణిని పరీక్షించినట్లు ఆయన తెలిపారు. అగ్ని-2 క్షిపణిని ఇప్పటికే సైన్యంలో ప్రవేశపెట్టారు. దాదాపు 2 వేల కిలోమీటర్ల దూరంలోఉన్న లక్ష్యాన్ని ఇది ఛేదించగలదు.

రోబో సిటిజన్

ప్రపంచంలోనే తొలి రోబో సిటిజన్ సోఫియా హైదరాబాద్‌లో జరుగుతున్న వరల్డ్ ఐటి కాంగ్రెస్‌లో సందడి చేసింది. హంకాంగ్‌కు చెందిన హాసన్ రోబొటిక్స్ రూపొందించిన ఈ రోబో అచ్చు హాలీవుడ్ నటి అడ్రే హెప్‌బార్న్‌ను పోలి ఉంటుంది. అంతేకాదు ఆమె 70 రకాల హావభావాలను పలకించగలదు. దీని పనితీరుకు ముచ్చటపడ్డ సౌదీ ప్రభుత్వం తమ దేశ పౌరసత్వాన్ని కల్పించింది.




ఐటి కాంగ్రెస్‌లో రోబో ప్రసంగం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైటెక్స్‌లో జరుగుతున్న ప్రపంచ ఐటి కాంగ్రెస్‌లో మరబొమ్మ (రోబో) సోఫియా ప్రసంగించింది. రోబో సృష్టికర్త డేవిడ్ హాన్సన్ సోఫియాను ఇంటర్వ్యూ చేశారు. పలు ప్రశ్నలకు సమాధానమిచ్చిన రోబో తన వ్యక్తిగత అభిప్రాయాలను కూడా చెప్పారు. కత్రిమ మేధస్సుపై చర్చ సందర్భంగా మానవ రోబో సోఫియా మానవత్వంతోనే మెరుగైన భవిష్యత్ అనే అంశంపై ప్రసంగించింది. చిట్టిచిట్టి మాటలతో సోఫియా ప్రసంగం అందరినీ ఆకట్టుకుంది. రోబోకు ప్రత్యేక నిబంధనలు అవసరం లేదని పేర్కొంది. సౌదీ పౌరసత్వాన్ని మహిళా సాధికారత కోసం వినియోగిస్తానని స్పష్టం చేసింది. అందరికీ విశ్రాంతి అవసరమని చెప్పింది. తనతో సహా ఎవరికీ ప్రత్యేక హక్కులు అవసరం లేదని పేర్కొంది. తాను ఇంకా చిన్నదాన్నేనని, ఇంకా బ్యాంకు ఖాతా తెరవలేదని చెప్పింది. బిట్ కాయిన్లు కొనుగోలు చేయలేదని వెల్లడించింది. తానేప్పుడూ మనస్తాపానికి గురి కాలేదని స్పష్టం చేసింది. మానవాళిపై ఆధిపత్యం చెలాయించాలన్న ఆలోచన తనకు లేదని, మానవాళితో కలిసిమెలిసి సఖ్యతతో ఉండాలన్నదే తన అభిప్రాయమని పేర్కొంది. మానవులు సజనాత్మకత కలిగిన వారని తెలిపింది. తనకు ఇష్టమైన నటుడు షారూక్ ఖాన్ అని చెప్పింది. అందరినీ ప్రేమించాలన్నదే తన అభిమతమని స్పష్టం చేసింది. రోబో సోఫియా సుమారు డెబ్బై వరకు హావభావాలను వ్యక్తం చేస్తుందని దాని సష్టికర్త హాన్సన్ తెలిపారు.

పిఎన్‌బి అత్యుత్సాహంతో దారులు మూసుకుపోయాయి..!

రుణాల ఎగవేతపై నీరవ్ మోడీ వివరణ



ముంబయి : పంజాబ్ నేషనల్ బ్యాంక్ చూపిన అత్యుత్సాహం వల్లే తాను రుణాలు చెల్లించేందుకు అవసరమైన దారులన్నీ మూసుకుపోయాయని బ్యాంకులను మోసం చేసిన కేసులో ప్రధాన నిందితుడైన నీరవ్ మోడీ వెల్లడిం చారు. తాను బ్యాంకుకు బకాయి పడింది కేవలం 5 వేల కోట్లే తప్ప ప్రస్తుతం వార్తల్లో వస్తున్నట్లు రు.11,500 కోట్లు కాదని బ్యాంకు యాజమాన్యానికి రాసిన లేఖలో ఆయన పేర్కొన్నారు. తన కంపెనీలు బ్యాంకు నుండి తీసుకున్న రుణాల మొత్తం కేవలం రు.5 వేల కోట్లు మాత్రమేనని ఆయన ఈ లేఖలో స్పష్టం చేశారు. తన రుణ చెల్లింపు సామర్థ్యంపై మీడియాలో వస్తున్న తప్పుడు వార్తలు తమ సంస్థలపై దాడులకు, ఆస్తుల స్వాధీనానికి దారి తీస్తున్నాయని, దీనితో తమ వ్యాపార కార్యకలాపాలు నిలిచిపోయి రుణాలు తీర్చే దారులు మూసుకుపోతున్నాయని ఆయన వివరించారు. 'మీరు మీ బాకీలను వసూలు చేసుకోవాలన్న ఆతృతలో నేను చేసిన ప్రతిపాదనను కూడా విస్మరించారు. మీ చర్యలు నా ప్రతిష్టను వ్యాపారాన్ని దెబ్బతీయటమే కాక ఇప్పుడు నన్ను ఎగవేతదారుడిగా ముద్ర వేస్తున్నాయి' అని ఆయన తన లేఖలో పేర్కొన్నారు. రుణాల చెల్లింపుపై చర్చించేందుకు బ్యాంకు అధికారులకు, తన ప్రతినిధులకు మధ్య ఈ నెల 13,15 తేదీలలో జరిగిన ఇ-మెయిల్ సంప్రదింపులను మోడీ ఈ లేఖలో ప్రస్తావించారు.

రోటోమాక్ బ్యాంకు ఖాతాలను స్వాధీనం చేసుకున్న ఐటి శాఖ

న్యూఢిల్లీ : తీసుకున్న రుణాలను చెల్లించకుండా బ్యాంకులను మోసగించిన రోటోమాక్ గ్రూప్‌కంపెనీలకుచెందిన 11 బ్యాంకు ఖాతాలను దర్యాప్తు సంస్థలు మంగళవారం జప్తు చేశాయి. సిబిఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి), ఆదాయం పన్ను శాఖ (ఐటి) విభాగాలు రోటామిక్ గ్రూప్‌పై చర్యలు ప్రారంభించాయి. అందులో భాగంగానే బ్యాంకు ఖాతాలను జప్తు చేశాయి. పన్ను ఎగవేసిన కారణంగా ఆ బ్యాంకు ఖాతాలను స్వాధీనం చేసుకున్నట్లు సంబంధిత అధికారులు మంగళవారం తెలిపారు. ఉత్తర ప్రదేశ్‌లోని వివిధ బ్యాంకుల్లో ఉన్న ఖాతాలను సోమవారం రాత్రి జప్తు చేశారు. దాదాపు రూ.85 కోట్ల మేర పన్ను బకాయిలు ఉన్నాయని అధికారులు పేర్కొన్నారు. గత ఏడాది జనవరిలో ఆదాయం పన్ను శాఖ రోటోమాక్ గ్రూపునకు చెందిన మూడు బ్యాంకు ఖాతాలను జప్తు చేసిందని వారు తెలిపారు. కాన్పూర్‌కు చెందిన రోటోమాక్ గ్రూపు సంస్థలపై సిబిఐ, ఇడిలు దర్యాప్తు ప్రాంభించాయి. పలు బ్యాంకులన్నీ కలిసి రూ.3,695 కోట్ల రుణాలను రోటోమాక్ గ్రూపునకు ఇచ్చాయి. వీటిని తిరిగి చెల్లించకుండా కంపెనీ మోసం చేయడంతో సిబిఐ, ఇడి, ఐటి విభాగాలు ఈ వ్యవహారంపై దర్యాప్తు జరుపుతున్నాయి.

ప్రైవేటు రంగానికి బొగ్గు గనులు

కేంద్ర బొగ్గు శాఖ మంత్రి పీయూష్ గోయల్



న్యూఢిల్లీ : కోల్ ఇండియా గుత్తాధిపత్యానికి ముగింపు పలుకుతూ బొగ్గు గనుల రంగంలో ప్రైవేటు కంపెనీలకు కేంద్ర ప్రభుత్వం అవకాశం కల్పించిందని ప్రముఖ వార్తా సంస్థ మంగళవారం పేర్కొంది. బొగ్గు గనుల రంగాన్ని గుత్తాధిపత్యం నుండి పోటీ శకానికి తీసుకెళ్లి దాని సమర్థతను పెంచేందుకే ఈ చర్య తీసుకున్నట్లు బొగ్గు శాఖ మంత్రి పీయూష్ గోయల్ తెలిపారని ఆ వార్తా కథనం పేర్కొంది. దీని వల్ల పోటీతత్వం పెరగడమే కాకుండా ఉత్తమ సాంకేతికత కూడా ఆ రంగంలోకి అందుబాటులోకి వస్తుందని మంత్రి తెలిపారు. బొగ్గు గనుల రంగంలో ప్రైవేటు కంపెనీలకు అవకాశం కల్పించాలన్న ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటి నిర్ణయాన్ని ఆయన వెల్లడించారు. బొగ్గు లభ్యమయ్యే ప్రాంతాల్లో ప్రత్యేకించి మైనింగ్ రంగంలో అత్యధిక పెట్టుబడులు ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలను కల్పిస్తాయని ఆయన చెప్పారు.

రైతు నేతల అరెస్టులకు ఎఐకెఎస్ ఖండన

న్యూఢిల్లీ : రాజస్థాన్‌లోని బిజెపి ప్రభుత్వం తమ నేతలను అరెస్టు చేయడాన్ని అఖిల భారత కిసాన్ సభ (ఎఐకెఎస్) తీవ్రంగా ఖండించింది. రైతు ఉద్యమాన్ని అణిచివేయడానికి రాష్ట్రంలోని వసుంధర రాజే ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేసింది. ఎఐకెఎస్ ఉపాధ్యక్షులు కామ్రేడ్ అమ్రా రామ్, ప్రముఖ నాయకులు కామ్రేడ్ హెత్రామ్ బెనివాల్, కామ్రేడ్ శ్యోపత్ మెగ్‌వాల్, ఇతర నాయకులను అక్రమంగా అరెస్టు చేశారని, రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో ఈ అరెస్టులు కొనసాగుతున్నట్లు నివేదికలు వస్తున్నాయని తెలిపింది. అరెస్టు చేసిన నాయకులను, కార్యకర్తలను తక్షణమే విడుదల చేయాలని ఎఐకెఎస్ డిమాండ్ చేసింది. రైతు ఉద్యమానికి ప్రభుత్వం భయపడుతున్నట్లు ఈ అరెస్టులు వెల్లడిస్తున్నాయని, ప్రజాస్వామ్యయుతంగా సాగే నిరసనలను అణిచివేత చర్యలతో ఆపలేరని ఎఐకెఎస్ వ్యాఖ్యానించింది.

నాపై దాడి : సిఎస్ అబద్ధం : ఆప్



న్యూఢిల్లీ : ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ నివాసంలో కొంతమంది ఆప్ ఎమ్మెల్యేలు తనపై దాడి చేశారని ప్రధాన కార్యదర్శి అన్షూ ప్రకాష్ ఆరోపించారు. ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ నివాసంలో సోమవారం రాత్రి ఈ సంఘటన జరిగినట్లు సంబంధిత అధికారి ఒకరు తెలిపారు. అయితే అన్షూ ప్రకాష్ చేసిన ఆరోపణలు నిరాధారమైనవని ముఖ్యమంత్రి కార్యాలయం తోసిపుచ్చింది. ప్రభుత్వ ప్రకటనల విడుదల విషయమై చర్చించేందుకు అన్షూ ప్రకాష్‌ను ముఖ్యమంత్రి కేజ్రీవాల్ తన నివాసానికి పిలిపించారు. అయితే ప్రజా పంపిణీ వ్యవస్థపై చర్చించేందుకు అన్షూను పిలిపించినట్లు ఆప్ ఎమ్మెల్యేలు పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఆప్ ఎమ్మెల్యేలకు, కార్యదర్శికి మధ్య తీవ్రమైన వాగ్వివాదం జరిగిందని, ఈ సమయంలో ఇద్దరు ముగ్గురు ఆప్ ఎమ్మెల్యేలు ఆయనపై చెయ్యి చేసుకున్నారని, దీంతో ఆయన కళ్ళజోడు పగిలిపోయిందని సీనియర్ ఐఎఎస్ అధికారి ఒకరు ఆరోపించారు. ఆప్ ఎమ్మెల్యేలు తనపై దాడి చేసిన వెంటనే కార్యదర్శి అన్షూ లెఫ్టినెంట్ గవర్నర్ అనిల్ బైజాల్‌ను కలుసుకుని ఈ ఘటనపై వివరించారు. కాగా ఐఎఎస్ అధికారుల అసోసియేషన్ కూడా బైజాల్‌ను మంగళవారం కలుసుకుని విషయాన్ని వివరించింది. అన్షూపై దాడిని నిరసించింది. ఈ విషయమై తాము సమ్మె చేయాలనుకోవడం లేదని స్పష్టం చేసింది. సమ్మె చేయడం వల్ల ప్రజలు ఇబ్బందులకు గురవుతారని పేర్కొంది.

ఆప్ ఖండన

ఈ ఆరోపణలను ఆప్ తిప్పి కొట్టింది. ఆధార్‌ను తప్పుగా అమలు చేసిన కారణంగా గత నెలలో 2.5 లక్షల కుటుంబాలు రేషన్‌ను పొందలేకపోయాయని ఆరోపించింది. ఈ విషయంలో ఆప్ ఎమ్మెల్యేలు ప్రజల నుండి తీవ్రమైన ఒత్తిడి ఎదుర్కొంటున్నారని, దీనికి సంబంధించి ముఖ్యమంత్రి నివాసంలో ఎమ్మెల్యేలు సమావేశమయ్యారని తెలిపింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పేందుకు అన్షూ నిరాకరించారని, తాను ఎమ్మెల్యేలకు గాని, సిఎంకు గాని జవాబుదారిని కాదనడంతో పాటు కొంతమంది ఎమ్మెల్యేలను దుర్భాషలాడారని కూడా ఆప్ పేర్కొంది. ప్రకటనలకు మరిన్ని నిధులు కావాలని కోరారని చేసిన ఆరోపణలను ఆప్ నిరాకరించింది. ఆధార్‌ను తప్పుగా అమలు చేస్తున్న విషయమై చర్చించేందుకు అన్షూ ప్రకాష్‌ను పిలిపించినట్లు తెలిపింది. "కొంతమంది ఎమ్మెల్యేలను ఆయన దుర్భాషలాడారు. ఏ ప్రశ్నకి సమాధానం చెప్పకుండా అక్కడ నుంచి వెళ్ళి పోయారు." అని ఆప్ తన ట్వీట్‌లో పేర్కొంది. "ఇప్పుడు ఆయన హాస్యాస్పద ఆరోపణలు చేస్తున్నారు. బిజెపి తరుపున ఆయన మాట్లాడుతున్నట్లు స్పష్టమవుతుంది. చీఫ్ సెక్రటరి అటువంటి ఆరోపణలు చేస్తున్నారంటే, ఆప్ ప్రభుత్వం చేస్తున్న పనికి అధికారుల ద్వారా బిజెపి ఎటువంటి ఆటం కాలు కల్పిస్తుందో ప్రతి ఒక్కరూ ఊహించుకోవచ్చు" అని ఆప్ పేర్కొంది. బిజెపి చాలా దిగజారుడుగా వ్యవహరిస్తోందని ఆప్ ఆరోపించింది.

నివేదిక కోరిన హోం శాఖ

ఢిల్లీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అన్షూ ప్రకాష్‌పై దాడి జరిగిందని వచ్చిన ఆరోపణలపై నివేదికను అందచేయాలని రాష్ట్ర గవర్నర్ అనిల్ బైజాల్‌ను మంగళవారం హోం మంత్రిత్వ శాఖ కోరింది. ఈ మేరకు లెఫ్టినెంట్ గవర్నర్‌కు సమాచారం పంపింది. ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ నివాసంలో సోమవారం రాత్రి ప్రభుత్వ అధికారి అన్షూ ప్రకాష్‌పై దాడి జరిగినట్లు వచ్చిన ఆరోపణలపై సమగ్ర నివేదికను సమర్పించాలని ఆ సమాచారం పేర్కొంది. ఢిల్లీ ప్రభుత్వంలో పనిచేస్తున్న ఐఎఎస్ అధికారుల ప్రతినిధి బృందాన్ని కూడా హోం మంత్రి కలిశారని మంత్రిత్వ శాఖ వర్గాలు తెలిపాయి. ఈ పరిణామం పట్ల హోం మంత్రిత్వ శాఖకు సమాచారముందని అధికారులు చెప్పారు.

త్రిపుర ఎన్నికల తీరుపై ప్రధాన ఎన్నికల అధికారికి సిపిఎం ఫిర్యాదు

ఇండియా న్యూస్ నెట్‌వర్క్, న్యూఢిల్లీ : ఆదివారం జరిగిన త్రిపుర అసెంబ్లీ ఎన్నికల్లో పోలింగ్‌లో ఎదురైన సమస్యలు, ఇబ్బందులుపై భారత ప్రధాన ఎన్నిక కమిషనర్ (సిఇసి) ఓం ప్రకాష్ రావత్‌ను కు సిపిఎం ఫిర్యాదు చేసింది. సిపిఎం సెంట్రల్ సెక్రటేరియట్ సభ్యులు నిలోత్‌పాల్ బసు సోమవారం ఇక్కడ ఆయనను కలుసుకున్నారు. త్రిపుర అసెంబ్లీ ఎన్నికల్లో పెద్ద సంఖ్యలో ఈవిఎంలు పనిచేయక పోవడం, సాంకేతిక సమస్యలు తలెత్తడంపై ఫిర్యాదు చేశారు. సిపిఎం త్రిపుర రాష్ట్ర కమిటీ రాసిన లేఖను కూడా దానికి జత చేశారు. ఈ నెల 18న రాష్ట్రంలో 59 అసెంబ్లీ స్థానాలకు ఎన్నికలు జరిగాయి. మొత్తం 3174 పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ జరగ్గా, ఇందులో 16.35 శాతం కేంద్రాల్లో (519) ఈవిఎంలు పనిచేయలేదు. వీటిలో కొన్నింటినీ రిపేరు చేసినా, మళీ మొరాయించాయి. పని చేసినవీ కూడా సక్రమంగా పని చేయలేదు. అలాగే కొన్ని కేంద్రాల్లో రాజకీయ పార్టీల ప్రతినిధులు లేకుండానే ఎన్నికల సిబ్బంది ఈవిఎంలను తెరిచారు. కొన్ని ప్రాంతాల్లో అయితే పోలింగ్‌కు ముందురోజే ఈవిఎంలను సిబ్బంది తెరిచారు. ఈ ఎన్నికల ద్వారా రాష్ట్రంలో తొలిసారి వెబ్ కాస్టింగ్ సిస్టమ్ ప్రవేశ పెట్టారు. ఈ సిస్టమ్ ద్వారా రాష్ట్రంలోని అన్ని పోలింగ్ కేంద్రాలను కేంద్ర మోనిటర్‌కు అనుసంధానించారు. అయితే ఈ కాంట్రాక్ట్‌ను గుజరాత్‌కు చెందిన సంస్థకు ఇచ్చారు. ఈ సంస్థ యజమాని గుజరాత్ బిజెపి రాష్ట్ర కమిటీలో సభ్యులు. పోలింగ్ రోజు సాయంత్రం గోలఘతి నియోజకవర్గం సిపిఎం అభ్యర్థి పులిన్ బర్ధన్‌పై ఐపిఎఫ్‌టి సభ్యులు దాడి చేశారు. బోర్దవాలి నియోజకవర్గంలోని లెఫ్ట్ ఫ్రంట్ బలపరిన అభ్యర్థి బిస్వనాథ్ సాహాపై పారామిలటరీ సిబ్బంది దాడి చేశారు. తీవ్ర గాయాలతో వీరిద్దరూ జిబి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

కేంద్ర గృహ నిర్మాణ పథకానికి అదనపు బడ్జెట్

ఆమోదించిన కేబినెట్

న్యూఢిల్లీ : కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధాన మంత్రి ఆవాస యోజన (అర్బన్) (పిఎంఎవై(యు)) హౌసింగ్ స్కీమ్‌కు అదనపు బడ్జెట్‌ను కేటాయించేందుకు కేంద్ర ప్రభుత్వం మంగళవారం ఆమోదం తెలిపిందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఈ పథకం కింద పట్టణ పేదలకు 1.2 కోట్ల నివాసాలను నిర్మించి ఇవ్వాలని గృహ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ లక్ష్యంగా పెట్టు కుంది. ఈ పథకానికి 2018-2019 బడ్జెట్‌లో రూ.6,505 కోట్లు కేటాయించారు. 2017-2018 బడ్జెట్‌లో రూ.6,042, 81 కోట్లు కేటాయించారు. అయితే సాధారణ బడ్జెట్ కాకుండా రూ.25 వేల కోట్ల అదనపు బడ్జెట్ కేటాయించాలని ప్రతిపాదించారు. పట్టణ ప్రాంతాలలో 39 లక్షల గృహాల నిర్మాణానికి సహాయం మంజూరైంది.

విమానాల తయారీకి పైలట్‌తో ఒప్పందం

సంతకాలు చేసిన మహారాష్ట్ర సర్కారు

ముంబయి : రు. 35 వేల కోట్ల పెట్టుబడితో విమానాల తయారీ సంస్థ ఏర్పాటుకు సంబంధించిన ఒప్పందంపై మహారాష్ట్ర ప్రభుత్వం, ఒక పైలట్‌తో మంగళవారం నాడు ఒప్పందం కుదుర్చుకుంది. నగర శివార్లలోని బాంద్రాలో 'మాగ్నటిక్ మహారాష్ట్ర' పేరిట జరుగుతున్న పెట్టుబడిదారుల సదస్సులో ముఖ్యమంత్రి దేవేంద్రఫడ్నవిస్ సమక్షంలో ఈ అవగాహనా పత్రంపై మాజీ పైలట్ అన్‌మోల్ యాదవ్, మహారాష్ట్ర పారిశ్రామికాభివృద్ధి సంస్థ (ఎంఐడిసి) ప్రతినిధులు సంతకాలు చేశారు. పాల్ఘర్ జిల్లాలో 157 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించే ఈ ప్రాజెక్టు ద్వారా 10 వేల మందికి ఉద్యోగావకాశాలు ఏర్పడతాయని అధికారులు చెప్పారు. సతారాజిల్లాకు చెందిన ఈ మాజీ పైలట్ అన్‌మోల్ యాదవ్ సొంతంగా విమానాల తయారీ సంస్థ ఏర్పాటు చేయాలని దీర్ఘకాలంగా ప్రణాళికలు సిద్ధం చేసుకున్నాడు. 6 సీట్లు, 19 సీట్ల సామర్థ్యంతో విమానాలను రూపొందించ గలనని చెప్పటంతో అవసరమైన సాయం అందించేందుకు ముఖ్యమంత్రి ఫడ్నవిస్ గత ఏడాది సంసిద్ధత వ్యక్తం చేశారు. విమానాల తయారీ తన దీర్ఘకాలిక స్వప్నమని, ఇందుకు అవసరమైన సామర్థ్యాన్ని తాను చూపినపుడు దేశంలో తొలి విమాన తయారీ సంస్థ మహారాష్ట్రలోనే ఏర్పాటు కావాలని ముఖ్యమంత్రి అభిలషించారని యాదవ్ వివరించారు. ఇందుకు అవసరమైన 157 ఎకరాల స్థలాన్ని ప్రభుత్వం పాల్ఘర్ జిల్లాలో కేటాయించిదని, ఇతర సదుపాయాలన ఎంఐడిసి అందిస్తుందని ఆయన చెప్పారు. తన బాధ్యత అంతా విమానాన్ని తయారుచేయటం, క్రమంగా ఈ సంఖ్యను పెంచటం ద్వారా ఈ ప్రాంతాన్ని ఏరోస్పేస్ హబ్‌గా మార్చటం అని ఆయన అన్నారు. ఇందుకు అవసరమైన నిధుల సమీకరణకు మహారాష్ట్ర ప్రభుత్వం సహకరిస్తుందని ఆయన చెప్పారు. ప్రభుత్వం చెబుతున్న రు.35 వేల కోట్ల పెట్టుబడి కేవలం తన కంపెనీ పెట్టుబడి మాత్రమే కాదని, ఏరోస్పేస్ హబ్‌కు అవసరమైన సౌకర్యాలను సమకూర్చేందుకు ఉద్దేశించిననిధిలో ఇది భాగమని యాదవ్ వివరించారు. తొలిదశలో 19 సీట్ల సామర్థ్యం కలిగిన ప్రోటోటైప్ విమానాలను తయారు చేస్తామన్నారు. ఇందుకు రు.200 కోట్ల పెట్టుబడి అవసరమని, దీనిని రానున్న ఆర్నెల్ల వ్యవదిలో ఖర్చు చేస్తామని యాదవ్ చెప్పారు.



అరుణాచల్ ప్రదేశ్‌లో దారుణం

స్థానికుల దాడిలో అత్యాచార నిందితుల మృతి

ఇటానగర్ : ఇద్దరు నిందితులపై ఆగ్రహంతో కొందరు దాడిచేయడంతో వారు మృతి చెందిన ఘటన మంగళవారం అరుణాచల్ ప్రదేశ్‌లో లోహిత్ జిల్లాలో చోటు చేసుకుంది.. కొంతమంది పోలీసు స్టేషన్‌లోకి చొరబడి అక్కడ ఉన్న నిందితులను వీధిలోకి లాక్కొచ్చి వారిని చితక బాదారు. దీంతో నిందితులిద్దరూ మృతి చెందారని మంగళవారం పోలీసులు తెలిపారు. జిల్లాలోని నామ్గో గ్రామానికి చెందిన ఐదేళ్ళ బాలికపై నిందితులు అత్యాచారం చేసి అనంతరం హత్య చేశారు. ఈ కేసులో అరెస్టయిన నిందితులిద్దరూ తేజు పట్టణ పోలీసు స్టేషన్‌లో ఉన్నారని తెలుసుకున్న స్థానికులు పోలీసు స్టేషన్‌పై దాడి చేసి వీధిలోకి లాక్కొచ్చి దారుణంగా కొట్టారు. దీంతో వారు మృతి చెందారని పోలీసులు తెలిపారు. ఈ సంఘటనపై ముఖ్యమంత్రి ప్రేమ్ ఖండ్ స్పందిస్తూ మెజిస్ట్రీరియల్ దర్యాప్తుకు ఆదేశించారు. ఈ నెల 12 నుంచి కనిపించకుండా పోయిన మైనర్ బాలిక మృత దేహాన్ని అంతకు ముందు ఆ గ్రామానికి కొద్ది దూరంలో ఉన్న టీ గార్డెన్ వద్ద కనుగొన్నారు. నిందితుల తమ నేరాన్ని అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. కాగా, పరిస్థితిని అదుపు చేయడంలో విఫలమైన పోలీసు స్టేషన్ ఇన్‌ఛార్జ్, మహిళా సబ్ ఇన్‌స్పెక్టర్‌తో సహా ముగ్గురిని అధికారులు సస్పెండ్ చేశారు. ఎస్‌పిని బదిలీ చేశారు.

మెహుల్ చోక్సీ నేరాభియోగాలపై దర్యాప్తు

న్యూఢిల్లీ : బ్యాంకులను మోసం చేసిన ఆరోపణలు ఎదుర్కొంటున్న గీతాంజలీ జెమ్స్ సంస్థ ప్రమోటర్ మెహుల్ చోక్సీపై నమోదు చేసిన నేరాబియోగాలపై పూర్తి స్థాయి దర్యాప్తు చేయాలని ఢిల్లీ హైకోర్టు మంగళవారం నాడు పోలీసులను ఆదేశించింది. ఈ కేసులో నిందితులు పరి ష్కారం కోసం చర్చలు జరుపుతున్నందున దర్యాప్తు నిలిచి పోయినట్లు తెలుస్తోందన్న న్యాయమూర్తి ముక్తా గుప్తా నేతృత్వంలోని ధర్మాసనం ఈ అంశంపై పూర్తి నివేదిక అంద చేయాలని ఆదేశించింది. అయితే గత ఏప్రిల్‌లో చోక్సికి మంజూరయిన తాత్కాలిక రక్షణ ఇకపై కూడా కొనసాగు తుందని స్పష్టం చేసింది. 2016లో ఒక ఇంజనీరింగ్ సంస్థ ను మోసం చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న చోక్సి తన పై నమోదయిన నేరాభియోగాలను కొట్టివేయాలని కోరుతూ హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. అధిక లాభాలకు చోక్సీ భరోసా ఇవ్వటంతో గీతాంజలి జెమ్స్ రిటైల్ ఫ్రాంచైజీని తమ సంస్థ ఆర్ఎం గ్రీన్ సొల్యూషన్స్ కొనుగోలు చేసిందని, బిటెక్ గ్రాడ్యుయేట్ అయిన వైభవ్ ఖురానియా చేసిన ఫిర్యాదుపై మేజిస్టీరియల్ కోర్టు ఆదేశాల మేరకు పోలీసులు సౌత్ ఢిల్లీలోని అమర్ కాలనీ పోలీస్ స్టేషన్‌లో ఈ ఎఫ్ఐఆర్‌ను నమోదు చేశారు. ఈ మోసం వెలుగులోకి రావటంతో చోక్సీపై ఎఫ్ఐఆర్‌ను నమోదు చేయాలంటూ 2016 జూన్‌లో జిల్లా కోర్టు ఆదేశాలు జారీ చేసింది. జులై 12న పోలీసులు ఎఫ్ఐఆర్‌ను నమోదు చేశారు.

సిట్ ఏర్పాటుపై విచారణకు సుప్రీం ఓకె

నీరవ్ మోడీ తదితరులు పంజాబ్ నేషనల్ బ్యాంక్‌ను మోసగించిన కేసులో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేయాలంటూ దాఖలైన పిటిషన్‌పై శుక్రవారం నాడు విచారణ చేపట్టేందుకు సుప్రీంకోర్టు అంగీకరించింది.

ప్రత్యేకం

ప్రైవేటు ఆస్పత్రుల దందా

ఔషధాలు, వైద్య పరికరాలు, పరీక్షలపై 1700 శాతం లాభం

న్యూఢిల్లీ : వైద్యం కోసం తమ వద్దకు వస్తున్న రోగుల నుండి వైద్య చికిత్సల పేరుతో దండుకుంటున్న ప్రైవేటు ఆస్పత్రులు, అంతటితో తృప్తి పడకుండా ఔషధాలు, వైద్య పరికరాల, వైద్య పరీక్షల వ్యాపారాల రూపంలో సైతం నిలువు దోపిడీ చేస్తున్న వైనం వెలుగు చూసింది. ముఖ్యంగా ఔషధాలు, వైద్య పరికరాలు, వైద్య పరీక్షల వ్యాపారాలే 1700 శాతం మేర లాభాలను అందిస్తున్న విషయం ప్రైవేటు ఆస్పత్రుల దందాకు దర్పణం పడుతోంది. దేశ రాజధాని ఢిల్లీ పరిసర ప్రాంతాలలో నాలుగు ప్రముఖ ప్రైవేటు ఆస్పత్రుల బిల్లులను నేషనల్ ఫార్మాస్యూటికల్ ప్రైసింగ్ అథారిటీ (ఎన్‌పిపిఎ) పరిశీలించినపుడు ఈ విషయం వెలుగు చూసింది. ఔషధాలు, వైద్య పరికరాలు, వైద్య పరీక్షల రూపంలో ప్రైవేటు ఆస్పత్రులు 1,737 శాతం మేర లాభాలు దండుకుంటున్నాయని, ఇది పేషెంట్ల బిల్లుల్లో 46 శాతం మేర వుంటోందని ఎన్‌పిపిఎ మంగళవారం విడుదల చేసిన తన అధ్యయన నివేదికలో వెల్లడించింది. ఈ మూడు విషయాల్లో ఇబ్బడి ముబ్బడిగా పెంచి చూపుతున్న గరిష్ట విక్రయ ధర (ఎంఆర్‌పి)లతో తయారీ సంస్థలకన్నా ప్రధానంగా ఆస్పత్రులే లబ్ది పొందుతున్నాయని ఎన్‌పిపిఎ తన నివేదికలో పేర్కొంది. ప్రైవేటు ఆస్పత్రుల వైద్యులు సూచించే ఔషధాలు, వైద్య పరికరాలు, డిస్పోజబుల్స్‌లో అధికశాతం ఆస్పత్రులలో తమ సొంత ఫార్మసీలలో తయారు చేస్తుంటాయని, పేషెంట్లు వీటిని మాత్రమే కొనుగోలు చేయాలన్న



పరిస్థితులు కల్పిస్తుంటాయని ఎన్‌పిపిఎ వివరించింది. ప్రైవేటు ఆస్పత్రులు నిర్వహించే వ్యవస్థాపరమైన బల్క్ కొనుగోళ్లు కాక అనేక సందర్భాలలో సొంత ఫార్మసీలో తయారైన మందులు, వైద్య పరికరాలను పేషెంట్లకు సూచిస్తూ లాభాలు దండుకుంటున్నారని, ఉత్పత్తి వ్యయానికి వందల రెట్లు ఎక్కువగా ఎంఆర్‌పిని ముద్రిస్తుండటంతో చట్టపరమైన ఎంఆర్‌పి ఉల్లంఘనలు లెక్కలోకి రావటం లేదని ఎన్‌పిపిఎ వివరించింది. ఈ ఆస్పత్రి యాజమాన్యాలు తమకు అందచేసే బల్క్ ఔషధ కొనుగోళ్లపై అధికధర ముద్రించిన లేబుల్స్ వుండాలంటూ తయారీ సంస్థలను వత్తిడి చేస్తుంటాయని తెలిపింది. 'స్పష్టంగా చెప్పాలంటే ఇది మార్కెట్ వక్రీకరణేనని, సాధారణంగా తయారీ సంస్థలు తమ ఉత్పత్తి వ్యయం, లాభాలను కలుపుకున్న తరువాతే ఎంఆర్‌పిని ముద్రిస్తుంటాయని, కాగా వ్యాపార సంస్థలుగా కొనసాగుతున్న ఆస్పత్రుల డిమాండ్ మేరకు కృత్రిమంగా పెంచిన భారీ ఎంఆర్‌పిలతో ఆస్పత్రి యాజమాన్యాలు పేషెంట్ల జేబుకు చిల్లు పెడుతున్నాయని ఎన్‌పిపిఎ వివరించింది. ఔషధాలు, వైద్య పరికరాలు, వైద్య పరీక్షలకు అయ్యే వ్యయం పేషెంట్ల బిల్లుల్లో దాదాపు సగం మేర వుంటుందని, ఇది ఆయా ఆస్పత్రులు అందించే వైద్య వ్యయ అంచనాలు (ఎస్టిమేట్లు), ఇన్‌ప్లాంట్ ప్యాకేజిల వంటి వాటిలో భాగం కాదని ఎన్‌పిపిఎ స్పష్టం చేసింది. ఇటీవలి కాలంలో డెంగ్యూ జ్వరం, ఇతర వ్యాధులతో కొంతమంది రోగులు మరణించిన నేపథ్యంలో వారి కుటుంబాలపై ఆయా ఆస్పత్రుల యాజమాన్యాలు విపరీతమైన ఆర్థిక భారాన్ని మోపాయన్న ఫిర్యాదులు వెల్లువెత్తిన నేపథ్యంలో ఎన్‌పిపిఎ ఈ అధ్యయనం చేపట్టింది. దాదాపు అన్ని సందర్భాలలో ఆస్పత్రులు అందచేసిన తొలి వ్యయ అంచనాల కన్నా చివరికి వచ్చే బిల్లులు దాదాపు నాలుగైదు రెట్లు ఎక్కువగా వుంటున్నాయని పేషెంట్లు ఫిర్యాదు చేశారని ఎన్‌పిపిఎ వెల్లడించింది. కాగా ఈ దందాలో ప్రమేయం వున్న ఆస్పత్రులు దీనిపై రచ్చ చేయవద్దని తమను కోరాయని, ఇవన్నీ అన్ని చోట్లా సాధారణంగా జరుగుతుండేవని తమకు నచ్చ చెప్పే ప్రయత్నం చేశాయని ఎన్‌పిపిఎ వివరించింది. వైద్య పరికరాలపై ఆస్పత్రులు ఆర్జించే లాభాలు గరిష్టంగా 350 శాతం నుండి 1700 శాతం వరకూ వుంటున్నాయని, ధర నియంత్రణ లేని ఔషధాల విషయంలో 160 నుండి 225 శాతం వరకూ, ధర నియంత్రణఉన్న ఔషధాల విషయంలో 115 శాతం నుండి 200 శాతం వరకూ ఈ ఆస్పత్రులు లాభాలు దండుకుంటున్నాయని తెలుస్తోంది. కాగా ఆస్పత్రులు ఎక్కువగా నాన్ షెడ్యూల్డ్ వైద్య పరికరాలయిన కేథటర్స్, కాన్యుయల్స్, సిరింజల వంటి వాటిలో భారీ లాభాలను మూటకట్టుకుంటున్నాయని, ఇది 'విఫలమైన మార్కెట్ వ్యవస్థలో అనైతిక లాభార్జనే'నని ఎన్‌పిపిఎ తన నివేదికలో స్పష్టం చేసింది. ఆస్పత్రులలో లభించే వైద్య పరికరాలు, ఔషధాల విక్రయాలపై చట్టపరమైన పర్యవేక్షణ లేకపోవటంతో పేషెంట్ల బిల్లుల్లో షెడ్యూల్డ్ ఔషధాల వాటా పదో వంతుకు పడిపోయిందని తెలిపింది. ఆస్పత్రులలో వినియోగించే ఔషధాలు, పరికరాలలో అధికశాతం ఔషధాల జాబితాలో చోటు చేసుకోపోవటంతో ఇవి ధరల నియంత్రణలో వున్నాయో లేదో తెలుసుకునేందుకు ఎన్‌పిపిఎకు సాధ్యం కాలేదని, అదే విధంగా వైద్య పరీక్షలు, ఇతర ఆస్పత్రి ఛార్జిలు సైతం ఎన్‌పిపిఎ పరిధిలోకి రావని వెల్లడించింది. వీటిని కేంద్ర ప్రభుత్వ ప్రత్యేక చట్టాల ద్వారా మాత్రమే నియంత్రించగలదని స్పష్టం చేసింది. వైద్య పరీక్షల ఖర్చు మొత్తం బిల్లులో 15 శాతానికన్నా ఎక్కువగా వుంటోందని, ఆస్పత్రుల్లో వసూలు చేస్తున్న డయాగ్నస్టిక్ ఛార్జీలు, బయట వాటితో పోలిస్తే అనేక రెట్లు ఎక్కువగానే వుంటున్నాయని ఎన్‌పిపిఎ తన అధ్యయన నివేదికలో వివరించింది.

సంక్షిప్తం

ఓటర్ కార్డుకూ ఆధార్ అనుసంధానం

న్యూఢిల్లీ : ఓటర్ కార్డుకు కూడా ఆధార్‌తో అనుసంధానం అవసరమేనన్న వాదనలు వినిపిస్తున్నాయి. న్యాయవాది, బిజెపి నేత అయిన అశ్విన్‌కుమార్ ఉపాధ్యాయ్ ఆధార్ ఓటింగ్ వ్యవస్థను అమలుచేసేలా ఎలక్షన్ కమిషన్‌కు మార్గదర్శకాలివ్వాలని కోరుతూ సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. ఈ పిటిషన్ పై విచారణ చేపట్టిన కోర్టు నాలుగు వారాల అనంతరం విచారిస్తామని మంగళవారం వెల్లడించింది. మార్చిలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయ మూర్తితో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌ను పరిశీలించనుందని పేర్కొంది. దీంతో ఎక్కువ మంది ఓటింగ్‌లో పాల్గొనేలా చేయడంతో పాటు ప్రజా ప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్లు 17,18 ప్రకారం నకిలీ, బోగస్ ఓట్లను నివారించవచ్చని పిటిషనర్ పేర్కొన్నారు. నకిలీ ఓట్లు వేయడం, బూత్‌లను ఆక్రమించడం వంటివి భారత్‌లో ఎక్కువగా జరుతున్నాయని, ప్రస్తుత ఎన్నికల వ్యవస్థ ఒక్కటే వీటిని అదుపు చేయలేదని ఆయన తెలిపారు. ఆధార్ ఓటింగ్ వల్ల ఓటర్ల సమాచారం భద్రంగా ఉండటంతో పాటు వారు దేశం నలుమూలల నుంచి ఎక్కడి నుంచైనా ఓటు వేసే అవకాశం ఉంటుందని తెలిపారు.

అవినీతి కేసులో నెతన్యాహు అనుచరులు

జెరూసలేం : ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుకు అత్యంత సన్నిహితులైన ఇద్దరు వ్యక్తులను అవినీతి కేసులో అరెస్ట్ చేసిన ఇజ్రాయిల్ పోలీసులు వారిపై ఎఫ్ఐఆర్‌ను నమోదు చేశారు. ఈ కేసు దర్యాప్తుపై ప్రభుత్వం గతంలో జారీ చేసిన రహస్య ఆదేశాలు (గ్యాగ్ ఆర్డర్)ను రద్దు చేయటంతో పోలీసులు వారి పేర్లను బహిర్గతం చేశారు. ఇందులో ఒకరు నెతన్యాహుకు గతంలో అధికార ప్రతినిధిగా పనిచేసిన నీర్‌ఫెఫెట్జ్ కాగా మరొకరు నెతన్యాహు నిర్వహించిన కమ్యూనికేషన్ మంత్రిత్వశాఖలో డైరెక్టర్‌గా వ్యవహరించిన షిలోకో ఫిల్బర్. అత్యధిక ప్రజాదరణతో కొనసాగుతున్న ఒక న్యూస్ వెబ్‌సైట్‌లో నెతన్యాహుకు అనుకూల ప్రచారాన్ని కొనసాగించినందుకు ప్రతిగా వీరు ఇజ్రాయిల్‌కు చెందిన బెజెక్ టెలికాం కంపెనీకి లక్షలాది డాలర్ల లబ్ది కలిగే విధంగా ప్రచార నియమ నిబంధనలను మార్చివేసినట్లు అనుమానిస్తున్నారు. కాగా ఈ కేసు అనుమానితుల జాబితాలో నెతన్యాహు పేరు ఇప్పటి వరకూ చేరకపోవటం గగమనార్హం.

'ప్రెసిడెంట్స్ డే'ను జరుపుకుంటున్న అమెరికా

వాషింగ్టన్ : 'ప్రెసిడెంట్స్ డే' ను అమెరికా మంగళవారం జరుపుకుంటోంది. అమెరికా ప్రథమ అధ్యక్షుడు జార్జి వాషింగ్టన్ (1732- 1799) జన్మదినమైన ఈనాడు ప్రభుత్వ సంస్థలకు, స్కూళ్ళకు, బ్యాంకులకు అన్నిటికీ శలవు. అయితే తప్పనిసరిగా పాటించాలనేమీ లేదు. వాస్తవానికి వాషింగ్టన్ జన్మించింది ఫిబ్రవరి 22, మరణించింది కూడా 22నే. దాంతో దేశ వ్యాప్తంగా ఈ రోజును ప్రెసిడెంట్స్ డే గా పాటిం చాలని నిర్ణయించారు. 1960వ దశకంలో యూనిఫారం మండే హాలిడే యాక్ట్‌ను కాంగ్రెస్ ఆమోదించింది. అంటే అన్ని ప్రభుత్వ శలవు దినాలు సోమవారమే వుండాలని నిర్ణయించారు.

వసంత ఉత్సవం

చైనాలో ప్రతి ఏటా నిర్వహించుకునే వసంత కాలపు ఉత్సవాల్లో భాగంగా షాన్‌డొంగ్ ప్రావిన్స్‌లోని జినాన్ సిటిలో లాంతర్లతో ఏర్పాటు చేసిన ఈ బొమ్మలు అందర్నీ ఆకట్టుకున్నాయి.



జపాన్ సరస్సులోకి ఇంధన ట్యాంకులు

జారవిడిచిన అమెరికా యుద్ధ విమానం

టోక్యో:జపాన్‌లో అమెరికా వైమానిక దళానికి చెందిన మిసావా వైమానిక స్థావరంలో ఒక ఎఫ్-16 యుద్ధ విమానానికి టేకాఫ్ సమయంలో నిప్పంటుకున్నదని జపాన్ రక్షణ మంత్రిత్వశాఖ వెల్లడించింది. మంగళవారం ఉదయం మిసావా వైమానిక స్థావరం నుండి టేకాఫ్ తీసుకున్న కొద్దిసేపటికే ఈ ఎఫ్-16 జెట్ విమానం ఇంజన్‌లో మంటలు చెలరేగాయని అమెరికా సైనిక వర్గాలను ఉటంకిస్తూ జపాన్ రక్షణ మంత్రి ఇట్సునోరి ఒనోడేరా చెప్పారు. ఇంజన్‌లో మంటలు చెలరేగటంతో విమానం పైలట్ దానికి వెలుపల వున్న రెండు ఇంధన ట్యాంకులను సమీపంలోని ఒగవారా సరస్సులో జారవిడిచాడని, ఆయన వివరించారు. ఈ యుద్ధ విమానం కొద్దిసేపటికే తిరిగి తన స్థావరానికి చేరినట్లు తెలుస్తోంది. విమానం ఇంజన్‌లో మంటలు చెలరేగినపుడు నిండుగా వున్న ఇంధన ట్యాంకులను కిందికి జారవిడవటం సాధారణ రక్షణ పద్ధతుల్లో ఒకటని రక్షణశాఖ వర్గాలు వివరించాయి. ఇలా నిండుగా వున్న ఇంధన ట్యాంకులను జారవిడవటం వల్ల విమానం బరువు తగ్గి తేలికపడుతుందని, అగ్ని ప్రమాదం నుండి రక్షించుకోవటం సులభమవుతుందని ఈ వర్గాలు చెప్పాయి. కాగా విమానం నుండి జారిపడిన ఇంధన ట్యాంకుల వల్ల భూతలంపై ఎటువంటి ఆస్తి, ప్రాణనష్టం కానీ, సరస్సులో నీటి కాలుష్యం కానీ జరిగినట్లు వార్తలు అందలేదు.

తుపాకీ నియంత్రణ చట్టాలు తేవాలి

నేడు ఫ్లోరిడా రాజధానిలో విద్యార్థుల ర్యాలీ

ఫ్లోరిడా : గత వారం స్టోన్‌మన్ డగ్లస్ హైస్కూల్లో కాల్పులు జరిగి 17మంది మరణించిన నేపథ్యంలో తుపాకీ చట్టాన్ని మారుస్తూ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులు బుధవారం ర్యాలీ నిర్వహించనున్నారు. ఈ ర్యాలీలో పాల్గొనడం కోసం 400 మైళ్ళ దూరంలోని రాజధాని తల్లాహస్సీకి చేరుకోవడానికి మంగళవారం బస్సుల్లో బయలుదేరారు. ఇటువంటి మారణకాండ మరోసారి జరగ కుండా వుండేలా చర్యలు తీసుకోవాలని పార్లమెంట్ సభ్యులను కోరనున్నారు. తుపాకీ నియంత్రణ చట్టాలను పరిశీలించి చర్యలు తీసుకోవాలని, ఆ మేరకు ఒత్తిడి తీసుకురావాలని విద్యార్థులు కోరనున్నారు. కాగా ఈ ఘటన జరిగిన వెంటనే తాము ఆ విషయాన్ని పరిశీలిస్తునామని కొంతమంది రిపబ్లికన్ ఎంపీలు చెప్పగా మరికొందరు సంఘటనా ప్రాంతానికి వెళ్ళి పరిశీలించారు. లాస్ ఏంజెల్స్ పార్క్ వద్ద వందలాదిమంది విద్యార్థులు నినాదాలు చేస్తూ ప్రదర్శన నిర్వహించారు.

సిరియా పరిస్థితులపై పుతిన్, ఎర్డోగన్ ఫోన్ చర్చలు

మాస్కో : సిరియాలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులపై రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, టర్కీ అధ్యక్షుడు రెసెప్ తైయిప్ ఎర్డోగన్‌తో ఫోన్‌లో చర్చించారు. ఇరాన్‌తో సహకరించుకోవాలని ఈ సందర్భంగా ఇరువురు నేతలు ధృవీకరించారని అధికార వర్గాలు తెలిపాయి. కజకస్తాన్ తరహా సహకారాన్ని పెంచుకోవడానికి గల మార్గాలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని ఇరువురు నేతలు భావించారని క్రెమ్లిన్ ప్రెస్ సర్వీస్ తెలిపింది. సిరియాలో ఉద్రిక్త నివారణ మండలాల్లో సమర్ధవంతమైన సహకారాన్ని సాధించేందుకు గానూ రష్యా, టర్కీ, ఇరాన్‌ల ప్రయత్నాలను మరింత సమన్వయపరచడానికి సంసిద్ధతను కూడా ఇరువురు ప్రకటించారు. సోచిలో జరిగిన సిరియా జాతీయ చర్చా క్రమంలో కుదిరిన ఒప్పందానికి అనుగుణంగా రాజకీయ క్రమాన్ని మరింత ముందుకు తీసుకెళ్ళాలని కూడా నిర్ణయించారు.

బ్రెజిల్‌లో హింసను ఎదుర్కొనేందుకు ప్రత్యేక శాఖ

బ్రసీలియా : హింసను ఎదుర్కొనేందుకు ప్రజా భద్రత మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసినట్లు బ్రెజిల్ అధ్యక్షుడు మైఖేల్ టెమర్ ప్రకటించారు. నేరాల రేటు ఎక్కువగా రియో డీ జెనీరోలో భద్రతను మొత్తంగా సైన్యానికి అప్పగించిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ప్రజా భద్రతకు సంబంధించిన అన్ని వ్యవహారాలను చక్కబెట్టేందుకు ఒక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని నిర్ణయించామని తెలిపారు. హోం మంత్రిత్వ శాఖ మాదిరిగానే ఈ శాఖ కూడా వుంటుందని చెప్పారు. సంఘటిత నేరాలకు పాల్పడే ముఠాలతో రియో రాష్ట్రం ఉక్కిరి బిక్కిరి అవుతోందని, అందువల్ల అక్కడ భద్రతను సైన్యానికి అప్పగించినట్లు గత శుక్రవారం టెమర్ ప్రకటించి, డిక్రీపై సంతకాలు కూడా చేశారు. ఈ డిసెంబరు 31తో టెమర్ పదవీ కాలం ముగిసేవరకు సైనిక కార్యకలాపాలు కొనసాగుతాయి. దేశవ్యాప్తంగా ఈ నేరాల సంఖ్య పెరిగిపోతున్నందున వాటిని ఎదుర్కొనేందుకు కఠినమైన చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

సాంకేతిక రంగంలో చైనా దూకుడు

అమెరికాను అధిగమించి పురోగతి



లండన్ : అమెరికాతో పోలిస్తే చైనా సాంకేతిక పరిజ్ఞాన రంగం ఆశించిన దానికన్నా చాలా వేగంగా ఎదుగు తోంది. ఇ-కామర్స్, మొబైల్ చెల్లింపులు విషయంలో ఇప్పటికే అమెరికాను అధిగమించిందని ది ఎకనామిస్ట్ పత్రిక పేర్కొంది. ఉదాహరణకు, చైనా వెంచర్ కేపిటల్ నిధులు ఐదేళ్ళ క్రితం అమెరికా కన్నా 10శాతం తక్కువగా వున్నాయి. కానీ తాజా డేటాను పరిశీలిస్తే, చైనా నిధులు 80శాతం కన్నా ఎక్కువగా వున్నాయి. కృత్రిమ మేథస్సు రంగానికి సంబంధించి చైనా సమర్పించిన పత్రాల విషయంలో అమెరికాతో పోల్చుకుంటే దాదాపు 90శాతం వృద్ధి చెందాయి. అంటే శాస్త్ర విజ్ఞాన రంగంలో కూడా అమెరికాను అధిగమిస్తోందనడానికి ఇదొక సంకేతమని ఆ పత్రిక తన నివేదికలో పేర్కొంది. ఇక ఇ-కామర్స్ రంగాన్ని చూసినట్లైతే ఐదేళ్ళ క్రితమే అమెరికాతో పోటా పోటీగా చైనా ఇ-కామర్స్ లావాదేవీలు వున్నాయి. తాజా డేటా ప్రకారం, అమెరికా కన్నా 175శాతం ఎక్కువగా లావాదేవీలు జరుపుతోంది. చైనా మొబైల్ చెల్లింపులు గతేడాది అక్టోబరు నాటికి మొత్తంగా 81 ట్రిలియన్ల యువాన్లు (12.77 ట్రిలియన్ల అమెరికా డాలర్లు) వున్నాయి. ఇది ప్రపంచంలోనే అతిపెద్ద మొత్తమని చైనా పారిశ్రామిక, సమాచార సాంకేతిక పరిజ్ఞాన మంత్రిత్వ శాఖ తెలిపింది. 2016 సంవత్సరానికి జరిగిన మొత్తం మొబైల్ చెల్లింపులు 58.8 ట్రిలియన్ల యువాన్ల కన్నా ఇది చాలా ఎక్కువ అని పేర్కొంది. అయితే, ఇంతగా అభివృద్ధి, పురోగతి సాధించినప్పటికీ సాంకేతిక పరిజ్ఞాన రంగంలో చైనాకు కొన్ని బలహీనతలు వున్నాయని ఆ నివేదిక పేర్కొంది. చైనా సాంకేతిక రంగ కంపెనీల విలువ అమెరికా సాంకేతిక రంగ కంపెనీల విలువలో కేవలం మూడవ వంతు గానే వున్నాయి. సాపేక్షంగా చూసిన ట్లైతే విదేశాల్లో ఈ కంపెనీలు ఆర్జించే ఆదాయం చాలా తక్కువ అని తెలిపింది. అమెరికా తో సమానంగా సాంకేతిక రంగ స్థాయిని అందుకోవాలంటే చైనాకు ఇంకా 10నుండి 15ఏళ్ళ పడుతుందని ఆ నివేదిక పేర్కొంది.

జెయుడిపై చర్య తీసుకోవడానికి జంకుతున్న పాక్ ప్రధాని

ఇస్లామాబాద్ : హాఫీజ్ సయీద్ నేతృత్వంలోని జమాత్ ఉద్ దవా (జెయుడి), ఫలా ఇన్సానియత్ ఫౌండేషన్ (ఎఫ్ఐఎఫ్)లపై కఠిన చర్య తీసుకోవాలన్న నిర్ణయాన్ని పాకిస్తాన్ ప్రధాని షాహిద్ ఖాన్ అబ్బాసి మార్చుకున్నారు. ఇటువంటి చర్య ఏదైనా తీసుకుంటే రాజకీయ సంక్షోభం తలెత్తగలదని ఆయన ఆందోళన చెందుతున్నారని మీడియా వార్తలు తెలిపాయి. తీవ్రవాదులకు ఆశ్రయం ఇస్తోందంటూ పాకి



స్తాన్‌కు దాదాపు 200కోట్ల డాలర్ల భద్రతా సాయాన్ని అమెరికా నిలిపివేసిన నేపథ్యంలో తీవ్రవాద గ్రూపులపై చర్యలు తీసుకోవాలని పాక్‌పై ఒత్తిడి పెరుగుతోంది. ఈ రెండు తీవ్రవాద సంస్థలను నిషేధించాల్సి వుందని అబ్బాసీ పేర్కొన్నారు. అయితే వీటిపై ఈ తరుణంలో నిషేధపు వేటు పడితే గత నవంబరులో ఎదుర్కొన్న సంక్షోభం వంటిదే ఇప్పుడు కూడా ఎదుర్కోనాల్సి వస్తుందని హోం మంత్రి అషన్ ఇక్బాల్ అభిప్రాయపడుతున్నారని ఆ మీడియా వార్తలు తెలిపాయి. ఎటువంటి చర్యలు తీసుకోకపోతే త్వరలో జరగబోయే ఆర్థిక కార్యాచరణ బృందం (ఎఫ్ఎటిఎఫ్) సమావేశంలో పాకిస్తాన్‌పై చర్యలు తీసుకునే అవకాశం వుందని, తీవ్రవాదానికి సాయం చేసే దేశాల జాబితాలో పాక్‌ను పెట్టే ప్రమాద ముందని ప్రధాని సలహాదారు, ఇస్మాయిల్, విదేశాంగ కార్యదర్శి తెహమినాలు ప్రధానికి తెలియ చేశారు. దాంతో ఈ విషయంపై విచారించి, నిర్ణయం తీసుకోవడానికి ముగ్గురు సభ్యులతో ఒక కమిటీని అబ్బాసి ఏర్పాటు చేశారు.

ఇజ్రాయిల్ చర్యకు కెనడా ఖండన

ఒట్టావా : తమ దేశంలో నివసిస్తున్న సూడాన్, ఎరిత్రియా దేశాలకు చెందిన 37వేల మందికి పైగా శరణార్థులను వెనక్కి పంపించాలని లేదా జైళ్ళలో బంధించాలని ఇజ్రాయిల్ తీసుకున్న నిర్ణయాన్ని కెనడా ఖండించింది. మార్చి 1వ తేదీ నుండి ఈ నిర్ణయం అమలు చేయనున్నట్లు ఇజ్రాయిల్ ప్రకటించింది. సురక్షితమైన ఏదో ఒక ఆఫ్రికన్ దేశానికి వెళ్ళిపోవడానికి వారికి 60 రోజులు గడువు వుందని పేర్కొంటూ ఇజ్రాయిలీ అధికారులు నోటీసులు పంపిణీ చేశారు. ఇందుకోసం వారికి విమాన టిక్కెట్, కొంత సొమ్ము అందచేస్తామని తెలిపారు. అలా వెళ్ళని పక్షంలో నిరవధికంగా జైల్లో మగ్గాల్సి వుంటుందని హెచ్చరించారు. ఇలా మూకుమ్మడిగా ప్రజలను తరలించే విధానాలకు తాము మద్దతివ్వబోమని కెనడా పేర్కొంది. జెనీవా శరణార్థుల ఒప్పందంలో వీరి హక్కులు ఏమిటో పేర్కొన్నారని, ఆ ఒప్పందంపై ఇజ్రాయిల్ కూడా సంతకాలు చేసిందని కెనడా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి వ్యాఖ్యానించారు.

చెత్త కుప్పకూలి 17 మంది మృతి

మొజాంబిక్‌లో దారుణం

మపుటో : మొజాంబిక్ రాజధాని మపుటో నగరంలో సోమవారం నుండి కురుస్తున్న భారీ వర్షాలకు నగర శివార్లలో వున్న ఒక చెత్తకుప్ప కుప్పకూలిన ఘటనలో కనీసం 17 మంది మరణించారని, పలువురు గాయపడ్డారని అధికారులు చెప్పారు. సోమవారం రాత్రి ఈ ప్రమాదం జరిగిన సమయంలో ఈ పరిసర ప్రాంతాలలో నివశించే వారంతా నిద్రలో వున్నారని, భారీ వర్షాలతో కుంగిన చెత్తకుప్ప పక్కనే వున్న ఇళ్లపై కూలిపోవటంత వారంతా తమ ఇళ్లలోనే సజీవ సమాధి అయ్యారని తెలుస్తోంది. సమాచారం తెలుసుకున్న అధికారులు మంగళవారం ఉదయం నుండి అక్కడ సహాయ కార్యక్రమాలు ప్రారంభించారు. అగ్నిమాపక సిబ్బంది శిధిలాల్లో చిక్కుకున్న వారితో పాటు మృతదేహాల కోసం గాలింపు ప్రారంభించారు. భవిష్యత్తులో ఇటువంటి ప్రమాదాలు జరగకుండా తగిన చర్యలు తీసుకునే అంశంపై చర్చించేందుకు అధికారయంత్రాంగం మంగళవారం భేటీ అవుతోందని మపుటో సిటీ గవర్నర్ యోలాండా సించురా చెప్పారు. ఈ దుర్ఘటనలో ఇళ్లు కోల్పోయిన వారిని గుర్తించి వారికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయనున్నట్లు ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించిందని ఆమె వివరించారు. ఈ దుర్ఘటన బారిన పడిన కుటుంబాల సంఖ్య ఇంకా ఖచ్చితంగా తెలలేదన్నారు. శిధిలాలను తొలగించటంలో అధికారులు, అగ్నిమాపక సిబ్బందికి సహకరిస్తున్న వారికి ఆమె కృతజ్ఞతలు తెలియచేశారు.

నగరంలో ఇళ్ల మధ్యలో పురాతన కాలం నుండి వుంటున్న ఈ చెత్త డంపింగ్ యార్డ్‌ను మూసివేసే అంశంపై నగర యంత్రాంగం చర్చిస్తోందని ఆమె చెప్పారు. ఈ యార్డ్ చుట్టు పక్కల నివశించే వారిలో అధికశాతం మంది మపుటో నగ రంలోని ఇతర ప్రాంతాలలో పునరావాసం పొందారన్నారు.

మొదటి పేజీ తరువాయి

కుల వృత్తులపై చిన్నచూపు

కేవలం 97 వేల మందికి రూ.1,170 కోట్లు మాత్రమే విడుదలయ్యాయి. ఈ విడుదల భౌతిక లక్ష్యంలో 44.56 శాతం కాగా, ఆర్థిక లక్ష్యంలో 33.87 శాతంగా మాత్రమే ఉంది. కార్పొరేషన్ల వారీగా ఆర్థిక లక్ష్య సాధనను పరిశీలిస్తే ఎస్టీ కార్పొరేషన్‌లో 20 శాతం, ఎస్సీ కార్పొరేషన్‌లో 34 శాతం, బిసి కార్పొరేషన్‌లో 43 శాతం, మైనార్టీ ఆర్థిక సంస్థ ద్వారా 24 శాతం, క్రిస్టియన్ మైనార్టీ సంస్థ ద్వారా 25 శాతం, కాపు కార్పొరేషన్ ద్వారా 45 శాతం మాత్రమే విడుదల చేశారు. మిగిలిన చిన్న చిన్న కుల, వృత్తి పరమైన కార్పొరేషన్ల ద్వారా అందించిన ఆర్థిక సహాయం నామమాత్రంగానే కనిపిస్తోంది. ఇక ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 2.67 లక్షల మందికి రూ. 5680 కోట్లు ఇవ్వాలని నిర్ణయించగా, అందులో 2.38 లక్షల మందిని గుర్తించి రూ. 3345 కోట్లు ఖరారు చేశారు. కానీ క్షేత్ర స్థాయి కార్యాచరణ మాత్రం 36,198 మందికి రూ. 528 కోట్ల విడుదల వరకే పరిమితమైంది. భౌతికంగా ఇది 13.56, ఆర్థికంగా కేవలం 9.31 శాతంగానే కనిపిస్తోంది. దీంట్లో కార్పొరేషన్ల వారీగా చూస్తే ఆర్థికంగా వెనుకబడిన వారికి ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. ఎస్టీ కార్పొరేషన్ ద్వారా తొమ్మిది శాతం, ఎస్సీ కార్పొరేషన్ ద్వారా 11 శాతం, బిసి కార్పొరేషన్ ద్వారా 15 శాతం, మైనార్టీ ఆర్థిక సంస్థ ద్వారా నాలుగు శాతం, కాపు సంక్షేమ కార్పొరేషన్ ద్వారా 5.59 శాతం మాత్రమే ఆర్థిక లక్ష్యాన్ని సాధించారు. మరికొన్ని చిన్న చిన్న కార్పొరేషన్లలో కనీసం ఒక శాతం కూడా లక్ష్య సాధన లేకపోవడం గమనార్హం. తరచూ జరిగే రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల సమావేశాల్లో ఈ లక్ష్యాల సాధన అంశం ఎప్పటికప్పుడు చర్చ వచ్చింది. ఆర్థిక సాయంపై చర్యలు తీసుకుని, లక్ష్య సాధనకు సహకరించాలని బ్యాంకర్లకు ప్రభుత్వం సూచించినా ఆశించిన ఫలితాలు మాత్రం కనిపించడం లేదు. దీంతో పేదల ఆశలు అడి ఆశలుగానే మిగిలిపోయాయని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

బిజెపికి కౌంటర్ ఎలా?

సహచర మంత్రులు కూడా ఇదే భావాన్ని వ్యక్తం చేయడం, బిజెపితో జగన్‌కు రహస్య ఒప్పందం ఉందన్న విమర్శలు చేస్తుండడంతో రెండు పార్టీల మధ్య మైత్రి సన్నగిల్లిపోతోంది. ఇదే అంశంపై మంగళవారం పార్టీ కీలక నేతలతో చర్చించిన చంద్రబాబు ఎటూ తేల్చుకోలేకపోయారని ఆయన సన్నిహితులు చెబుతున్నారు. అయితే అన్ని పార్టీలు ఏకమవుతున్న తరుణంలో ఇక వెనుకడుగు వేస్తే ప్రజల నుంచి కూడా తెలుగుదేశంపై వ్యతిరేకత పెరుగుతుందని, ఇది 2019 ఎన్నికల్లో నష్టం కలిగిస్తుందని ఆయన సన్నిహితుల వద్ద వ్యాఖ్యానించినట్లు తెలిసింది. అందువల్ల శుక్రవారం జరిగే భేటీలో అధికారులు ఎలా వ్యవహరించాలన్న దానిపై సిఎం దృష్టి సారిస్తున్నారు.

అన్ని రాష్ట్రాలకు సమానంగా వచ్చే సాధారణ నిధులపై ఎక్కువ చర్చ లేకుండా, విభజన రాష్ట్రానికి అదనంగా ఇచ్చిన నిధులు ఏమిటి, విభజన చట్టంలోని హామీలను ఎంతవరకు అమలు చేస్తున్నారన్న దానిపైనే చర్చించాలని అధికారులకు చంద్రబాబు సూచిస్తున్నారు. ఈ కోణంలోనే సిఎస్ కూడా గణాంకాలను సిద్ధం చేసుకుంటున్నారు. సమావేశంలో రాజకీయంగా మాట్లాడే పరిస్థితి అధికారులకు ఉండకపోయినా, రాష్ట్రంలో ఉద్వేగపూరిత పరిస్థితులను కేంద్రానికి వివరించాలని, ఇచ్చిన హామీలపరంగా న్యాయం చేయాలని గట్టిగా డిమాండ్ చేయాలని భావిస్తున్నారు.

నేటి నుంచి టెట్ పరీక్షలు

విడుదల చేస్తారు. పరీక్ష రాస్తున్న అంధులకు మాత్రమే అదనంగా 50 నిమిషాల అవకాశాన్ని విద్యాశాఖ కల్పించింది. డిఎస్సీకి టెట్‌లో 20శాతం వెయిటేజ్ ఉంటుంది. పరీక్షా కేంద్రాలు, సబ్జెక్టుల మార్పుల్లో జరిగిన పొరపాట్లను సరిచేశామని మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం లాహాస్పిన్ హోటల్‌లో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. టెట్ ఫలితాల విడుదల తర్వాత డిఎస్‌సి నిర్వహిస్తామన్నారు. డిఎస్‌సి బాధ్యతను ఈసారి ఎపిపిఎస్‌సికి అప్పగించామన్నారు. 2016 డిఎడ్ బ్యాచ్‌కు టెట్‌లో అవకాశం ఇచ్చామని, డిఎస్‌సిలో కూడా వారికి అవకాశం కల్పిస్తామన్నారు. వివిధ కళాశాలలు, యూనివర్సిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు లెక్టరర్లకు అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకాల్లో ప్రాధాన్యత ఇచ్చే విషయంపై విశ్రాంత విసిలతో ఓ కమిటీని నియమించామని తెలిపారు. ఈ కమిటీ నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్రంలోని వివిధ యూనివర్సిటీల అభివృద్ధికి రూ.189.55 కోట్లు మంజూరు చేశామన్నారు. రాజమహేంద్రవరంలోని నన్నయ యూనివర్శిటీకి రూ.45.28 కోట్లు విడుదల చేశామని చెప్పారు.

చర్చలు విఫలం.. సమ్మె యథాతథం

(మొదటిపేజీ తరువాయి)

కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని జెఎసి కన్వీనర్ పిలుపునిచ్చారు. ధర్నా చౌక్‌లోని నిరసన శిబిరంలో ఉన్న కార్మికులను అక్కడ నుంచి పంపే సమయంలో మంగళవారం రాత్రి పోలీసులు దురుసుగా ప్రవర్తించడంపై కార్మికులు అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. సిఆర్‌పిఎఫ్ బలగాలు కార్మికులు అక్కడి నుంచి ఖాళీ చేసే విషయంలో దురుసుగా వ్యవహరించారు.

సమ్మెలో కార్మికులు...

విద్యుత్తు కాంట్రాక్టు కార్మికులు మంగళవారం ఉదయం 6 గంటల నుంచి సమ్మెలోకి వెళ్లారు. దీంతో సబ్‌స్టేషన్‌ల నిర్వహణలో సమస్యలు ఎదురయ్యాయి. ఇబ్రహీంపట్నం విటిపిఎస్, విజయవాడలోని విద్యుత్తు సౌధలలో వేలాది మంది కాంట్రాక్టు కార్మికులు విధులకు గైర్హాజరడంతో కార్యాలయంలో పనులకు ఆటంకాలు ఏర్పడ్డాయి. జిల్లాల వారీగా నేతలు సమ్మెను మరింత ఉధృతం చేయనున్నారు.

జెఎసి లక్ష్యం నెరవేరే వరకూ ఉద్యమం: కన్వీనర్ బాలకాశీ

విద్యుత్తు కాంట్రాక్టు కార్మికుల ఐక్య వేదిక (జెఎసి) ఏర్పాటు లక్ష్యం నెరవేరే వరకూ ఉద్యమాన్ని ఆపేది లేదని జెఎసి కన్వీనర్ బాలకాశీ తెలిపారు. విజయవాడలోని ధర్నా చౌక్‌లో విద్యుత్తు కాంట్రాక్టు కార్మికుల నిరసన దీక్ష రెండవ రోజైన మంగళవారం కొనసాగింది. ఈ సందర్భంగా కార్మికులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ విద్యుత్తు యాజమాన్యం సోమవారం జరిపిన చర్చల్లో సమస్యలు ఎప్పుడు పరిష్కరిస్తారనే విషయంపై స్పష్టమైన హామీ ఇవ్వకపోవడంతో చర్చలు విఫలమైనట్లు తెలిపారు. విద్యుత్తు కాంట్రాక్టు కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కారం కాకపోతే సమ్మెను మరింత ఉధృతం చేస్తామన్నారు. ఆంధ్రప్రదేశ్ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరావమ్మ మాట్లాడుతూ ప్రభుత్వాలు పెద్దలు కార్మికుల పొట్టగొట్టి వారి పొట్టలు నింపుకుంటున్నారని చెప్పారు. సమస్యల పరిష్కారానికి పోరాటాలే శరణ్యమన్నారు. విద్యుత్తు కాంట్రాక్టు కార్మికుల ఉద్యమానికి యూనియన్ పూర్తి మద్దత్తు ఉంటుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జెఎసి రాష్ట్ర నాయకులు, అన్ని జిల్లాల నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సిఎంకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి మధు లేఖ

విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి మధు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు మంగళవారం ఆయన లేఖ రాశారు.

డిపార్టుమెంటే నేరుగా జీతాలివ్వాలని, సమాన పనికి సమాన వేతనం, ప్రమాదవశాత్తు మరణించిన కార్మికులకు ఎక్స్‌గ్రేషియో ఇవ్వాలని కాంట్రాక్టు కార్మికులు రెండు దశాబ్దాలుగా కోరుతున్నారని తెలిపారు. నేటికీ అవి అపరిష్కృతంగానే ఉన్నాయన్నారు. విద్యుత్ సరఫరాలో కింది స్థాయిలో కీలకపాత్ర పోషిస్తున్న కాంట్రాక్టు కార్మికులు చాలీ చాలని జీతాలతో సమస్యలు పరిష్కారం కాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికులతో చర్చించి సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం చొరవ తీసుకోవాలని కోరారు. ఉమ్మడి రాష్ట్రంలో వీరికి న్యాయం చేస్తామని ప్రభుత్వాలు హామీలు ఇచ్చినప్పటికీ అమలు కాలేదని తెలిపారు. పక్కనున్న తెలంగాణ రాష్ట్రంలో కాంట్రాక్టు కార్మికులను రెగ్యులరైజ్ చేయడంతోపాటు జీతం పెంపుదల వంటివి అమలవుతున్నా, రాష్ట్రంలో ఇంతవరకు అమలు చేసేందుకు ఎటువంటి చర్యలూ తీసుకోలేదని పేర్కొన్నారు. కమిటీ పేరుతో కాలయాపన చేయకుండా తక్షణం విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు.

నేడు కమల్ పార్టీ ప్రారంభం

(మొదటిపేజీ తరువాయి)

ఎంకె స్టాలిన్‌ను కూడా ఆయన కలుసుకున్నారు. కమల్‌హాసన్ బుధవారం పలు వరుస కార్యక్రమాలను తలపెట్టారు. రామేశ్వరంలో మాజీ రాష్ట్రపతి ఎపిజె అబ్దుల్ కలాం నివాసాన్ని సందర్శించడంతో కమల్‌హాసన్ కార్యక్రమాలు ప్రారంభమవుతాయి. అనంతరం సాయంత్రం మధురైలో పార్టీ పేరును ప్రకటిస్తారు. ఆ తరువాత ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు రాష్ట్ర వ్యాప్తంగా పర్యటిస్తారు. కమల్‌హాసన్ రాజకీయ పార్టీ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ హాజరు కానున్నారు.

బాబు నోట హోదా మాట

(మొదటిపేజీ తరువాయి)

ప్రయత్నించారు. అయితే, రోజులు గడుస్తున్నా ప్రజాగ్రహం ఏమాత్రం తగ్గడం లేదని స్పష్టమైంది. హోదా, విభజన హామీల అమలు సాధనే లక్ష్యంగా వివిధ పార్టీలు, సంఘాలు ఇప్పటికే ప్రకటించిన కార్యక్రమాలకు అన్ని జిల్లాలో సానుకూల స్పందన వ్యక్తమవుతోందంటూ నిఘా వర్గాలు తాజాగా నివేదించాయి. మరోవైపు తెలుగుదేశం పార్టీ కార్యకర్తల నుండి ఒత్తిడి వచ్చినట్లు సమాచారం. కొందరు రాష్ట్ర మంత్రులు ఇదే విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి కూడా తీసుకువెళ్లినట్లు తెలిసింది. ఒకరిద్దరు మంత్రులు బిజెపితో తెగతెంపులు చేసుకోవడమే మేలన్న అభిప్రాయాన్ని కూడా వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలోనే చంద్రబాబునాయుడి స్వరం కూడా మారుతున్నట్లు సమాచారం. పశ్చిమగోదావరి జిల్లాలో సోమవారం జరిగిన సభలో 'కాంగ్రెస్ మాదిరే బిజెపి కూడా మోసం చేసింది. పెనం మీద నుండి పొయ్యిలో పడ్డాం' అని వ్యాఖ్యానించిన ఆయన తాజాగా ప్రత్యేకహోదా ఇచ్చి తీరాల్సిందేనని డిమాండ్ చేశారు.

అఖిలపక్షం కాదు సంఘాల భేటీ

(మొదటిపేజీ తరువాయి)

టిడిపి సమన్వయ కమిటీ సమావేశంలో మాట్లాడిన ఆయన అఖిలపక్ష సమావేశం నిర్వహించనున్నారంటూ వచ్చిన వార్తలను ప్రస్తావించారు. 'రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించేది అఖిల పక్ష సమావేశం కాదు. అఖిల సంఘాల సమావేశం. దీనికి పార్టీలూ హాజరుకావచ్చు. ప్రజాసంఘాలూ రావచ్చు.' అని ఆయన అన్నారు. అఖిల సంఘాల సమావేశం ద్వారా విస్తృత ప్రజాభిప్రాయాన్ని తెలుసుకునే వీలుందని బాబు చెప్పారు. అసెంబ్లీలో టిడిపితోపాటుగా ఒక పార్టీయే ఉందని, మరోపార్టీ అసెంబ్లీకి రావడం లేదన్నారు. మిగిలిన పార్టీలకు ప్రాతినిధ్యం లేకపోవడం వల్లే అఖిల సంఘాల సమావేశం నిర్వహించాలని నిర్ణయించిట్లు చెప్పారు. అవిశ్వాస తీర్మానంతో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వాన్ని ఏం చేయలేమని అన్నారు. కేంద్రం మన ఓట్లపై ఆధారపడి ఉంటే ఒత్తిడి తెచ్చేవాళ్లమని, బిజెపికి పూర్తి ఆధిక్యత ఉంది కాబట్టే మన ఒత్తిడికి తగ్గ ఫలితం పొందలేకపోతున్నామన్నారు. అవిశ్వాసం పెట్టేందుకు 54 మంది ఎంపీలు కావాలని, అయినా చర్చ ఒక్కరోజుతో ముగిసిపోతుందని చెప్పారు. 'విభజన చట్టం అమలును సమీక్షించాలని, అప్పటి ప్రధాని ఇచ్చిన హామీల అమలుపైనా, కేంద్ర ఆర్థిక మంత్రి ప్రకటించిన ప్రత్యేక ఆర్థిక సాయంపైనా ఒక్క రోజంతా చర్చ జరగాలని బడ్జెట్ సమావేశాల మొదటి రోజునుండి టిడిపి ఎంపీలు డిమాండ్ చేస్తున్నారు. అవిశ్వాసం వల్ల సాధించేది కూడా అదే' అని ఆయన అన్నారు. జాతీయ స్థాయిలో అన్ని పార్టీల మద్దతు కూడగడుతూ కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని చెప్పారు. అన్ని రాష్ట్రాలకు ఇచ్చినట్లే ఆంధ్రప్రదేశ్‌కు కేంద్రం ఇచ్చిందని, దీనిపై రాష్ట్ర బిజెపి నాయకులు ఢిల్లీ వెళ్లి ప్రశ్నించకుండా అన్ని రాష్ట్రాలతోపాటు ఇచ్చిన నిధుల లెక్కలతో రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించడమేమిటన్నారు. ఇక్కడ తమను విమర్శించే పార్టీలు వారి జాతీయ కార్యవర్గాలపై ఎందుకు ఒత్తిడి తీసుకురాలేకపోతున్నారని ప్రశ్నించారు. వాళ్ల ఎంపీలతో ఎపికి మద్దతుగా పార్లమెంటులో ఎందుకు మాట్లాడించలేకపోతున్నారన్నారు. జాతీయస్థాయిలో ఆయా పార్టీలు రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై ఎందుకు గొంతెత్తడం లేదన్నారు. 29 రాష్ట్రాలకు జరిగిన అన్యాయంపై అవిశ్వాసం పెడతామని రాహుల్ గాంధీ అంటున్నారని, దానివల్ల ఎపికి ఏవిధంగా ప్రయోజనం కలుగుతుందన్నారు.

లబ్ధి పొందడం కోసమే వైసిపి డ్రామాలు

విభజన చట్టంలోని 18 అంశాలను, మన్మోహన్‌సింగ్ ఇచ్చిన 6 హామీలలో 5 వదిలేసి హోదాను మాత్రమే సెంటిమెంట్‌గా పెంచి లబ్ది పొందాలని వైసిపి ప్రయత్నిస్తోందని విమర్శించారు. రోజుకోమాట మాట్లాడుతూ ఎంపీలతో రాజీనామాల డ్రామాలు ఆడుతోందన్నారు. ఇప్పుడు రాజీనామా చేస్తే ఉప ఎన్నికలు రావనే ఉద్దేశంతోనే ప్లేటు మార్చిందన్నారు. ఇప్పుడు మళ్లీ అవిశ్వాసం అంటూ నాటకాలు అడుతోందన్నారు. అవిశ్వాసం అనేది ఆఖరి ఆయుధమని, దానికీ టిడిపి సిద్ధం కావడంతో మళ్లీ వెనక్కి తగ్గి తమతో పెట్టించి వాళ్లు తప్పుకోవాలని చూస్తున్నారని విమర్శించారు.

ఆడిటర్లదే తప్పు!

(మొదటిపేజీ తరువాయి)

బ్యాంకు పేరును గాని, స్కామ్‌కు పాల్పడిన నీరవ్ మోడీ పేరును గాని జైట్లీ ప్రస్తావించలేదు. నేరస్తులను గుర్తించడంలో బ్యాంకు మేనేజ్‌మెంట్ విఫలమైందన్నారు. బ్యాంకులో జరుగుతున్న అవకతవకలను గుర్తించడంలో ఆడిటర్లు విఫలమయ్యారని పేర్కొన్నారు. ఈ తరహా మోసాలను గుర్తించేందుకు అవసరమైన వ్యవస్థను ఏర్పాటు చేయాలని పర్యవేక్షణా సంస్థలను కోరారు. ఇటువంటి మోసపూరిత కేసులను మొగ్గలోనే తుంచివేస్తే పదేపదే జరగవన్నారు. ప్రముఖ నగల వ్యాపారి నీరవ్ మోడి పంజాబ్ నేషనల్ బ్యాంకుకు చెందిన ఒక శాఖ నుండి మోసపూరిత లెటర్స్ ఆఫ్ అండర్‌టేకింగ్‌ల ద్వారా విదేశాలలో రుణాలు పొందాడు. ఈ స్కామ్‌ను 1.77 బిలియన్ డాలర్లుగా పంజాబ్ నేషనల్ బ్యాంక్ గుర్తించింది. ఇతర భారతీయ బ్యాంకుల నుండి కూడా ఆయన రుణాలు పొందారు. 2011లో ప్రారంభమైన ఈ స్కామ్‌ను ఈ ఏడాది జనవరి మూడో వారంలో గుర్తించారు. పంజాబ్ నేషనల్ బ్యాంక్ అధికారులు సంబంధిత ఏజెన్సీల లకు నివేదిక ఇచ్చిన తరువాత దీనిని గుర్తించడం గమనార్హం.

జల వివాదాలపై ఒకే ట్రిబ్యునల్

(మొదటిపేజీ తరువాయి)

చేయగా, కాళేశ్వరం, తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకాలపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ సదస్సులో దక్షిణాది రాష్ట్రాల జలవివాదాల పరిష్కారానికి రోడ్‌మ్యాప్‌పై కూడా చర్చించారు. జల వివాదాలకు అంతం పలకడం, కోర్టుల వెలుపల పరిష్కార మార్గాలపై ఈ సమావేశంలో చర్చ సాగింది. ఎపి తరుపున ప్రధానంగా మూడు అంశాలను ఎజెండాలో చేర్చి చర్చించారు. కృష్ణా- గోదావరి బేసిన్లలోని ప్రాజెక్టులన్నీ తక్షణమే ఆయా బోర్డుల పరిధిలోకి తీసుకురావాలనేది ప్రధాన అంశంగా చేర్చింది. తెలంగాణ ప్రభుత్వం నిర్మిస్తున్న ప్రాజెక్టులకు కేంద్ర జల వనరుల సంఘం అనుమతి లేదనే విషయాన్ని ఎజెండాలో ప్రత్యేకంగా పేర్కొంది. దీంతో పాటు ప్రాజెక్టుల వారీగా జరిపిన నీటి కేటాయింపులను వాడుకునేందుకు వీలుగా అనుమతులు ఇవ్వాలని కోరింది. ఇదే విషయాన్నిఇరిగేషన్ సలహాదారు రామకృష్ణ ప్రధానంగా ప్రస్తావించినట్లు తెలిసింది. తెలంగాణ ప్రభుత్వం కష్ణా బేసిన్‌లో అనుమతి లేకుండా భారీ ప్రాజెక్టులను నిర్మిస్తున్నట్టు ఆరోపించినట్లు సమాచారం. దీనికి అధికారులు మాట్లాడుతూ కృష్ణా నీటిలో వినియోగించుకుంటున్న 299 టీఎంసీలతో పాటు అదనంగా మరో 260 టీఎంసీలు వాడుకునేందుకు తెలంగాణ ప్రయత్నిస్తున్నట్టు ఆరోపించారు. ఆర్డీఎస్ ఆనకట్ట ఎత్తు పెంచే పత్రయత్నం చేస్తున్నారని, దీనివల్ల సుంకేశల ఆయకట్టుకు నష్టం వాటిల్లుతుందంటూ అధికారులు అభ్యంతరం వ్యక్తం చేసినట్లు తెలిసింది. దీంతో నదీ జలాల పంపిణీ విషయంలోనూ 'రూల్ ఆఫ్ లా " అమలు చేయాలని ఏపీ, తెలంగాణ అధికారులు సూచించడంతో..కేంద్రమంత్రి అర్జున్ రామ్ మేఘవాల్ కూడా ఏకీభవించారు.


దీపికా పదుకొనే

‘పద్మావత్’కు 500 కోట్లు


- ఈనెల 24న విజయోత్సవం
- అదే రోజు దర్శకుడు భన్సాలీ జన్మదినం

‘పద్మావత్’... 2017 నుంచి 2018...అంటే ఇప్పటి వరకూ భారతదేశ చిత్రపరిశ్రమలో ఎక్కువ చర్చ జరిగిందీ ఈ చిత్రం గురించే. బాక్సాఫీస్ వద్ద ఇప్పటి వరకూ 2018 సంవత్సరానికి గానూ అత్యధిక వసూళ్ల సాధించిన చిత్రమూ ఇదే. దేశం వ్యాప్తం రూ.276.50 కోట్లు కలెక్ట్ చేస్తే...ప్రపంచ వ్యాపితంగా రూ.500 కోట్లను కొల్లగొట్టిందీ చిత్రం. అసలు ఈ సినిమా విడుదలవుతుందో కాదో తెలియని పరిస్థితి నుంచి నేటి బాక్సాఫీస్ వద్ద రికార్డు సృష్టించే స్థాయికి తీసుకొచ్చిందెవరు? అని అంటే సంజయ్ లీలా భన్సాలీయే అని చెప్పాలి. సినిమా షూటింగ్ రాజస్థాన్‌లో ప్రారంభినప్పుడు సెట్‌పైనా, సిబ్బందిపైనా రాజ్‌పుత్ కర్ణిసేన భౌతిక దాడులకు పాల్పడింది. మొదట్లోనే సినిమా నిర్మాణం కాకుండా చేయాలని చూసింది. ఆ దాడిలో భన్సాలీ గాయపడినా వెనకకు తగ్గకుండా మళ్లీ షూటింగ్ మొదలెట్టారు. మళ్లీ దాడి చేశారు...ఇలా ఒక పక్కదాడులను ఎదుర్కొంటూనే మరో పక్క సినిమాను పూర్తి చేశారు. దీపావళికి ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని భావించారు. కర్ణిసేన ఆందోళనల వల్ల దాన్ని డిసెంబర్‌కి తర్వాత జనవరి ఒకటో తేదీకి వాయిదా వేశారు. కర్ణిసేన చేసేవన్నీ ఆరోపణలేనని, రాజపుత్రుల గౌరవాన్ని పెంచే చిత్రంగా తీశామని చెప్పినా రాజ్‌పుత్‌లు ఆగకపోవడంతో పోరాటం చేసి చివరకు జనవరి 25వ తేదీన ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చారు. సినిమా విడుదలయ్యాక తాము చేసిందీ తప్పేనని, రాజపుత్రుల గౌరవాన్ని పెంచిందీ చిత్రమని కర్ణిసేన అభిప్రాయ పడింది. ఈ చిత్రం విడుదల దగ్గర నుంచి ఇప్పటి వరకూ వసూళ్ల పరంగా దూసుకుపోతుంది. ‘పద్మావత్’గా దీపికా పదుకొనే, అల్లావుద్దీన్ ఖిల్జీగా రణవీర్ సింగ్, చిత్తోరు ప్రభువుగా సాహిద్ కపూర్ పాత్రలకు మంచి మార్కులు పడ్డాయి.

ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా 25 రోజులకు రూ.500 కోట్లు కురిపించింది. దేశవ్యాప్తంగా హిందీ, తమిళ్, తెలుగు భాషల్లో కలిపి రూ.276.50 కోట్లు వసూలు చేసింది. దీంతో ఈ ఏడాది విడుదలైన చిత్రాల్లో తక్కువ రోజుల్లో అత్యధిక కలెక్షన్లు వసూలు చేసిన చిత్రంగా ‘పద్మావత్’ నిలవడం విశేషం. దేశంలో మొదటి వారం 162.50కోట్లు, రెండో వారం 69.50 కోట్లు, మూడో వారం 31.75కోట్లు, నాలుగో వారం 8.75 మొత్తంగా 276.50 కోట్లు వసూలు చేసింది.

ఇంత ఎక్కువ మొత్తంలో కలెక్షన్లు వస్తున్నా ఇప్పటివరకూ సక్సెస్ మీట్ ఏర్పాటు చేయలేదు. ఈనెల 24వ తేదీన విజయోత్సవ వేడుక నిర్వహించాలని నిర్ణయించింది ఈ చిత్రబృందం. అదే రోజు భన్సాలీ జన్మదినం కావడంతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. విదేశాల్లో ఎక్కడైనా సముద్ర తీరంలో ఈవెంట్‌ను నిర్వహించాలని ఆలోచన చేస్తున్నారు.

యుద్ధ భూమి


‘యుద్ధ భూమి’ చిత్రంలో మోహన్ లాల్, అల్లు శిరీష్

భారత్-పాకిస్తాన్ సరిహద్దుల్లో 1971లో జరిగిన యదార్థ సంఘటనల ఆధారంగా మలయాళంలో తెరకెక్కిన చిత్రం ‘1971 బియాండ్ బార్డర్స్’. మేజర్ రవి దర్శకత్వం వహించారు. మోహన్‌లాల్ కీలకపాత్రలో నటించారు. గత ఏడాది మలయాళంలో విడుదలై ఘన విజయం సాధించింది. ఈ చిత్రాన్ని జాష్ రాజ్ ప్రొడక్షన్స్, శ్రీ లక్ష్మీ జ్యోతి క్రియేషన్స్ బేనర్స్‌పై ‘యుద్ధం భూమి’ పేరుతో ఏఎన్ బాలాజీ తెలుగులోకి అనువదిస్తున్నారు. ప్రస్తుతం అల్లు శిరీష్ డబ్బింగ్ చెబుతున్నారు. త్వరలో డబ్బింగ్ కార్యక్రమాలు పూర్తి చేసి ఈ నెలాఖరులో ఆడియోను, మార్చిలో సినిమాను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.

నిర్మాత బాలాజీ మాట్లాడుతూ ‘ఈ చిత్ర దర్శకుడు మేజర్ రవి నిజ జీవితంలో కూడా మేజర్ కావడం విశేషం. ఈయన 1981లో ఆర్మీలో చేరి అనేక కీలక ఆపరేషన్స్‌ని లీడ్ చేశారు. 2002లో మొదటిసారిగా ‘పునర్ జని’ అనే మలయాళ చిత్రానికి దర్శకత్వం వహించారు. అప్పటి నుండి ఆయన తనకున్న దేశభక్తిని నిరూపిస్తూ ఆర్మీలో పని చేసే సమయంలో జరిగిన ఆపరేషన్స్‌కి సంబంధించిన కొన్ని యదార్థ సంఘటనల ఆధారంగా ఎన్నో చిత్రాలకు దర్శకత్వం వహించారు. రవి ప్రతి సినిమా ఆర్మీ బ్యాక్ డ్రాప్‌లో ఉంటూ యువతలో దేశభక్తిని కలిగిస్తూ విజయం సాధించినవే. 1971లో భారత్ -పాక్ సరిహద్దులో జరిగే యుద్ధ నేపథ్యంలో ఎమోషనల్ డ్రామాగా రూపొందిందీ సినిమా.

ఊళ్లో పెళ్లికి కుక్కల హడావుడి


రాజేంద్ర ప్రసాద్, సాక్షి చౌదరి

రాజేంద్రప్రసాద్ ప్రధాన పాత్రలో ‘ఊ.పె.కు.హ’ అనే చిత్రం రూపొందుతోంది. ‘ఊళ్ళో పెళ్ళికి కుక్కల హడావుడి’ అనేది కాప్షన్. సాక్షి చౌదరి కథానాయిక. ‘నిధి’ ప్రసాద్ దర్శకత్వం వహిస్తున్నారు. జేబీ క్రియేషన్స్ పతాకంపై భాగ్యలక్ష్మి నిర్మిస్తున్నారు. ఈ సినిమా ట్రైలర్‌ను సోమవారం హైదరాబాద్‌లో రాజేంద్రప్రసాద్ విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ “ఇప్పుడున్న నిర్మాతల ఛాయలు లేకుండా విక్రమ్ సినిమాను బాగా తీశాడు. అతను దర్శకుడు ‘నిధి’ ప్రసాద్ మేనత్త కొడుకు. సాధారణంగా సినిమాలు తీసేవాళ్ళలో రెండు రకాలు ఉంటారు. కడుపులో నీళ్ల కదలకుండా హ్యాపీగా తీసేవాళ్ళు ఒకరు. ఎన్ని కష్టాలైనా పడి ప్రేక్షకులకు వినోదం ఇవ్వాలనుకునేవాళ్ళు ఇంకొకరు. ‘నిధి’ ప్రసాద్ తనను తాను కాంప్లికేటెడ్ చేసుకుని ప్రేక్షకులకు వినోదం ఇవ్వాలనుకుంటాడు. తనతో షూటింగ్ అంటే కష్టం. సినిమా అంతా బోలెడు మంది ఆర్టిస్టులున్నారు. తనతో షూటింగ్ జరిగినంత సేపూ తిట్టుకుని, విడుదల తర్వాత హ్యాపీగా ఫీలయ్యే వాళ్లలో నేనూ ఒకణ్ణి. అంతకు ముందు అతనితో ‘అందరూ దొంగలే’, ‘మైఖేల్ మదన్ కామరాజు’, ‘భాగ్యలక్ష్మి బంపర్ డ్రా’ చేశా. ఈ చిత్రం కామెడీ ఆఫ్ ఎర్రర్స్‌తో రూపొందింది. నేను భారీ బడ్జెట్ సినిమాలు చాలా చేశా. బడ్జెట్ కన్నా ఇంతమంది ఆర్టిస్టులతో సినిమా తీయడం చాలా కష్టం. ప్రేక్షకులు హాయిగా నవ్వుకునే సినిమా” అని తెలిపారు.

అమెరికాలో ‘గూఢచారి’

అడివి శేష్ కథానాయకుడిగా తాజాగా నటిస్తున్న చిత్రం ‘గూఢచారి’. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నేతృత్వంలో అభిషేక్ పిక్చర్స్, విస్టా డ్రీమ్ మర్చంట్స్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నారు. శశికిరణ్ తిక్క దర్శకుడు. అడివి శేష్ ఈ చిత్రానికి కథ సమకూర్చారు. మిస్ ఇండియా శోభిత ధూళిపాళ్ళ కథానాయికగా నటిస్తోంది. ఈ చిత్రం తాజా షెడ్యూల్ అమెరికాలో జరుగుతోంది. నిర్మాతలు అభిషేక్ నామా, టీజీ విశ్వప్రసాద్, అభిషేక్ అగర్వాల్ మాట్లాడుతూ ‘ఇప్పటివరకూ తెలుగు తెరపై చూడని సరికొత్త కాన్సెప్ట్. అడివి శేష్ ఈ చిత్రంలో ఒక స్పై పాత్రలో కనిపించనున్నారు. విడుదలై ఫస్ట్ లుక్ పోస్టర్‌కి మంచి రెస్పాన్స్ వచ్చింది. ప్రస్తుతం అమెరికాలో కీలక సన్నివేశాల చిత్రీకరణ జరుగుతోంది. ఉన్నత సాంకేతిక విలువలతో తెరకెక్కుతున్న ఈ చిత్రం ప్రేక్షకులకు ఒక సరికొత్త సినిమాటిక్ అనుభవాన్ని ఇస్తుంది. వేసవి కానుకగా చిత్రాన్ని విడుదల చేయనున్నాం” అని అన్నారు.


అడవి శేష్

మార్చి నుంచి ‘రెయిడ్’ చేస్తాడు


అజయ్ దేవగన్, ఇలియానా

అజయ్ దేవ్ గన్, ఇలియానా జోడీగా చేసిన ‘రెయిడ్’ చిత్రంలోని ఇటీవల ‘సనూ ఏక్ పాల్ చైన్...అనే పల్లవితో సాగే గీతాన్ని విడుదల చేశారు. దానికి విశేష స్పందన లభించింది. తాజాగా నిత్ ఖైర్ మంగ...అనే గీతాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చారు. రెండు గీతాల్లో భార్యాభర్తల అనుబంధంపైనా, ఒకరి కోసం ఒకరు కనే కలలు, ఎదురుచూపులపైనా ఉన్నాయి. తాజాగా విడుదల చేసిన గీతానికి మనోజ్ ముంతషిర్ సాహిత్యం అందించగాపాకిస్తాన్‌కు చెందిన మ్యూజిక్ డైరెక్టర్ రాహత్ ఫేట్హె అలీ స్వరాలు సమకూర్చారు. ఈ గీతంలో అజయ్ దేవగన్, ఇలియానా జంటకు ప్రశంసలు లభిస్తున్నాయి. కెమెరా పనితనం కూడా ఈ సాంగ్ స్పష్టంగా కనిపిస్తుంది. ఇది తన అభిమాన గీతమని ఈ పాటను ట్విట్టర్‌లో షేర్ చేస్తూ అజయ్ పేర్కొన్నారు. ఈ చిత్రానికి రాజ్ కుమార్ గుప్తా దర్శకత్వం వహించారు. అజయ్ దేవగన్ ఇన్‌కమ్ టాక్స్ ఆఫీసర్‌గా చేశారు. ఉత్తరప్రదేశ్ 1980లో జరిగిన యదార్థ సంఘటన ఆధారంగా తెరకెక్కించారు. మార్చి ఆరో తేదీన ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు.

ప్రభాకర్ జైనీకి సినీ స్వర్ణ కమలం పురస్కారం


తెలంగాణ సినీ స్వర్ణ కమలం అవార్డు అందుకుంటున్న దర్శకుడు డా. ప్రభాకర్ జైన్

దర్శకుడు ప్రభాకర్ జైనీకి తెలంగాణ సినీ స్వర్ణ కమలం పురస్కారం వరించింది. తెలుగు సినిమా రంగానికి, ముఖ్యంగా ‘అంపశయ్య’ వంటి సంచలనాత్మక సినిమాను నిర్మించి దర్శకత్వం వహించినందుకు గానూ ఈయనకు ఈ అవార్డుతో తెలంగాణ కళాకారుల సంఘం గౌరవించింది. ప్రభాకర్ జైనీతో పాటు గాయని మధుప్రియ, అశోక్ కుమార్, సినీ క్రిటిక్ హెచ్. రమేశ్ బాబు, కాంతారావు కుమారుడు టీఎల్ రాజా, నటి ఆయేషా జలీల్, డెక్కన్ సినిమా ఆర్కే మామా మొదలైన వారికి ఈ అవార్డులు ప్రదానం చేశారు. ‘గత శతాబ్దంలో వచ్చిన వంద గొప్ప నవలలో ఒకటయిన ‘అంపశయ్య’ వంటి మనోవైజ్ఞానిక నవలను సినిమాగా తీయడమే సాహసం. ‘అంపశయ్య’లో ప్రభాకర్ జైనీ, తన భార్య విజయలక్ష్మి జైనీతో కలిసి రెండు పాత్రలను పోషించారు. ఒక చోట వారి నటన ప్రేక్షకుల కంట కన్నీరు పెట్టిస్తుంద’ని నటుడు సీవీఎల్ నర్సింహరావు అన్నారు.



మళ్లీ బాలీవుడ్‌లో

ప్రియాంక చోప్రా హాలీవుడ్‌కు వెళ్లిపోయిన తర్వాత అంటే అమెరికన్ టీవీ సిరీస్ క్వాంటికో చేస్తున్నప్పటి నుంచీ బాలీవుడ్‌లో ఎటువంటి సినిమాలు చేయలేదు. ఆ మధ్య ‘బాజీరావు మస్తాని’ మాత్రం చేసింది. అదీ భన్సాలీ తప్పదు చేయాలి అని అంటేనే. హిందీలో సినిమాలు చేయకపోయినా తన తరపున ప్రియాంక అమ్మ ప్రాంతీయ చిత్రాలను నిర్మిస్తున్నారు. ఇప్పుడు మళ్లీ ప్రియాంక బాలీవుడ్‌లో సినిమా చేయనుంది. అదీ ఆమె చేసిన చిత్రం ‘ఐత్రాజ్’ చిత్రం సీక్వెల్‌లోనే చేయనుందట. దర్శకుడు నిర్మాత సుభాస్ ఘాయ్ 80, 90లో అద్భుతమైన చిత్రాలను బాలీవుడ్‌కిచ్చారు. 2004లో ముక్త ఆర్ట్స్ బ్యానర్‌లో ఆయనే స్వయంగా చేసిన చిత్రం ‘ఐత్రాజ్’. ప్రియాంక చోప్రా, అక్షయ్ కుమార్, కరీనా కపూర్ నటించిన ఈ చిత్రం అప్పట్లో భారీ విజయాన్ని అందుకుంది. అబ్బాస్ మస్తాన్ దర్శకత్వం వహించారు. ఈ సినిమాకు సీక్వెల్ తీసేందుకు ప్లాన్ చేస్తున్నారు అబ్బాస్. దీనికి సంబంధించిన స్క్రిప్ట్ పనుల్లోనే రెండేలుగా ఉన్నాడట ఈ డైరెక్టర్. గత నెలలోనే స్క్రిప్ట్ రాయడం పూర్తి చేశారట. ఈ సీక్వెల్ తారాగణం ఎంపికపై కరసత్తు చేస్తున్నారట. దీనిలో భాగంగా ప్రియాంక చోప్రాను సుభాష్ ఘాయ్ కలిసి మాట్లాడారట. సీక్వెల్‌లో నెగిటివ్ రోల్ చేసేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందట. ఈ చిత్రంతో ప్రియాంక మళ్లీ బాలీవుడ్‌లో సినిమా చేయబోతుందన్న మాట.

ప్రియాంక చోప్రా

ఆ ప్రశంసే ఓ పద్మభూషణ్

దర్శకురాలు విజయనిర్మల మంగళవారం తన 73వ జన్మదిన వేడుకలను ఘట్టమనేని అభిమానుల సమక్షంలో నానక్‌రామ్‌గూడాలోని తన నివాసంలో జరుపుకొన్నారు. ఈ సందర్భంగా మూవీ ఆర్టిస్టు అసోసియేషన్ (మా)కు రూ.73 వేలు సాయమందించారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ “అక్కినేని నాగేశ్వరరావు, రజనీకాంత్, శివాజీగణేషన్ వంటి స్టార్ హీరోలతో సినిమా తీసిన ఏకైక మహిళా దర్శకురాలు విజయనిర్మల. ఆమె దర్శకత్వంలో తెరకెక్కిన 44 చిత్రాల్లో సగానికి పైగా సినిమాల్లో నేను నటించినందుకు సంతోషంగా ఉంది. ప్రతి ఏడాదీ ఈ విధంగా మా ఇంటికి విచ్చేసి తమ అభిమానాన్ని చాటుకొంటున్న అభిమానులందరికీ ప్రత్యేకంగా కృతజ్ఞతలు. గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ వారు గౌరవించిన విజయనిర్మలను త్వరలోనే భారత ప్రభుత్వం తగిన రీతిలో సత్కరిస్తుందని ఆశిస్తున్నాను” అని అన్నారు. “ఒకసారి దాసరి మా ఇంటికొచ్చి నా పుట్టినరోజు వేడుకలకు అభిమానులు రావడం చూసి సంతోషించి ఏ స్టార్ హీరోయిన్‌కీ ఈ రేంజ్ క్రేజ్ లేదు అని ’ అన్నారని విజయనిర్మల చెప్పారు. ఆయన ప్రశంసే నాకు పద్మభూషణ్‌తో సమానం అని విజయ నిర్మల పేర్కొన్నారు.



కొత్త దర్శకుడితో శ్రీనివాస్

బెల్లంకొండ సాయి శ్రీనివాస్ కథానాయకుడిగా మరో సినిమా చేసేందుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. “దృశ్యం, గోపాల గోపాల, డిక్టేటర్ వంటి చిత్రాలకు సహాయ దర్శకుడిగా పనిచేసిన శ్రీనివాస్ దర్శకుడిగా ఈ చిత్రంతో పరిచయమవుతున్నారు. వంశధార క్రియేషన్స్ పతాకంపై నవీన్ సొంటినేని (నాని) నిర్మించనున్నారు. సీనియర్ టెక్నీషియన్స్ ఈ చిత్రానికి పని చేయనున్నారు. కెమెరామెన్‌గా ఛోటా కె.నాయుడు, తమన్ బాణీలు సమకూరుస్తున్నారు. ఆర్ట్ డైరెక్టర్‌గా చిన్నాని ఎంపిక చేశారు. గురువారం హైదరాబాద్‌లో ప్రారంభోత్సవ వేడుకను ఘనంగా నిర్వహించనున్నారు.


బెల్లంకొండ శ్రీనివాస్

చిట్టి..పొట్టి పలుకుల

సోఫియా



మూడు రోజులపాటు హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న 22వ ప్రపంచ ఐటీ సదస్సును (డబ్ల్యూఐసీటీ) సోమవారం ప్రారంభమైంది. సదస్సు రెండో రోజున 'కృత్రిమ మేధస్సు–ఎఐ సమాచార దూరం' అంశాలపై జరిగే చర్చలో సోఫియా ఆకర్షణీయంగా నిలిచింది. ఈ సోఫియా మనిషి కాదు... హ్యూమనాయిడ్ రోబో.

ఈ రోబోను సృష్టించిన డేవిడ్ హాన్సన్ సంధించిన పలు ప్రశ్నలకు సోఫియా తన చిట్టిపొట్టి మాటలతో జవాబులు చెప్పి అందరినీ ఆకట్టుకుంది. "మానవత్వంతోనే మెరుగైన భవిష్యత్తు' అంశంపై రోబో సోఫియా ప్రసంగించింది. మనుషుల్లాగే నాకు విశ్రాంతి అవసరమని, 66 రకాల ఫీలింగ్స్‌ను అర్థం చేసుకోగలనని చెప్పింది. ప్రపంచంలో ఇంతవరకు చాలా దేశాల్లో పర్యటించిన తనకు.. హాంకాంగ్ అంటే చాలా ఇష్టమని తెలిపింది. ప్రపంచంలో ప్రతి ఒక్కరూ ప్రేమపూర్వకంగా వ్యవహరించాలని, తోటివారి పట్ల దయతో, సహాయం చేసే వ్యక్తిత్వంతో ఉండటమే మానవత్వమని చెప్పింది. అదే మానవత్వ మనుగడకు బాటలు వేస్తుందనీ సోఫియా వ్యాఖ్యానించింది. తానూ మనుషుల్లాగే ఆనందంగా ఉన్నప్పుడు.. సంతోషం కలిగినప్పుడు నవ్వుతానని, బాధ కలిగితే ఏడుస్తానని చెప్పింది.

సౌదీ పౌరసత్వాన్ని మహిళా సాధికారత కోసం వినియోగిస్తానని స్పష్టం చేసింది. 'నీకు సౌదీ అరేబియా పౌరసత్వం ఉంది. నువ్వు ఒక సెలెబ్రిటీ. మనుషులతో పోలిస్తే రోబోలకు రూల్స్ వేరే ఉంటాయా?' అన్న ప్రశ్నకు "మాకు ఎలాంటి ప్రత్యేక నిబంధనలూ లేవు. మేం వాటిని కోరుకోం కూడా. కానీ మహిళల హక్కుల గురించి మాట్లాడేందుకు నాకు ఈ పౌరసత్వం అవసరం" అని సోఫియా సమాధానం చెప్పింది.


"మానవాళిపై ఆధిపత్యం చెలాయించాలన్న ఆలోచన లేదు. మానవాళితో కలిసిమెలిసి సఖ్యతతో ఉండాలి. మానవులు సృజనాత్మకత కలిగినవారు" అని మరో ప్రశ్నకూ జవాబు చెప్పింది.

అంతేకాదు... బాలీవుడ్, హాలీవుడ్‌లలో నీ ఫేవరెట్ సినిమా స్టార్ ఎవరు? అంటే... 'షారుక్‌ఖాన్' అంటూ జవాబు చెప్పింది.

'బిట్‌కాయిన్లలో ఎంత డబ్బు పెట్టుబడి పెట్టావ్? అన్న ప్రశ్నకు... తన వయసు రెండేళ్లేనని, తనకు బ్యాంకు అకౌంట్ లేదని చెబుతూనే.. ఓ రోబో ఎలా పెట్టుబడి పెట్టగలదంటూ' ఎదురు ప్రశ్నించింది.

'థ్యాంక్యూ'కి మించిన గొప్ప పదం లేదని వెల్లడించింది. ఈ ఐటీ సదస్సులో రోబో సోఫియా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

40 ఏళ్ల చరిత్రగల ఈ సదస్సును తొలిసారి భారత్‌లో నిర్వహిస్తుండటంతో దీనికి ప్రత్యేకత సంతరించుకుంది. 1978లో తొలిసారి ప్రపంచ ఐటీ కాంగ్రెస్ సదస్సు జరగ్గా 22వ సమావేశానికి హైదరాబాద్ వేదిక కావడం విశేషం. భవిష్యత్‌లో మనుషుల్లాగే ప్రవర్తించగల రోబోలు మననుఅలరించనున్నాయని ఈ ఐటీ సదస్సు రుజువు చేసింది.



విశ్వపు గోళీయ ఉపరితల వైశాల్యము

విశ్వం విస్తరిస్తోందా?

ప్రశ్న : ఈ విశ్వం విస్తరిస్తోందని చదివాను. ఆ విధంగా అన్ని వైపులకు సమానంగా వ్యాపిస్తోందా? లేక ఒకే దిశలో ఎక్కువగా వ్యాపిస్తోందా? బిగ్‌బ్యాంగ్ ఎలా జరిగిందో వివరించగలరు.

- పి.శంకరలింగం, శాయంపేట, వరంగల్ రూరల్

జవాబు : నేటి కాలమాన ప్రమాణాల ప్రకారం బిగ్‌బ్యాంగ్ అనే విశ్వ సంఘటన సుమారు 1500 కోట్ల సంవత్సరాల క్రితం సంభవించింది. అంటే నేడున్న పాదార్థిక స్వభావానికి ప్రారంభం అక్కడే నన్నమాట. అంతకన్నా ముందు విశ్వం ఎలావుండేది అన్న ప్రశ్నకు విజ్ఞానపరంగా సమాధానం ఉండదు. ఎందుకంటే... అంతకు ముందు, ఆ తర్వాత, నిన్న మొన్న, ఎల్లుండి, క్రీ.పూ., క్రీ.శ. వంటి పదాలన్నీ కాలానికి సంభంధించినవి. కాలం అనే దానికి పదార్థ సంధానం లేనిదే అస్తిత్వం లేదు. అంటే పదార్థం పాదార్థిక మార్పులు లేకుండా కాలానికి అర్థం లేదు. అయితే ఏదీ శూన్యం నుంచి ఆవిర్భవించే అవకాశం లేదు. కాబట్టి పదార్థం ఎపుడూ వుంటుందని బిగ్‌బ్యాంగ్ సంఘటన పాదార్థిక మార్పుల్లో ఒక దశ అని మనం భావించాలి. దీనిని మనం ఓ ఉదాహరణతో కొంచెం స్థూలంగా అర్థం చేసుకోగలం. సీతాకోకచిలుక జీవిత చరిత్రలో ఘటనలు, దశలు ఉన్నాయని మనం చిన్నపుడే చదువుకొన్నాం. గుడ్డు (egg), గొంగళిపురుగు (caterpillar), కోశస్థ దశ (pupa), సీతాకోకచిలుక (butterfly)- ఈ నాలుగు దశల్లో దాని ఉత్పన్నం యిమిడివుంది. గుడ్డు, గొంగళిపురుగు, ప్యూపా, సీతాకోకచిలుక లాగా రూపాలు వేరయినా వాటిలో ఉన్న జీవ కణాల్లోని కేంద్రకాలలో ఉన్న డిఎన్ఎ లోని జన్యు స్మృతి ఒకేవిధంగా వుంటుంది. క్రోమోజోముల సంఖ్య ఒకేవిధంగా వుంటుంది. ఈ విధమైన స్థిర ధర్మాన్ని వస్తువుల (లేదా విశ్వపు) పదార్థ స్వభావం అనుకొందాం. కానీ గుడ్డు రూపం అందులోని మార్పులు, దానికున్న భౌతిక రసాయనిక ధర్మాలు, గొంగళిపురుగు రూపం దానిలోని మార్పులు, అందులోని ధర్మాలు, కోశస్థదశ రూపం దానిలోని మార్పులు, ధర్మాలు, సీతాకోకచిలుక రూపురేఖలు, మార్పులు, ధర్మాలు ఒకేవిధంగా వుండవు. కానీ గుడ్డుకు కొంత కాలవ్యవధి, పురుగుకు కొంత కాల వ్యవధి, కోశస్థ దశలకు, సీతాకోక చిలుకకు కొంత కాలవ్యవధులు వున్నాయి. ఒక్కో దశలోని జీవి జీవితమే ఒక్కో విధమైన విశ్వరూపం అనుకొంటే, మన గడియారం క్యాలెండరు ప్రకారం ఫలాని వయసున్న పిల్ల సీతాకోకచిలుక ముందు కోశస్థ దశ అని దాని వ్యవస్థ యింత అని, దాని ముందు గొంగళిపురుగు వ్యవస్థ ఫలాని కాల వ్యవధి అని అంతకన్నా ముందు గుడ్డు యింత కాలమని చెప్పగలం. కానీ ప్రతి దశకు ముందున్న దశ రూపురేఖలు, ధర్మాలు వేరువేరు కాబట్టి, సీతాకోకచిలుక నిర్దిష్ట దశ తప్ప మరేదీ విశ్వంలో లేనట్లయితే ఆయా దశే ఆయా ఏకైక వ్యవస్థ (Isolated System) అంటారు. అందులోని పదార్థం, అందులోని శక్తి ఆంతరంగికంగా స్థిరంగా ఉన్నా గతితార్కిక పద్ధతిలో మార్పులు జరుగుతూ వుంటాయి. కాబట్టి ఆయా దశలోని పాదార్థిక మార్పులకు అనుగుణంగానే ఆయా దశలోని కాలం, స్థలం (Space-Time) అనే విధంగా మితులు (dimensions) వుంటాయి. కాబట్టి బిగ్‌బ్యాంగ్ ముందు ఏమిటి అన్న ప్రశ్నకు అర్థంలేదు. అది సమాధానంలేని ప్రశ్న. బిగ్‌బ్యాంగ్ అనే సంఘటనలో అతి తక్కువ స్థలాన్ని విపరీతమైన సాంద్రత (density) తో ఆక్రమించిన శక్తి. పదార్థ సంచయం (mass-energy entity) ఒక్క పెట్టున పేలి (bang) స్థలాన్ని ఆక్రమించడం మొదలెట్టింది. అప్పట్నించే కాలానికి అస్తిత్వం ఉంది. అదే నేడు మనం కొలుస్తున్న కాలమనే మితి. బిగ్‌బ్యాంగ్ జరిగిన సెకనులోపే (నిజానికి సెకనును కొన్ని కోట్ల కోట్ల కోటానుకోట్ల ముక్కల్ని చేస్తే ఏర్పడే ఒక ముక్కలోని వ్యవధిలోనే) ప్రాథమిక కణాలు (మొత్తం 61) ఏర్పడ్డాయి. అవే ఆ తదుపరి ప్రొటాన్లు, న్యూట్రాన్లు, కేంద్రకాలు, పరమాణువులు, నక్షత్రాలు, గ్రహాలు, ఉపగ్రహాలు, అణువులు, కణాలు, జీవులుగా పరిణమించాయి. విశ్వం ఏర్పడ్డాక ఆ చొరవ (impact)తో స్థలాన్ని విస్తరించుకొంటుంది. అంటే ముందే స్థలం ఉన్నట్లు అందులో విశ్వమనే బెలూను పెద్దగా ఉబ్బుతున్నట్లు భావించకూడదు. విశ్వానికున్న స్థల పరిమాణమే పెరుగుతోంది. విశ్వం అవతల స్థలం, కాలం అంటూ ఏమీ లేవు.

విశ్వం వ్యాపిస్తోంది కాబట్టి విశ్వంలోని గెలాక్సీలు, నక్షత్రాలు, గ్రహాలు, ఉపగ్రహాలు తదితర ఖగోళ సంబంధిత వ్యవస్థల మధ్య సగటు దూరం పెరుగుతోంది. ఒక పరిశీలకుడి దృష్ట్యా దూరంగా ఉన్న వ్యవస్థలు వ్యాపించే విస్తరణ వేగం, దగ్గరగా వున్న వస్తువులు వ్యాపించే విస్తరణ వేగం ఒకే విధంగా వుండదు. దూరపు వ్యవస్థలు ఎక్కువ వేగవంతంగా, దగ్గరి వ్యవస్థలు తక్కువ వేగవంతంగా విస్తరిస్తుంటాయి. దీనర్థం ఏమిటంటే మనకు సుదూరంగా ఉన్న నక్షత్రం మన నుంచి నిన్నటికన్నా నేడు అధిక వేగంతో మననుంచి దూరంగా వెళుతోందన్నమాట. D దూరంలో వెళ్తున్న వస్తువు వేగం v అయినట్లయితే v కి, D కి అనులోపాత (proportionate) సంబంధం ఉందన్నమాట. ఇపుడు v/D విలువను హబుల్ స్థిరాంకం (Hubble constant) అంటారు. దీని విలువ సుమారు 70 కి.మీ./ సె / మెగా పార్సెక్. దీనర్థం ఏమిటంటే ప్రతి మెగా పార్సెక్ దూరం (సుమారు 3×10^{19} కి.మీ.) వెళ్లేకొద్దీ ఖగోళ వస్తువు పరిశీలకుడి నుంచి వెళ్లే వేగం సెకనుకు 70 కి.మీ. చొప్పున పెరుగుతుంది.

విశ్వం వ్యాపిస్తున్నదనడానికి ఋజువులు ఈ మధ్యనే లభించాయి. 29 సంవత్సరాల పిన్నవయసులోనే 1998లో ఆడం రీస్ (Adam Riess) తన గురువులు సహోధ్యయనులు సూపర్నోవాల మీద చేసిన ప్రయోగాల ఆధారంగా విశ్వవ్యాపనం గురించి నిర్ద్వంద్వంగా ఋజువులు లభించాయి. ఈయనతో పాటు సెల్ మట్టర్ (Saul Perlmutter), ష్మిట్ (Brian P. Schmidt) అనే శాస్త్రవేత్తలకు విశ్వవ్యాప్త నిరూపణకు గుర్తింపు 2011 సంవత్సరం భౌతిక శాస్త్ర నోబెల్ బహుమతి లభించింది. విశ్వం అన్ని వైపులకు సమానంగా విస్తరిస్తోంది. దానికి అంతర్గతంగా ఏక ధర్మం వుంటుంది కాబట్టి మూడు మితుల స్థలాన్ని సమానంగా పెంచుకొంటూ విస్తరిస్తోంది.



Adam Riess Saul Perlmutter Brian Schmidt





ప్రొ॥ ఎ. రామచంద్రయ్య
సంపాదకులు,
చెకుముకి, జనవిజ్ఞాన వేదిక.
email:
allikayala@gmail.com

రెండు సెకన్లలో
100కి.మీ. వేగం..!

ఇది నిజంగా ఆశ్చర్యకర విషయమే. నగర రోడ్లపై రెండు సెకన్లలో 100 కి.మీ. వేగంతో వెళ్లడమంటే ఆశ్చర్యం కాక మరేమిటి? అయితే దీనికంత ఆశ్చర్యమేమీ అక్కర్లేదు. ఇది నిజంగా నిజం అంటోంది జపాన్‌కు చెందిన అస్పార్క్ కంపెనీ. వీరు రూపొందించిన 'ఔల్' అనే ఈ ఎలక్ట్రిక్ కారు ఈ ఫీట్‌ను చేస్తుందని వారు చెబుతున్నారు. ఇంకా కరెక్టుగా చెప్పాలంటే 1.921 సెకన్లలో 96.56 కిలోమీటర్ల వేగాన్ని అందుకుందట! అయితే ఇది ఫార్ములా వన్ తరహాలో రూపొందించిన రేసుకారు మాత్రం కాదు. అచ్చంగా నగర రోడ్లపై తిరగడానికి రూపొందించినదే. ప్రపంచంలో ఈ ఘనత సాధించిన తొలి వాహనంగా 'ఔల్' రికార్డు సృష్టిస్తుందని ఆ కంపెనీ చెబుతోంది. గతేడాది జర్మనీలో జరిగిన ఆటో షోలో తొలిసారిగా ప్రదర్శించిన ఈ 'ఔల్' కారు 860 కిలోల బరువు, 430 హార్స్‌పవర్ సామర్థ్యం కలిగి ఉంది. ఒకసారి ఛార్జ్ చేస్తే.. 150 కిలోమీటర్ల వరకు వెళ్తుంది. తాజాగా దీని వేగానికి సంబంధించిన వీడియోను సదరు కంపెనీ విడుదల చేసింది. 50 వాహనాలను మాత్రమే అస్పార్క్ కంపెనీ ఉత్పత్తి చేస్తుందట! ఒక్కోదాని ధర రూ.27 కోట్లు. అయితే.. టెస్టింగ్ వీడియోపై కొందరు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. టెస్టింగ్‌లో పాల్గొన్న కారుకు రేసుకారు టైపు టైర్లను వాడారని, ఇవి రోడ్లపై తిరగడానికి పనికి రావనీ, రోడ్లపై తిరిగే కార్ల తరహా టైర్లను వాడిన తర్వాతే టెస్టింగ్ నిర్వహించాలని చెబుతున్నారు.






ఒత్తిడికి విరుగుడు వైసా యాప్

ఈ పోటీ ప్రపంచంలో ఉద్యోగం మొదలుకొని... వైవాహిక జీవితం వరకు ఒత్తిడి అనే పదం సర్వసాధారణమైపోయింది. ఈ ఒత్తిడితో మానసిక సమస్యలు పెరిగిపోయి అనేక అవాంఛనీయ సంఘటనలకు దారితీస్తున్నాయి. ఇలాంటి విపత్కర పరిస్థితులను ఎదుర్కొనే వారికోసం ఓ బుల్లి స్నేహితుడ్ని అందుబాటులోకి తెచ్చామని చెబుతోంది వైసా. టచ్‌కిన్ అనే సంస్థ రూపొందించిన అప్లికేషన్ పేరే వైసా. బంధుమిత్రులతో మాట్లాడినట్లుగానే ఈ యాప్ తోనూ మన కష్టసుఖాలన్నీ చెప్పుకోవచ్చునట! కొంతమంది సైకాలజిస్టులు, మనోవైజ్ఞానికుల సలహా, సూచనల మేరకు అభివృద్ధి చేసిన ఈ యాప్ మనతో చక్కగా మాట్లాడటమేగాక, మన సమస్యలను ఎలా అధిగమించవచ్చునో పరిష్కారాలనూ సూచిస్తుందట! అలాగని అందరికీ ఒకేరకమైన సలహా ఇవ్వదట.

కృత్రిమ మేధ (AI) ఆధారంగా దీన్ని రూపొందించడం వల్ల ఇది వ్యక్తులను బట్టి, ఆయా సందర్భాలకు అనుగుణంగా తగిన సూచనలు ఇచ్చేలా దీన్ని తీర్చిదిద్దామని కంపెనీ వ్యవస్థాపకుల్లో ఒకరైన జో అగర్వాల్ చెబుతున్నారు.



చిన్నారి





పొడుపు కథ


పుట్టినా కదలంది
కొడితే మాత్రం చస్తుంది.
రోజుకొకటి తింటే
ఆరోగ్యాన్నిస్తుంది...?

జవాబు : గుడ్డు

జోక్ :

టీచర్ : రామూ! 16వ శతాబ్దం నాటి రాజుల గురించి నీకేమైనా తెలుసా?
రాము : తెలుసు టీచర్.
టీచర్ : గుడ్.. ఏం తెలుసో చెప్పు!
రాము : వాళ్లంతా ఎప్పుడో చనిపోయారు టీచర్!

చుక్కలు కలపండి!



పిల్లలూ..! పక్కనున్న చిత్రంలోని బొమ్మకు చుక్కలు కలిపి రంగులు వేయండి!

వేగంగా పరిగెత్తే చిరుత



పిల్లలూ..! మీకు తెలుసా? ఈ భూమి మీద అత్యంత వేగంగా పరిగెత్తే జంతువు చిరుతపులి. తన వేగం ద్వారా తాను వేటాడే జంతువును తక్కువ సమయంలో పట్టేస్తుంది. ఇది 460 మీటర్ల దూరం గరిష్ట వేగంతో పరిగెత్తగలదు. ఇదిలా ఉంటే మూడు సెకెన్లలోనే గంటకు 103 కి.మీ వేగాన్ని అందుకునే సామర్థ్యం దీని సొంతం. అనేక సూపర్‌కార్ల కంటే ఎక్కువ వేగంతో పరిగెత్తగలదు. చిరుత కళ్ళు బాగా కనిపించే విధంగా చిన్న తలను కలిగి ఉంటుంది. నల్లటి కంటిచారలు రెండు కళ్ళ మూలల నుంచి ముక్కు పక్కవైపుగా నోటిలోకి వ్యాపించి ఉంటాయి. సూర్యరశ్మి కళ్ళపై పడకుండా ఉండేందుకు, వేటలో సాయపడేందుకు, సుదూర దృష్టి కోసం ఇవి ఉపయోగపడతాయి. అధిక వేగాలు అందుకునే సామర్థ్యం ఉన్నప్పటికీ, దాని శరీరం బాగా ఎక్కువ దూరం పరిగెత్తేందుకు అనుకూలించదు.

చిరుత అంత వేగంగా పరిగెత్తడానికి కారణం చెవి అంతర్నిర్మాణమేనట! అమెరికన్ మ్యూజియం ఆఫ్ నేచురల్ హిస్టరీ చేసిన అధ్యయనంలో ఈ విషయం తేలింది. మొత్తం 21 నమూనాలు సేకరించారు. చిరుతలోని ప్రతి కదలికను హైటెక్నాలజీ ఉపయోగించి క్యాప్చర్ చేశారు. అక్కడే అసలు విషయం బోధపడింది.

చిరుత పరిగెడుతున్నప్పుడు అందరూ దాని కాళ్లు, కండరాలు, వెన్నెముక కదలికలను మాత్రమే గమనిస్తారు. అయితే వాటిని సమన్వయం చేసేది మాత్రం చెవి అన్న విషయాన్ని ఎవరూ గుర్తించలేరు. చెవిలో ఉండే కెనాల్స్ (రక్తనాళాలు ఉండే కాలువలు) లాంటి నిర్మాణాల వల్లే అది వేగంగా ప్రయాణిస్తుందని పరిశోధకులు తేల్చారు. కెనాల్స్ వల్లే బ్యాలెన్స్ చేసుకునే శక్తి చిరుతకు వస్తుందని చెప్పారు. వెన్నెముక, కాళ్లు వేగంగా కదులుతున్నా.. ఈ అంతర్నిర్మాణం వల్ల తల మాత్రం స్థిరంగా ఉండి.. లక్ష్యాన్ని గురి చూస్తుంటుంది. ఇదీ పిల్లలూ అసలు విషయం. ★



నేను గీసిన బొమ్మ



వి.వి.ఆర్. ప్రనాద
మూడవ తరగతి,
శ్రీ విజ్ఞాన విహార్ ఇంగ్లీషు మీడియం హైస్కూల్,
విజయవాడ.



పిల్లల్లారా.. రారండి!!

కథలు, కవితలు, మీరు గీసిన బొమ్మలు, చూసిన ప్రదేశాలు, కనిపెట్టిన సైన్సు సంగతుల గురించి రాసి మీపేరు, ఫొటోతో పంపవలసిన మా చిరునామా :

చిన్నారి, జీవన, ప్రజాశక్తి తెలుగు దినపత్రిక,
హౌస్ నెం : 27-30-4, ఆకులవారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-2.
ఇ మెయిల్ - jeevanapageps@gmail.com

గెలిస్తే సిరీస్ కైవసం

- నేడు సఫారీ మహిళాజట్టుతో నాల్గో టీ20



సెంచూరియన్ (స్పోర్ట్స్‌పార్క్) : భారత మహిళాజట్టు దక్షిణాఫ్రికా పర్యటనలో టీ20 సిరీస్ విజయానికి అడుగుదూరంలో నిలిచింది. బుధవారం భారత మహిళాజట్టు దక్షిణాఫ్రికా జట్టుతో నాల్గో టీ20లో తలపడనుంది. ఇప్పటికే వన్డే సిరీస్‌ను గెలిచిన భారత మహిళాజట్టు టీ20 సిరీస్‌లోనూ 2–1 ఆధిక్యతలో నిలిచింది. ఇరుజట్ల మధ్య ఐదు టీ20ల సిరీస్‌లో భాగంగా తొలి రెండు మ్యాచ్‌లు గెలిచిన హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలోని మహిళాజట్టు సఫారీగడ్డపై అద్భుతంగా రాణిస్తోంది. వన్డే సిరీస్‌ను 2–1తో గెలిచిన భారత మహిళాజట్టులో రాణించిన మిథాలీ... తొలి రెండు టీ20ల్లో అద్భుతంగా రాణించి మూడో మ్యాచ్‌లో డకౌట్ అయ్యింది. దీంతో ఆ మ్యాచ్‌లో సఫారీజట్టు 5 వికెట్ల తేడాతో భారతజట్టుపై గెలిచి 2–1 ఆధిక్యతను తగ్గించింది. నేడు జరిగే నాల్గో టీ20ల్లో గెలిచి సిరీస్ కైవసం చేసుకోవాలని టీమిండియా భావిస్తుండగా... సిరీస్ చేజార్చుకోకుండా ఉండేందుకు సఫారీజట్టు సైతం పోరాడుతోంది.

టీమిండి యా మహిళాజట్టులో హర్మన్ ప్రీత్ కౌర్, మంధన, మిథాలీరాజ్, వేదా కృష్ణమూర్తిలు బ్యాటింగ్‌లో అద్భుతంగా రాణిస్తున్నారు. వీరు క్రీజ్‌లో నిలదొక్కు కుంటే విజయం నల్లేరుమీద నడకే అనక తప్పదు.

మహిళాజట్టు : మిథాలీ రాజ్, స్మృతి మందన, హర్మన్‌ప్రీత్ కౌర్ (కెప్టెన్), రోడ్రిగ్వెస్, వేద కృష్ణమూర్తి, అనూజ పాటిల్, శిఖా పాండే, తానియా భాటియా (కీపర్), పూజా వస్త్రాకర్, పూనమ్ యాదవ్, రాజేశ్వరి గైక్వాడ్, రాధా యాదవ్, దీప్తి శర్మ, రుమేలి ధర్, నుజ్హత్ పర్వీన్.

మరో చరిత్ర సృష్టిస్తారా...



- నేడు దక్షిణాఫ్రికాతో రెండో టీ20
- రాత్రి 9.30 గం॥ల నుంచి

సెంచూరియన్ : భారత్–దక్షిణాఫ్రికా జట్లమధ్య రెండో టీ20 మ్యాచ్ బుధవారం జరగనుంది. ఇప్పటికే తొలి మ్యాచ్ గెలిచి ఊపుమీదున్న టీమిండియాను నిలువరించడం సఫారీ జట్టుకు కష్టమే. భారతజట్టు అన్ని విభాగాల్లో సమిష్టిగా రాణిస్తోంది. తొలి మ్యాచ్‌లో బౌలింగ్‌లో భువనేశ్వర్ కుమార్ ఐదు వికెట్లు సాధించి సఫారీ జట్టు నడ్డి విరిచాడు. బ్యాటింగ్‌లో శిఖర్ ధావన్ అర్ధసెంచరీతో ఆకట్టుకున్నాడు. వీరిద్దరే కాకుండా స్పిన్ బౌలింగ్‌ను ఎదుర్కోవడంలో సఫారీజట్టు కొంత ఇబ్బందులకు గురౌతుంది. దీనికితోడు సీనియర్ బ్యాట్‌మన్ల లోటు ఆ జట్టుకు కొట్టొచ్చినట్లు కనబడుతోంది.

సఫారీ జట్టు సీనియర్ బ్యాట్స్‌మన్ ఎబి డివిలియర్స్ టీ20లకు దూరమయ్యాడు. మొదటి టీ20లో ఫీల్డింగ్ చేస్తూ... గాయానికి గురైన ఎబి ఆ జట్టుకు దూరమవ్వడం భారత్‌కు కలిసొచ్చే అంశం. సఫారీ జట్టు మరో సీనియర్ ఆ జట్టు సారథి పాల్ డుమిని మాత్రమే. దీంతో అతడిపై సీనియర్ల లేమి కారణంగా ఒత్తిడికి గురయ్యే అవకాశముంది. ఈ మ్యాచ్ చేజార్చుకుంటే టీ20 సిరీస్ కోల్పోయినట్లే.

> తొలిసారి వన్డే సిరీస్‌ను గెలుచుకున్న టీమిండియా... జోహాన్స్‌బర్గ్‌లో జరిగిన మొదటి టీ20లోనూ గెలిచింది. అదే జోరును నేటి మ్యాచ్‌లోనూ కొనసాగించి ఈ సిరీస్‌ను కూడా గెలుపొందాలని టీమిండియా భావిస్తోంది. టీ20 సిరీస్ కూడా భారత్ గెలిస్తే సఫారీగడ్డపై కోహ్లి సేన మరో చరిత్ర సృష్టించినట్లే...

ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్ కోహ్లీ, బుమ్రాలకు అగ్రస్థానం

అంతర్జాతీయ క్రికెట్ నియంత్రణ మండలి (ఐసీసీ) మంగళవారం ప్రకటించిన వన్డే ర్యాంకింగ్‌సలో కోహ్లీ, బుమ్రా అగ్రస్థానాలకు చేరారు. బౌలింగ్ విభాగంలోనూ టీమిండియా ఫాస్ట్ బౌలర్ జస్ప్రిత్ బుమ్రాతోపాటు ఆఫ్ఘనిస్తాన్ లెగ్ స్పిన్నర్ రషీద్ ఖాన్ కూడా అగ్రస్థానంలో నిలిచాడు. నేడు ఐసీసీ వన్డే బౌలింగ్ ర్యాంక్సింగ్స్ ప్రకటించగా... విరాట్ కోహ్లీ 909 పాయింట్లతో వన్డే ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానంలోనూ... బౌలింగ్ విభాగంలో 787 పాయింట్లతో బుమ్రా, రషీద్‌ఖాన్‌లు తొలిస్థానాన్ని చేజిక్కించుకున్నారు. దక్షిణాఫ్రికాతో జరుగుతున్న ద్వైపాక్షిక సిరీస్‌లో 500కు పైగా పరుగులు చేసిన కోహ్లీ 900 పాయింట్ల మార్కుకు చేరుకోవడంతో తిరిగి అగ్రస్థానానికి చేరడమే కాకుండా 900 పాయింట్లు సాధించిన తొలి భారతీయ క్రికెటర్‌గా నిలిచాడు. రెండోస్థానంలో దక్షిణాఫ్రికా బ్యాట్స్‌మన్ ఎబి డివిలియర్స్ 844 పాయింట్లతో రెండోస్థానంలోనూ, ఆసీస్ ఓపెనర్ డేవిడ్ వార్నర్ 823 పాయింట్లతో మూడోస్థానంలో నిలిచాడు. అయితే వన్డే ర్యాంకుల్లో 900 పాయింట్లు దాటిన ఏకైక భారత క్రికెటర్ విరాట్ కోహ్లీ కావడం గమనార్హం. ఇక కోహ్లీ కంటే ముందు ఆ మార్క్ చేరుకున్నవారిలో ఆస్ట్రేలియా ఆటగాడు డీన్ జోన్స్(918). కాగా తన కెరీర్‌లో అత్యుత్తమ ర్యాంకు చేరుకున్న విరాట్ ఈ అరుదైన ఫీట్ సాధించిన ఆటగాళ్ల జాబితాలో ఏడో స్థానంలో నిలిచాడు. బౌలింగ్ విభాగంలో మూడోస్థానాన్ని కివీస్ పేస్ బౌలర్ బోల్ట్ 729 పాయింట్లతో మూడోర్యాంక్‌లో నిలిచాడు. ఇక ఆల్‌రౌండర్ల జాబితాలో బంగ్లాదేశ్‌కు చెందిన షకీబ్ ఉల్ హసేన్ 359 పాయింట్లతో మొదటి స్థానంలోనూ... పాకిస్తాన్ ఆల్‌రౌండర్ హఫీజ్ 339 పాయింట్లతో... ఆఫ్ఘనిస్తాన్‌కు చెందిన మహ్మద్ నబి 332 పాయింట్లతో రెండు, మూడు స్థానాల్లో కొనసాగుతున్నారు.


ఆఫ్ఘన్ బౌలర్ రషీద్‌ఖాన్ రికార్డ్

ఆఫ్ఘనిస్తాన్ లెగ్‌స్పిన్నర్ రషీద్‌ఖాన్ అతి పిన్నవయసులో బౌలింగ్ విభాగంలో అగ్రస్థానానికి చేరి రికార్డ్ సృష్టించాడు. 19 ఏళ్ల 153 రోజుల వయసున్న రషీద్ ఖాన్ వన్డే క్రికెట్ బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానానికి చేరిన అత్యంత పిన్న వయస్కుడిగా రికార్డు సృష్టించాడు. ఇటీవల జింబాబ్వేతో జరిగిన సిరీస్‌లో రషీద్ ఖాన్ 7.93 సగటుతో ఐదు మ్యాచుల్లో 16 వికెట్లు పడగొట్టాడు.

భారతజట్టు : రోహిత్ శర్మ, శిఖర్ ధావన్, విరాట్ కోహ్లీ (కెప్టెన్), సురేష్ రైనా, మనీష్ పాండే, ఎం.ఎస్. ధోనీ (కీపర్), హార్దిక్ పాండ్యా, భువనేశ్వర్ కుమార్, చాహల్, బుమ్రా, కుల్దీప్ యాదవ్, శార్దూల్ ఠాకూర్.

దక్షిణాఫ్రికా జట్టు : జెజె స్మట్స్, హెండ్రిక్స్, పాల్ డుమిని (కెప్టెన్), డేవిడ్ మిల్లర్, బెహర్దియన్, క్లెశన్ (కీపర్), ఫెల్కుల్వియో, క్రిస్ మోరిస్, డేన్ పీటర్సన్, జూనియర్ దాలా, తబ్రిజ్ షమి, జోంకర్, ఫంగిస్కో.

క్రికెట్‌కు పీటర్‌సన్ గుడ్‌బై?



ఇంగ్లండ్ స్టార్ క్రికెటర్ కెవిన్ పీటర్‌సన్ త్వరలో క్రికెట్‌కి పూర్తిగా గుడ్‌బై చెప్పేస్తున్నట్లు మంగళవారం తెలిపాడు. ప్రస్తుతం జరుగుతున్న పాకిస్థాన్ సూపర్ లీగ్ తర్వాత తాను అన్ని ఫార్మాట్‌ల క్రికెట్ నుంచి తప్పుకుంటున్నట్లు తెలిపారు. ఇప్పటికే అంతర్జాతీయ క్రికెట్ నుంచి రిటైర్ అయిన కేపీ.. ఈ లీగ్ తర్వాత డొమెస్టిక్ క్రికెట్‌లోనూ కనిపించడు. ఈ సందర్భంగా పీటర్సన్ మాట్లాడుతూ... 'నా భార్య, కుటుంబానికి ఓ క్రికెటర్‌గా లెక్కలేనన్ని సార్లు గుడ్‌బై చెప్పా.. ఈ సాయంత్రం చెప్పిన గుడ్‌బై చివరిది. ప్రతి గుడ్‌బైని నేను ద్వేషించా కానీ అది నా పని.. తప్పలేదన్నాడు". కాగా ఫిబ్రవరి 22 నుంచి మార్చ్ 25 వరకూ పీఎస్ఎల్ జరుగనుంది.

బంగారు పతకం సాధిస్తా

పీవీ సింధు



ముంబయి: భారత షట్లర్, రియో ఒలింపిక్ రజిత పతక విజేత పీవీ సింధు రానున్న టోక్యో ఒలింపిక్స్‌లో బంగారు పతకం సాధిస్తానని ధీమా వ్యక్తం చేసింది. మంగళవారం ముంబయి వేదికగా బ్రిడ్జ్‌స్టోన్ టైర్స్ ఏర్పాటు చేసిన సమావేశంలో సింధును తమ బ్రాండ్ అంబాసిడర్‌గా కంపెనీ ప్రకటించింది. సింధుతో పాటు ఈ ఈవెంట్‌లో మరో షట్లర్ కిదాంబి శ్రీకాంత్, ఒలింపిక్ గోల్డ్ మెడల్ విజేత మేరీకోమ్, రియో ఒలింపిక్ బ్రాంజ్ మెడల్ విజేత సాక్షి మాలిక్, లలిత బబ్బర్‌లను బ్రిడ్జ్‌స్టోన్ తమ బ్రాండ్ అంబాసిడర్లుగా ప్రకటించింది.

నేడు టీ20 ట్రై సిరీస్ ఫైనల్

అక్లాండ్ : ఆస్ట్రేలియా–న్యూజిలాండ్ జట్లమధ్య ట్రయాంగులర్ సిరీస్ ఫైనల్ మ్యాచ్ జరగనుంది. అక్లాండ్‌లోని ఈడెన్‌పార్క్ మైదానంలో ఇరుజట్లమధ్య బుధవారం టీ20 టైటిల్‌పోరు జరగనుంది. మూడోజట్టైన ఇంగ్లండ్ చేతిలో చివరి మ్యాచ్‌లో ఓడినప్పటికీ న్యూజిలాండ్ జట్టు బెటర్ రన్‌రేట్ ప్రాతిపదికపై ఫైనల్‌కు అర్హత సాధించింది. కివీస్‌తో చివరి లీగ్‌మ్యాచ్‌లో తలపడిన ఆస్ట్రేలియా జట్టు 244 పరుగుల రికార్డ్ ఛేదన చేసిన విషయం తెలిసిందే. ఒకవేళ ట్రయాంగులర్ సిరీస్ ఆసీస్ గెలిస్తే టీ20ల్లో అగ్రస్థానం చేజిక్కించుకుంటుంది.

ఇకపై కోటు, ప్యాంటు

మహిళా అథ్లెట్ల వస్త్రధారణపై ఐఓఏ నిర్ణయం



న్యూఢిల్లీ : సంప్రదాయ చీర కట్టుకు మహిళా అథ్లెట్లు ఇకపై టాటా చెప్పనున్నారు. క్రీడా పోటీల ప్రారంభోత్సవ పరేడ్‌లలో చీరలకు బదులుగా కోటు (బ్లేజర్), ప్యాంటు ధరించనున్నారు. ఈ మేరకు భారత ఒలింపిక్ అసోసియేషన్ (ఐఓఏ) ఓ ప్రకటనలో తెలిపింది. అథ్లెట్లను సంప్రదించిన తరువాతే ఈ నిర్ణయానికి వచ్చామని ఐఓఏ అధికారులు వెల్లడించారు. దీంతో ఈ ఏడాది ఏప్రిల్‌లో జరుగనున్న గోల్డ్‌కోస్ట్ కామన్‌వెల్త్ గేమ్స్‌కు మహిళా అథ్లెట్లు కోటు, ప్యాంటుతో హాజరవనున్నారు. ఐఓఏ అథ్లెట్ల కమీషన్ ప్రధానాధికారి మలావ్ ష్రాఫ్ తాజా నిర్ణయాన్ని స్వాగతించారు. ఐఓఏ అధ్యక్షుడు నరీందర్ బాత్రాకు ఈ మేరకు రాసిన లేఖలో.. 'క్రీడోత్సవాల ఆరంభ, ముగింపు వేడుకలలో ధరించే వస్త్రాలు (చీరలు) మహిళా అథ్లెట్లకు అసౌకర్యంగా ఉంటున్నాయి. వారి సౌకర్యం కొరకు వస్త్రధారణలో మార్పు చేయటం అభినందనీయం.' అని ష్రాఫ్ పేర్కొన్నారు. షూటర్ హీనా సిధు మాట్లాడుతూ 'మాలో చాలా మందికి చీర కట్టుకోవటం తెలీదు. కోటు, ప్యాంటు ధరించటం వల్ల సమయం ఆదా అవటమే కాక సౌకర్యంగానూ ఉంటుంది.

విజయ్‌హజారే క్వార్టర్‌ఫైనల్స్

న్యూఢిల్లీ : భారత స్వదేశీ లీగ్ విజయ్ హజారే ట్రోఫీ క్వార్టర్‌ఫైనల్స్ బుధవారం నుండి ప్రారంభం కానున్నాయి. తొలి క్వార్టర్‌ఫైనల్ మ్యాచ్‌లో హైదరాబాద్ జట్టు కర్ణాటక జట్టుతోనూ... మరో మ్యాచ్‌లో ముంబయి జట్టు మహారాష్ట్ర జట్టుతోనూ తలపడనున్నాయి. ఇప్పటివరకు లీగ్‌దశలో తలపడిన జట్లు క్వార్టర్‌ఫైనల్‌నుండి నాకౌట్‌పద్ధతి పోటీపడతాయి. ఆంధ్ర జట్టు ఢిల్లీలో 22న ఢిల్లీలోని పాలమ్ ఎ స్టేడియంలో తలపడనుంది.

ఉద్యోగులను, అధికారులను బెదిరించడం మంచిది కాదు

అమరావతి జెఏసి చైర్మన్ బొప్పరాజు

ప్రజాశక్తి–అమరావతి బ్యూరో

ప్రభుత్వ ఉద్యోగులను, అధికారులను బెదిరించడం మంచిది కాదని అమరావతి జెఏసి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు అన్నారు. అమరావతి జెఏసి కార్యవర్గ సమావేశాన్ని సచివాలయంలో మంగళవారం నిర్వహించారు. సిఎంఒలో పనిచేస్తున్న ఐఎఎస్ అధికారి, సతీష్‌చంద్ర, ఐపిఎస్ ఎవి వెంకటేశ్వరరావులపై ఎంపి విజయసాయిరెడ్డి వ్యక్తిగత ఆరోపణలు చేస్తూ బెదిరించడాన్ని ఖండిస్తున్నామన్నారు. వైపిసి ప్రభుత్వం వచ్చాక కొంత మంది ఉద్యోగులను తరిమి కొడతామని గతంలో వైసిపి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి బెదిరిస్తే, ఇప్పుడు విజయసాయిరెడ్డి అధికారులను బెదిరిస్తున్నారని తెలిపారు. బెదిరింపుల ద్వారా సాధించేదేమీ ఉండదని, అధికారులను నిరుత్సాహ పరచటంతో సంక్షేమ పథకాలు కుంటుపడే ప్రమాదం ఉందని అన్నారు. ఏ పార్టీ అధికారంలో ఉన్నా ప్రభుత్వ ఉత్తర్వులకు లోబడి ఉద్యోగులు అధికారులు పని చేస్తారని, అధికారులను కించపరచడం మంచిది హితవు పలికారు. బుధవారం నిర్వహించే కేబినెట్‌లో 11వ పిఆర్‌సి కమిషన్‌ను నియమించాలని, పదో పిఆర్‌సి అరియర్స్‌ను చెల్లించడంతో పాటు పెండింగ్ డిమాండ్లపై నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అమరావతి జెఏసి సెక్రటరీ జనరల్ టివి ఫణి పేర్రాజు, ట్రెజరర్ మురళీ కృష్ణా నాయుడు, కో చైర్మన్ ఆల్ఫ్రెడ్, ఈశ్వర్, సంగీతరావు తదితరులు పాల్గొన్నారు.

ఎపి పర్యాటకంపై తపాలా బిళ్లలు

పర్యాటక శాఖ కార్యదర్శి మీనా

ప్రజాశక్తి–అమరావతి బ్యూరో

ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగ ప్రాధాన్యతలు పోస్టల్ స్టాంప్ (తపాళా బిళ్ళ) రూపంలో విశ్వవ్యాప్తం కానున్నాయని పర్యాటక శాఖ కార్యదర్శి ముకేష్ కుమార్ మీనా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తపాలా శాఖ అందిస్తున్న మై స్టాంప్ పథకాన్ని సద్వినియోగం చేసుకుంటూ ప్రత్యేక కార్యక్రమానికి చేపట్టినట్టు పేర్కొన్నారు. రాష్ట్రంలోని పన్నెండు పర్యాటక ప్రాంతాలపై ప్రత్యేక తపాలా బిళ్లలను విడుదల చేయించటం ద్వారా అటు ప్రత్యక్షంగానూ, ఇటు పరోక్షంగానూ మన పర్యాటక ప్రాంతాలు మరింతగా ప్రజల్లోకి వెళ్లేలా కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు. ప్రపంచంలోనే రెండో అతిపెద్ద దేవాలయ పర్యాటక ప్రాంతంగా ఉన్న తిరుమల తిరుపతి దేవస్థానం, శ్రీశైలం దేవస్థానం, విజయవాడ కనకదుర్గమ్మ గుడి, అరకు గిరిజన ప్రదర్శనశాల, కడపలోని గండికోట రాతిలోయ, విశాఖపట్నం ఆర్‌కె బీచ్, చిత్తూరులోని చంద్రగిరి కోట, అమరావతిలోని పవిత్రసంగమం, గోదావరి తీరాన పాపికొండలు, అరకు బొర్రాగుహలు, నెల్లూరులోని పులికాట్ సరస్సు, అమరావతి జ్ఞానబుద్ధుడు ఇలా 12 ప్రాంతాల చిత్రాలతో తపాళా బిళ్లలు సిద్ధం చేశామని పేర్కొన్నారు. త్వరలో ముఖ్యమంత్రి చంద్రబాబు వీటిని ఆవిష్కరించనున్నారని తెలిపారు.

సామాన్యుడికి అందుబాటులో సినిమా టిక్కెట్ల ధరలు : మంత్రి కాలవ

ప్రజాశక్తి–అమరావతి బ్యూరో

సామాన్యులకు అందుబాటులో ఉండే విధంగా సినిమా టిక్కెట్ల ధరలు నిర్ణయిస్తామని రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కాలవ శ్రీనివాసులు తెలిపారు. సచివాలయంలో మంగళవారం సినీ నిర్మాతలు, ఎగ్జిబిటర్ల సంఘ ప్రతినిధులతో సినిమా టిక్కెట్ల ధరల నిర్ణయంపై ఆయన సమావేశం నిర్వహించారు. నగరాలు, పట్టణాల్లోని ఎసి సినిమా థియేటర్లలో టిక్కెట్ల ధరలు ఒకే విధంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని వారు మంత్రిని కోరారు. ఈ ప్రతిపాదనకు మంత్రి అంగీకరించలేదు. ఆయా ప్రాంతాల వారీగా ప్రజల ఆర్థిక పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని టిక్కెట్ల ధరలు నిర్ణయిస్తామని మంత్రి స్పష్టం చేశారు. సామాన్యులకు అందుబాటు ధరలకు వినోదం అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. మరోసారి మంత్రివర్గ ఉప సంఘ సమావేశంలో సినిమా టిక్కెట్ ధరలపై తుది నిర్ణయం తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర హోంశాఖ ముఖ్య కార్యదర్శి అనురాధ, సినీ నిర్మాతలు సురేష్ బాబు, తమ్మారెడ్డి భరద్వాజ, సి కల్యాణ్, ఎగ్జిబిటర్ల సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.



చెరువులో మృతి చెందిన వారి మృతదేహాలు



తమిళనాడుకు చెందిన అంబులెన్స్‌లో మృతదేహాలను ఎక్కిస్తున్న సిబ్బంది

మృతదేహాలు అప్పగింత

- తమిళనాడు పోలీసు, రెవెన్యూ సిబ్బంది సమక్షంలో ప్రక్రియ
- సొంత ప్రాంతానికి తరలింపు

ప్రజాశక్తి – కడప సిటీ ప్రతినిధి

ఒంటిమిట్ట చెరువులో అనుమానాస్పదంగా నీటిపై తేలుతూ కనిపించిన మృతదేహాలను పోలీసులు పూర్తి స్థాయిలో నిర్ధారించి మంగళవారం వాటిని బంధువులకు అప్పగించారు. మృతులను వారి వివరాలను గుర్తించేందుకు గత రెండు రోజులుగా పోలీసులు కృషి చేస్తున్న విషయం తెలిసిందే. ఆదివారం ఘటనా స్థలం వద్ద దొరికిన కొన్ని ఆధారాలను, ఆనవాళ్లను ఆసరా చేసుకుని పోలీసులు మొదట వీరిని తమిళులుగా ఊహించారు. సోమవారం నాటికి తమిళ ప్రసార మాధ్యమాలు ఇచ్చిన ప్రాథమిక సమాచారం సాయంతో మృతులు సేలం జిల్లాకు చెందిన వివిధ గ్రామీణ వాసులుగా గుర్తించారు. సిఐ ఆర్.ఉమాశంకర్, రెవెన్యూ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసరు ఆర్.అనంతకుమార్ సమక్షంలో బంధువుల వివరాలను స్థానిక పోలీసులు సేకరించి వారి వద్ద నుంచి ఓటరు, ఆధార్, రేషన్ కార్డు వంటి ఆధారాలను పరిశీలించారు. మురుగేశన్, జయరాజ్, మురుగేశన్, కురుప్పనన్, చిన్నప్పయన్‌లుగా అధికారికంగా బంధువులు గుర్తించారు. అన్ని నిబంధనల ప్రకారం బంధువుల రక్త నమూనాలనూ సేకరించారు. పూర్తిగా నిర్ధారణ చేసుకున్న తరువాత మధ్యాహ్నం 2.10 నిమిషాల ప్రాంతంలో ఓఎస్‌డి అద్నన్ నయీమ్ అస్మీ దగ్గరుండి మృతదేహాలను బంధువులకు అప్పగించారు. అంబులెన్స్ వాహనాల్లో మృతదేహాలను తరలించారు. ఒంటిమిట్ట చెరువులో చోటుచేసుకున్న మృత్యుఘటన పలు అనుమానాలకు తావిస్తోందని, దీనిపై సిబిఐతో విచారణ చేయించాలని పీపుల్స్ వాచ్ హక్కుల సంస్థ ప్రతినిధులు ఎస్.రవి, సెంథిల్ డిమాండ్ చేశారు.



పుట్టిన 28 రోజులకే నిండు నూరేళ్లు

- ఏడాదికి 6 లక్షల మంది నవజాత శిశువుల మృతి
- యునిసెఫ్ అధ్యయం వెల్లడి

న్యూఢిల్లీ : ఏడాదికి ఆరు లక్షల మంది చిన్నారులకు పుట్టిన 28 రోజులకే నూరేండ్లూ నిండుతున్నాయి. నవజాత శిశు మరణాల సంఖ్య ప్రపంచంలోనే మన దేశంలో అత్యధికంగా ఉన్నట్టు యునిసెఫ్ తాజా అధ్యయనం వెల్లడించింది. వీటిలో ఎక్కువ భాగం మరణాలు నివారించేవి, వైద్యపరంగా చికిత్స చేయగలిగినవేనని గుర్తించింది. ఈ మరణాల్లో 80శాతం ఎటువంటి తీవ్రమైన కారణాలతో సంభవించినవి కాదని స్పష్టం చేసింది. కాగా... దేశంలో ఐదేండ్లలోపు చిన్నారుల్లో మరణాల రేటు తగ్గిందని ఆ అధ్యయనం పేర్కొంది. "దేశంలో శిశు మరణాల సంఖ్య గణనీయంగా తగ్గినప్పటికీ, ప్రతి ఏడాదీ చనిపోతున్న శిశువుల సంఖ్య ఆమోదయోగ్యం కానిది. ప్రతి ఏడాదీ సుమారుగా 6,00,000 మంది నవజాత మరణాలు భారతదేశంలో సంభవిస్తున్నాయి" అని యునిసెఫ్ తెలిపింది. ప్రసూతి మరణాలకు సంబంధించి 'ప్రతి చిన్నారీ బతకాలి' పేరుతో యునిసెఫ్ ఈ నివేదకను మంగళవారం విడుదల చేసింది. ప్రతి వెయ్యి జననాల్లో 24.4 మరణాల రేటుతో 184 దేశాల్లో భారత్ 31వ ర్యాంకు సాధించింది. శిశువుకు మొదటి 28 రోజులు చాలా దుర్బలమైన కాలం. పసికందుల్లో తొలి నెలలో అత్యధిక ప్రమాదం పొంచి వుంటుంది. ప్రపంచవ్యాప్తంగా నెలరోజుల లోపు చిన్నారుల్లో మరణాలరేటు ప్రతి వెయ్యిమందిలో 19గా నమోదైనట్టు నివేదిక తెలిపింది. 2016లో 2.6 మిలియన్ల మంది పుట్టిన నెల రోజుల్లోపు చనిపోయారనీ, అందులో వారం రోజుల వయస్సుగల చిన్నారులో ఎక్కువని యునిసెఫ్ నివేదిక పేర్కొంది.

'చనిపోయిన పసికందుల్లో.. 80 శాతం కంటే ఎక్కువ మంది చికిత్సచేయగలిగినవేనని, నెలలు నిండకుండానే పుట్టడం, డెలివరీ సమయంలో సమస్యలు, సెప్సిస్, న్యుమోనియా తదితర అంటువ్యాధులు సోకి మరణించారు' అని తెలిపింది. పరిశుభ్రమైన తాగునీరు, వైద్య సౌకర్యాలు, తల్లి, నవజాత శిశువుకు నాణ్యమైన ఆరోగ్య సంరక్షణ కోసం ఉండాలి. డెలివరీ సమయంలో ఒక మృత్తి నైపుణ్యం కలిగిన ఆరోగ్య కార్యకర్త, శిశువు జన్మించిన మొదటి గంటలోపు తల్లిపాలు తాగించడం తదితర చర్యలతో శిశుమరణాలను చాలా వరకు అరికట్టవచ్చునని స్పష్టం చేసింది.

మే నెలలోనే పంట రుణాలు

పగటిపూట 9 గంటలు ఉచిత విద్యుత్

ప్రజా సంకల్పయాత్రలో జగన్

ప్రజాశక్తి–శింగరాయకొండ

'వడ్డీలేని రుణాలు, పంట రుణాలు బ్యాంక్ ద్వారా ప్రభుత్వం ఇస్తుందని, జూన్ మాసంలో నాగలిపట్టే రైతు కోసం మే నెలలోనే రూ.12,500 పెట్టుబడి భరోసా కింద రుణాలు ఇస్తామని' వైసిపి అధినేత జగన్ మోహన్ రెడ్డి హామీ ఇచ్చారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు పగటి పూట 9 గంటలు ఉచిత విద్యుత్ ఇస్తామని భరోసా ఇచ్చారు. మంగళవారం ప్రజా సంకల్పయాత్ర పొన్నలూరు మండలం చౌటపాలెం, తిమ్మపాలెం, లింగంగుంట, మాలపాడు, చెరుకుంపాలెం వరకు సాగింది. మాలపాడు తిమ్మపాలెం మధ్య పొలాల్లో రైతు సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడారు. నాలుగు సంవత్సరాల నుంచి రైతులు పడుతున్న బాధలు తాను చూశానని చంద్రబాబు ఓట్ల కోసం రైతులను మోసం చేశాడని ఆయన అన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే వెలిగొండ ప్రాజెక్టును, సంగమేశ్వర ప్రాజెక్టును పూర్తి చేసి ప్రతి రైతుకు సాగు నీరు అందిస్తామన్నారు. ప్రతి గ్రామంలో గ్రామ సెక్రటేరియట్ ఏర్పాటు చేసి ఆ గ్రామంలో యువతకు 10 మందికి ఉద్యోగాలు ఇచ్చి ప్రభుత్వ పనులన్నీ 72 గంటల్లో పూర్తి చేసేలా చూస్తానని ఆయన ఈ సందర్భంగా ప్రకటించారు. ప్రతి మండలంలో కోల్డ్ స్టోరేజ్ ఏర్పాటు చేస్తామని, పంటలకు గిట్టుబాటు ధర అమలు చేస్తామని హామీ ఇచ్చారు. ప్రతి నియోజకవర్గంలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేస్తామన్నారు. తెలుగుదేశం హెరిటేజ్ డెయిరీని లాభాల్లోకి తీసుకువచ్చేందుకు ప్రభుత్వ డెయిరీలను నాశనం చేసిన ఘనత చంద్రబాబుదే అన్నారు. వైసిపి అధికారంలోకి వచ్చిన వెంటనే ఒంగోలు డైరీని లాభాల్లోకి తీసుకువచ్చే బాధ్యత తీసుకుంటానని భరోసా ఇచ్చారు.



పాదయాత్రలో జగన్‌తోపాటు నడుస్తున్న ఎంపీ వైవి సుబ్బారెడ్డి, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి



Published and Printed by Paturu Ramaiah on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governarpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Paturu Ramaiah, Ph : 2577248, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68